RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 21 Issue No. 4 Monthly April 2024 ISSN No. : 2456-4702 Rs. : 15/-



## కందుకూరి వీరేశలింగం పంతులు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)




# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

Mail : bhavaveena2024@gmail.com

Cell : 9949929674, 7989088274

**BHAVAVEENA**
(MONTHLY MAGAZINE)
Journal - Arts, Literature, Cultureand Language Study

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **ఏప్రియల్ – 2024** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి.నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు – 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి.నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు – 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509. |



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***
Kolla Sri Krishnarao (Late)

***E-mail :***
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 21 - Issue : 4 - April 2024 - ISSN No.: 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs.: 15/-**

**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,***

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
***M.A.(Tel), M.A.(Pol-Sci.)., M.Ed., Ph.D.,***
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P

2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.

6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu &
Chairman, BOS Philothrophy& Religion Studies,
Andhra University, Visakhapatnam.

7. **Prof. T. Ramaprasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University Kadapa, Andhra Pradesh.

8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
Principal,
St Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.

2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Prof. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Professor, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P. R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46.
Hyderabad. Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narsapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur- 2 . 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494 660 509.

# కందుకూరి వీరేశలింగం పంతులు

**(జననం : 1848 ఏప్రిల్ 16 మరణం : 1919 మే 27)**

కందుకూరి వీరేశలింగం పంతులు గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. సంఘ సంస్కర్త, సాహితావేత్త మరియు గొప్ప కవి. పంతులు గారు తెలుగు సాహిత్య రంగానికి వీరు చేసిన కృషి వెలకట్టలేనిది. పంతులు గారితోనే తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగం ప్రారంభమయ్యేనని చెప్పవచ్చును. వీరికి పూర్వమే వివిధ సాహితీ ప్రక్రియలు తెలుగు సాహిత్యంలో శ్రీకారం చుట్టిన మహనీయులు కొందరున్నను ఆయా రంగాలలో విశిష్ట కృషి చేసిన వ్యక్తి పంతులు గారే. అంతేకాకుండా ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నింటిని ప్రాచుర్యం కల్పించి “నవయుగ వైతాళికుడు”గా ప్రసిద్ధికెక్కారు.

కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16న అనగా కీలక నామ సంవత్సర చైత్రశుద్ధ త్రయోదశి భానువారంన పున్నమ్మ, సుబ్బరాయుడు దంపతులకు జన్మించారు. వీరి పూర్వీకులు ఇప్పటి ప్రకాశం జిల్లాలోని కందుకూరు గ్రామం నుండి ఏలూరుకి వలస వెళ్లారు. ఆ తరువాత వీరి తాత గారు స్వగ్రామమగు ఏలూరును విడిచి వచ్చి రాజమండ్రిలో స్థిరపడ్డారు. అందుకే పంతులు గారి ఇంటి పేరు కందుకూరి'గా స్థిరపడిపోయింది.

వీరేశలింగం చిన్నతనం నుండి కృషి, పట్టుదల, కష్టపడేతత్వం గలవారు. ఆయనకు నాలుగేళ్ల వయస్సులోనే తండ్రి చనిపోయారు. పెదనాన్న, నాయనమ్మల పెంపకంలో అల్లారుముద్దుగా పెరిగారు. చిన్నతనం నుండి పురాణ పఠన శ్రవణములందు వీరేశలింగం గారికి ఆసక్తి ఎక్కువ. ఆయన 1853లో ఐదవ యేట వీధిబడిలో చేరి బాలరామాయణం ఆంధ్రనామ సంగ్రహం, అమరం, రుక్మిణీ కల్యాణం, సుమతీ శతం, కృష్ణశతకం మొదలైనవి నేర్చుకున్నారు. 1860వ సంవత్సరంలో తన పన్నెండో యేట రాజమండ్రిలో దొరతనము వారి పాఠశాలలో ఆంగ్లవిద్య అభ్యసించుట ప్రవేశించాడు. ఆయన చిన్నతనం నుండి ప్రథమశ్రేణిలోనే ఉండేవాడు. 1861లో తన పదమూడో యేట బాపమ్మ (కందుకూరి భార్య లక్ష్మమ్మ) అనే ఎనిమిదేళ్ల అమ్మాయితో బాల్య వివాహం అయ్యింది. తరువాత వీరేశలింగం ఇటువంటి దురాచారాలను నిర్మూలనకే కృషి చేశారు.

కందుకూరి వీరేశలింగం పంతులు చదువుకునే రోజుల్లో కేశవ చంద్రసేన్ రాసిన పుస్తకాలు చదివి ఎంతో ప్రభావితుడయ్యాడు. అంతేకాకుండా రాజరామమోహన్‌రాయ్ స్థాపించిన బ్రహ్మసమాజం సిద్ధాంతాలకు ఆకర్షితుడై భారతీయ సమాజంలో ఉన్న సాంఘిక, దురాచారాలు, మూఢ నమ్మకాలైన బాల్య వివాహం, సతీసహగమనం, వరకట్నం, వితంతు వివాహాలను ప్రోత్సహించడం మొదలగు అంశాలపై ఉద్యమించి యుగకర్తగా ప్రసిద్ధికెక్కారు.

1867లో పంతులు గారి పెదనాన్న మరనంతో జీవనోపాధి కోసం ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. 1868-69కాలంలో రెండు శతకాలను రచించారు. 1870లో శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం రచించారు. 1874లో ధవళేశ్వరం పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉండగా అష్టావధానం చేశారు. ఆ తరువాత పంతులు గారు ఒక వైపు సాహత్యం మరొకవైపు సంఘ సంస్కర్తగా తన కార్యక్రమాలను ప్రారంభించారు. పంతులు గారు ధవళేశ్వరం బాలికా పాఠశాలను 1974లో స్థాపించారు. 1979 లో బ్రహ్మసమాజాన్ని స్థాపించారు. ఈ సమాజం ద్వారా చదువుకి దూరమైన పేద యువతులకు రాత్రి పాఠశాలలను ఏర్పాటు చేశారు. విద్యే స్త్రీ అభివృద్ధికి మూలం అని నమ్మాడు. 1881 డిసెంబర్ 11న పంతులు గారు ప్రప్రథమంగా వితంతు వివాహం జరిపించాడు. అదేవిధంగా 1897-98లో వితంతు శరణాలయం స్థాపించారు.

కందుకూరి వీరేశలింగం తెలుగులోకి ఆధునిక ప్రక్రియలలో చాలా మటుకు “నేనే మొదట రచించితి’నని స్వీయ చరిత్రలో పేర్కొన్నారు. తొలి స్వీయచరిత్ర తొలి నాటకం తొలికథ, తొలి ప్రహసనం, తొలి వచన ప్రభంధం, తొలి కవుల చరిత్ర, తొలి శాస్త్రీయ గ్రంథాల నిబంధనం కందుకూరి వారు రాసినట్లు తెలుస్తుంది. అంతకముందే నాటక రచన, వచన ప్రబంధ రచన లేకపోలేదు. అయితే వివిధ ప్రక్రియల్ని చేపట్టి, వాటికి మంచి ప్రాధాన్యాన్ని, ప్రాచుర్యాన్ని కలిగించింది నిస్సందేహంగా కందుకూరి వారే అని చెప్పవచ్చును. కాబటి& కందుకూరి వారిని “ఆధునిక సాహిత్య నిర్మాత”గా పేర్కొనడం సమంజసమే.

వీరేశలింగం తొలి రచనలు పద్యకావ్యాలే అయినా ‘కవి’గా ప్రఖ్యాతి గాలేదు. తొలినాళ్ళలో శివకేశవులపై “మార్కండేయా”, “శ్రీ రాజమహేంద్ర వరపుర గోపాలా” అనే మగుటంతో రెండు శతకాలు రాశారు. “శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం” అనే మూడు ఆశ్వాసాలు కావ్యాన్ని నలచరిత్రలో రాశారు. పంతులు గారి ఆధునిక దృక్పథానికి సంస్కార దృష్టి ఇందులో కనిపిస్తుంది. ఇది వ్యంగ్య వైభవం గల కావ్యం.

ఆ తరువాత “శుద్ధాంధ్ర భారత సంగ్రహము” అనే పేరుతో అచ్చమైన తెలుగులో మూడాశ్వాసాల గ్రంథం రచించారు. కందుకూరి వారిలో ప్రాచీన కావ్యాల పట్ల, చిత్రగర్భ కవిత్వాల పట్ల వ్యతిరేకత కలిగింది. అర్థ సారస్యంలేని ఊహలతో, పాండిత్య ప్రకర్షతో అటు సరస్వతిని, ఆధునిక సంగీత నాట్యాలతో నారదుని అవమానిస్తున్నారని భావించారు.

దృశ్య కావ్య ప్రధాన ప్రయోజనమైన’ ప్రదర్శనకి ప్రాధాన్యం ఇచ్చి నాటకాన్ని రచించడంలో కందుకూరే ప్రథములు. 1880లో పంతులు గారు ‘ది కామెడి ఆఫ్ ఎర్రర్స్’ అనే ఆంగ్ల నాటకాన్ని “చమత్కార రత్నావళి” అనే పేరుతో తెలుగులో అనువదించి విద్యార్థులచే ప్రదర్శింప జేశారు. దాదాపు వీరు ఇరవై నాటకాలని రచించినట్లు రమాపతి రావు గారు పేర్కొన్నారు. సాంఘిక రూపకాలను వ్యవహారిక భాషల్లో వ్రాయడమే కాకుండా సాంఘిక సమస్యల్ని నాటకాల్లో చిత్రించిన వాళ్ళల్లో పంతులు గారే ప్రథములు అని చెప్పవచ్చును. అంతేకాకుండా నవలా రచనలో కూడా కందూకూరి వారే ప్రథములు. కాని నరహరి గోపాలకృష్ణమశెట్టి రచించిన “శ్రీరంగరాజ చరిత్రము” తొలి తెలుగు నవల అని కొందరి అభిప్రాయం. నవలా రచనపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఎక్కువమంది సాహితీవేత్తలు కందుకూరి వారి “రాజశేఖర చరిత్ర” తెలుగులో తొలి నవల అని అంగీకరించారు. తెలుగులో ప్రహసనాలకు కందుకూరి వారే ఆద్యులు. ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల రాజకీయ, సాంఘిక దురాచారాలను వినోదకంగా, సంభాషణాత్మకంగా వివరించి మాన్పించాలనే ఉద్దేశ్యంతో పంతులు గారు ప్రహసనాలు రచించి తన “వివేకవర్ధని”లో ప్రచురించారు. అంతేకాకుండా తొలి కథను రచించింది కూడా వీరేశలింగం గారి తొలికథ “దిద్దుబాటు” వీరి కథా సాహిత్యం మహిళాభ్యుదయం కోసం చేపట్టారు. స్త్రీ విద&్యను ప్రోత్సహించడం ఆయన ఉద్దేశ్యం. వీరు రచించిన కథలన్నింటిని ‘సతీహిత బోధిని’ పత్రికలో ప్రచురించారు. చివరిగా వ్యాసరచన, కవుల చరిత్ర, స్వీయ చరిత్ర మొదలగు ప్రక్రియలను ప్రప్రథమంగా రచించినది కందుకూరి వారే అని చెప్పడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

ఒక వ్యక్తిగా, సంఘ సంస్కర్తగా రచయితగా వీరేశలింగం పంతులు గారికి అనేక విశిష్టతలు ఉన్నాయి. అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. ఆధునికాంధ్ర సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించిన మహోన్నతుడు పంతులు గారు. కాబట్టి ఆయనను “ఆధునికాంధ్ర సమాజ పితామహుడి”గా కీర్తి గడించారు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | భారతీయ సంస్కృతిలో భాగవత కథల వైశిష్ట్యం | - డా॥. వి.వి.సుబ్బారావు | 8 |
| 2. | లంబాడాల సంప్రదాయంలో 'తీజ్' పండుగను జరుపుకునే విధానం | - డా॥. లక్ష్మణ్ నాయక్ భానోత్ | 13 |
| 3. | నిజామాబాద్ (ఇందూరు) జిల్లా గ్రామ నామాలు | - డా॥. ఎన్. అంబర్‌సింగ్ | 18 |
| 4. | గీత కార్మికుడి మరణ వాంగ్మూలమే - బతుకుతాడు నవల | - డా॥. ఆగపాటి రాజ్‌కుమార్ | 23 |
| 5. | వాల్మీకి చరిత్రము - సామాజిక విశ్లేషణ | - డా॥. నూనావత్ రాంబాబు | 29 |
| 6. | శ్రీకృష్ణదేవరాయల "భువన విజయ" వైభవం | - రాజు మోరె | 34 |
| 7. | చేనేత వృత్తి జీవన కథలు - ప్రపంచీకరణ ప్రభావం | - వై. శివకుమార్ | 40 |
| 8. | తెలంగాణ గేయ కవిత్వంలో ధూంధాం కళారూపం ప్రత్యేకత | - అంతడుపుల నాగరాజు | 46 |
| 9. | తెలంగాణ సాహిత్యంలో జాతశ్రీ జీవితము రచనలు | - కె. నాగేశ్వరి | 52 |
| 10. | నీలా జంగయ్య కవిత్వంలో వివిధ అంశాలు | - బామండ్ల రాజు | 57 |
| 11. | రహస్య చిత్రం కవితా సంపుటి - ఒక పరిశీలన | - బుర్క ప్రియాంక | 61 |
| 12. | ఎస్.ఎమ్. ప్రాణ్ రావు కవిత్వం - పరిశీలన | - గద్దల అనిల్ | 65 |
| 13. | జానపద కళల పరిరక్షణలో ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారి కృషి | - పడకంటి మహేష్ | 70 |
| 14. | భాస్కరభట్ల కృష్ణారావు వింతప్రణయం నవలలో సామాజిక జీవన చిత్రణ | - బిక్షు నాయక్ బుక్య | 74 |
| 15. | కథా సంకలనాల్లో రచయిత్రుల కథల్లో ప్రాంతీయ అస్తిత్వం | - పరుచూరి మౌనిక | 76 |
| 16. | బంజారాల గేయాలు - ప్రదర్శన కళలు | - బానోతు కవిత | 78 |

BHAVAVEENA
Vol. 21, Issue. 04, April 2024 భావవీణ ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# భారతీయ సంస్కృతిలో భాగవత కథల వైశిష్ట్యం

- డా॥. వి.వి.సుబ్బారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్

రామాయణ భారత భాగవతాలు భారతజాతి సంస్కృతికి అమృత కలశాలు. అందులో భాగవత కథలు విశిష్ట మైనవి. వ్యాసుడు అపూర్వసృష్టి భాగవత కథలు తెలుగు సాహితిలో భాగవత కథలను మధించి అనేక ధర్మబద్ధమైన కథలను నిర్మించి సమాజానికి అందిన భక్తకవిపోతన భారతీయ సంస్క ృతికి భాండాగారంగా నిలిచిన కథలు అజామీళుని కథ. గజేంద్రుని కథ, దేవసుర సంగ్రామం, మోహినీ అవతారం, బలిచక్రవర్తి కథ, సముద్రమధన కథ మొదలైన కథల్లో బారతీయ సంస్కృతి, సమసమాజ నిర్మాణం కనిపిస్తాయి. భాగవతాన్ని వేదాల సారం అంటారు. భారతీయ సంస్క ృతి అనేది ఎంత వైదికమయిందో అంత పౌరణికమయింది. పురాణ వాఙ్మయాన్ని దాని స్వభావ ప్రవృత్తిని వివిధ కోణాల నుంచి పరిశీలించిన కథలు భాగవత కథలు.

భాగవత కథలలోని పాత్రలు ఈ ప్రపంచంలో ఎలా నడుచుకుంటే లోకంలో సుఖము శాంతి వర్ధిల్లుతాయో తెలియజేసాయి. ప్రపంచంలో ధర్మాన్ని కాపాడేందుకు విష్ణుమూర్తి అనేకసార్లు ఈ భూమిమీద జన్మించాడు. సంస్కృతి పరిరక్షణ కోసం ప్రతి యుగంలో శ్రీహరి సమరభేరి మ్రోగించాడు. సనాతన సమాజ సంఘటికుడైన కృష్ణుడు ఎందరో దుర్మార్గులను అణచివేశాడు.

నాకు తగిన సమర్ధత ఉంది అనుకుంటే అది ఆత్మ విశ్వాసం. సమర్ధత ఉంది కనుక నేను ఏంచేసినా చెల్లుబాటు అవుతుందనుకుంటే అది అహంకారం. అహంకారం పెరగడానికి ఎవరికైనా ఇంద్రియాలే కారణాలు. అహంకారం యొక్క విజృంభణను నియంత్రించడమే పరమాత్మ దశావతారాలు కాలయవనుడు, శిశుపాల దంతవక్త్రులు, పౌండ్రక వాసుదేవుడు వంటి నీచుల అహంకారాన్ని అణచి భారతీయ సమాజాభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు శ్రీకృష్ణుడు.

**అజామీళుని గాథ :**

ఈ దేశంలో కన్యాకుబ్జ నగరంలో అజామీళుడనే విప్రు డుండేవాడు. వానికి పితృ పితా మహులు సంపాదించి యిచ్చిన సంపద కావలసినంత వుంది. ఆ సంపదను వినియోగించడానికి ఎన్నో సన్మార్గాలు వున్నా యౌవనం ప్రాప్తించే సరికి వానికి దుర్వ్యసనాలన్నీ అలవాటయ్యాయి. జూదంలో పోతున్నది పోతుండగా వేశ్యా సంగమం దానికి తోడైంది. కట్టుకున్న భార్యను గాలికి వదలి వేశ్యాగృహం లోనే సంసార యాత్ర నడుపుతూ పదిమంది పిల్లలను కన్నాడు. వార్ధక్యం ప్రవేశించింది. అవయవాలు పట్టు తప్పి, చూపు మందగించి, జుట్టు ముగ్గుబుట్టలా అయింది.

శ్లేష్మం ప్రకోపించింది. మంచం మీద పడి మూలుగుతూ చేసిన పాపఫలం అనుభవిస్తున్నాడు. వాని బిడ్డలలో కడపటి వాని పేరు నారాయణుడు; వాని మీద మమకారంతో నిరంతరం 'నారాయణ', అని పిలుస్తూనే కన్ను మూశాడు. జీవితంలో చేసిన పాపాల కారణంగా యమకింకరులు వానిని తీసుకు వెళ్ళడానికి వచ్చారు. చివరి శ్వాస విడుస్తూ నారాయణుని స్మరించడం వల్ల విష్ణుదూతలు దివ్య విమానంతో రాగా యమకింకరులు వారిని చూసి- ఆర్యా! తమ రెవరు? ఎందుకు వచ్చారు? మేము యమదూతలం, ఈ పాపిని నరకానికి తీసుకు వెడుతున్నాం అన్నారు.

విష్ణు దూతలు చిరునవ్వుతో నిలబడ్డారు. అప్పుడు యమ దూతలు: మీకు వీని కథ తెలిసినట్లు లేదు. సదాచార పరాయణులైన వేదవేత్తల గృహంలో జన్మించిన వీడు చిన్ననాడు ధర్మబుద్ధితో వేదాధ్యయనం చేశాడు. వంశ మర్యాద విడవకుండా బ్రహ్మచర్య దీక్షతో గురువు లను, అతిథులను పూజించాడు. వయసు రాగానే యోగ్యురాలైన కన్యను పెండ్లి చేసుకున్నాడు. సంసార

యాత్ర సాగిస్తూ, ఒకనాడు దేవీపూజలకు పుష్పాలు తేవడానికి వనానికి వెళ్ళాడు. వసంతం ప్రవేశించింది. వనం అంతా పల్లవాలతో, మొగ్గలతో, వికసించే పూలతో, శుకపిక సంతతుల కలకూజితాలతో యువ హృదయాలను పలకరించి పులకింప జేస్తున్నది. అజామీళుడు పూజకు పుష్పాలుకోసి, చెరువుగట్టున దర్భలు తీసుకుని రాబోతున్న వేళకు నగరంలోని సుందరీజనం విలాసవిహారానికి వచ్చి పాటలు పాడుతూ ఆడుతున్నారు. పూ పొదరింట జేరి ఒక కామినీ మణి మద్యం సేవించి తన ప్రియునితో ఆలింగన చుంబన సుఖం అనుభవిస్తూ అరమోడ్పు కన్నులతో వున్నది. ఆమె కన్నులు అర విరిసిన ఎర్రకలువ రేకుల వలె వున్నాయి. త్రాగిన మైకంలో ఆ లావణ్యలహరి తన ప్రియుని భుజసీమ మీద చెక్కిలి వుంచి చిరునవ్వు వెన్నెలలు కురిపిస్తోంది. ఒళ్ళు తెలియకుండా యిద్దరూ క్రిందా మీదా పడుతున్నారు. జుట్టుముడి వీడి ముఖం మీద చిందర వందరగా పడి గాలికి గిలిగింతలు పెడుతున్నది. చేతి గాజులు, వడ్డాణపు మువ్వలు కిలాకిలా నవ్వుతున్నాయి.

ఆ దృశ్యం ఎంతటివారినైనా ఉద్రిక్తులను చేస్తుంది. అందులో నవ యౌవనంలో వున్న అజామీళుడు! వాని మనసు చెదరింది. చేతిలోని పూజా సామాగ్రి జారిపోయింది. మనసు కామవశమై, అడుగులు పూలవాసనల పందిరి ప్రక్క నుంచి పొదరింటికి నడిచాయి. పర బ్రహ్మోపాసన వైదొలగి పరనారీ సంగమవాంఛ ప్రబలింది. శాస్త్ర చర్చలు వెనుకకు పోయి సరససల్లాపాలు పెరిగాయి. ధర్మపత్ని వెగటై సానిపిల్ల చంక కెక్కింది. ఇంత పతనమైన ఈ పాపి నరకంలో వుండాలి; అన్నారు.

విష్ణు దూతలు: మీరు చెప్పినదంతా యదార్థం. వీడు చెయ్యని దోషం లేదు. కాని ప్రాణావసాన సమయంలో నారాయణ నామం జపించాడు. ఆ నామ ప్రభావం వీని కల్మషాలను హరించింది. ఈ నాడు వీనికంటే పున్యాత్ముడు లేడు, అనగానే యమదూతలు తిరుగు ముఖం పట్టారు. విష్ణుదూతలు వానిని విమానం మీద వైకుంఠం తీసుకు వెళ్ళారు. తిరిగి వచ్చిన యమదూతలు చెప్పిన సంగతులు విని యమధర్మరాజు: కింకరులారా! చూశారా, నారాయణ నామస్మరణ ఎంతటిదో! ప్రజాపతి, పరమశివుడు, కుమారస్వామి, కపిలుడు, నారద, భీష్మ, బలి, ప్రహ్లాద, జనక వ్యాస, శుకయోగీంద్రులకే నారాయణుని దివ్యశక్తి పూర్తిగా తెలుసు. నారాయణ మంత్రపారాయణ అంత దివ్యమైనది, అన్నాడు.

## గజేంద్ర మోక్షం :

గజరాజు ఒకనాడు దాహర్తి అయి తన పరివారముతో ఒక సరస్సులోకి దిగెను. అందులో ఆనందంగా జల క్రీడలాడుతుండగా సరస్సు నందలి జలము కలుషితమైనందున, ఆ ఆలజడికి సరస్సులో నివసిస్తున్న మకరరాజు గజరాజు పాదములను బట్టి లాగుతూ పోరు సాగించెను. తన్ను రక్షించువారు ఎవ్వరూ లేరను విషయము గ్రహించి గజరాజు భగవదనుగ్రహం కోసం శ్రీహరిని ప్రార్థించెను. శ్రీమహావిష్ణువు తన అనుగ్రహముచే మకరమును సంహరించి గజరాజును రక్షించెను. గజేంద్ర మోక్షం కథను అష్టమ స్కంధంలో చూడవచ్చును

'ఏ రూపంబున దీనిగెల్తు? నిటి మీఁదేవేల్పుఁ
జింతింతు? నె
వ్వారిం జీరుదు? నెవ్వరడ్డ ? మిఁక ని వ్వారి
ప్రచారోత్తమున్

ఈ మొసలిని ఏ రీతిగా గెలువగలను ? ఇకపై ఏ దేవుని ప్రార్థించేది ? ఎవరిని పిలిచేది? ఎవరు నన్ను కాపాడుతారు? దొడ్డదైన ఈ మొసలిని అడ్డగించే వారెవ్వరు ? అన్ని కార్యాలలోనూ దిట్టలూ, గొప్ప పుణ్యాత్ములూ దిక్కులేని నా మొర వినేవారు లేక పోతారా? అటువంటి వారికి నమస్కారం చేస్తాను.

'ఎవ్వనిచే జనించు జగ; మెవ్వని లోపల నుండు
లీనమై;
యెవ్వని యందు డిందుఁ; బరమేశ్వరుఁడెవ్వఁడు;
మూల కారణం

బెవ్వఁ; డనాదిమధ్యలయుఁడెవ్వఁడు; సర్వముఁ దానయైన వాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్'

ఈ లోకం ఎవనివల్ల పుట్టుతుందో, ఎవనితో కలిసి ఉంటుందో, ఎవని లోపల లయం పొందుతుందో, ఎవడు పరమాత్ముడో, ఎవడు ఈ విశ్వానికి మూల కారణమో, ఎవడు పుట్టడము, గిట్టడము, పెరగడమూ లెకుండా ఉంటాడో, ఎవడు అన్నీ తానేయై ఉంటాడో అటువంటి ప్రభువైన భగవంతుణ్ణి నేను శరణు కోరుతాను. ఏదీ కాకుండానే అన్నీ తానే అవుతాడు. అటువంటి ప్రభువును నేను ధ్యానం చేస్తాను.

'కలఁడందురు దీనుల యెడఁ
గలఁడందురు పరమయోగి గణములపాలం
గలఁడందు రన్నిదిశలను
గలఁడు కలం డనెడు వాఁడు గలఁడో లేఁడో !.'

దేవుడు ఆర్తులైనవారివెంట ఉంటాడంటారు. ఉత్తములైన యోగుల చెంత ఉంటాడంటారు. అన్ని దిక్కుల లోనూ ఉంటాడని అంటారు. 'ఉన్నాడు ఉన్నాడు' అనే అటువంటి దేవుడు మరి ఉన్నాడో ! లేడో !

ఈ విధంగా తలంచి తన మనస్సులో భగవంతుని నెలకొల్పుకొని గజరాజు ఈ విధంగా ప్రార్థించినాడు.

'లా వొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యెఁ; బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను; మూర్ఛ వచ్చెఁ; దనువున్ డస్సెన్; శ్రమం బయ్యెడిన్;
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ; మన్నింపం దగున్ దీనునిన్;
రావే యీశ్వర ! కావవే వరద; సంరక్షింపు భద్రాత్మకా!.'

భగవంతుడా! నాలో కొంచెం కూడా శక్తిలేదు. ధైర్యం తగ్గిపోయింది. ప్రాణాలు కూడా కదలుతున్నాయి. మూర్ఛవస్తూ ఉంది. శరీరం స్రుక్కిపోయింది. అలసట కలిగింది. నాకు నీవు తప్ప వేరే దిక్కు లేదు. ఆర్తితో కూడిన నన్ను ఆదుకోవడం న్యాయం దేవాధిదేవా! రావయ్యా! వరాలిచ్చే దొరా! కరుణించవయ్యా. పుణ్యాత్ముడా! కాపాడవయ్యా!

'అలవైకుంఠ పురంబులో నగరిలో నా మూల సౌధంబు దా
పల మందారవనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంకరమావినోది యగు నా పన్న ప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము 'పాహి పాహి' యనఁగుయ్యాలించి సంరంభియై.'

కష్టాలలో చిక్కుకొన్న వారిని కాపాడే భగవంతుడు ఆ సమయంలో వైకుంఠంలో ఉన్నాడు. అందులో అంతఃపురంలో ఉన్నాడు. అందులో ఒక ప్రక్కనుండే మేడకు సమీపంలోని అమృత సరస్సుకు దగ్గర చంద్ర కాంత శిలల అరుగుపై కలువ పూల పాన్పుమీద లక్ష్మీ దేవితో వినోదిస్తున్నాడు. భయంతో స్వాధీనం తప్పి 'కాపాడు కాపాడు' మన్న గజేంద్రుని మొరవిన్నాడు. అతనిని కాపాడడానికి వేగిరపడినాడు.

'సిరికిం జెప్పఁడు; శంఖచక్ర యుగముం జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁడభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తర ధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాదప్రోత్థిత శ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.'

గజరాజు ప్రాణాలను కాపాడాలనే ఉత్సాహంతో నిండిపోయిన విష్ణువు లక్ష్మీదేవికి చెప్పలేదు. శంఖచక్రాలను చేతులలోనికి తీసుకోలేదు. సేవకుల నెవరినీ పిలువలేదు. గరుడవాహనం సిద్ధపరచుకోలేదు. చెవిలోని తామర దుద్దు వరకూ జారిన జుట్టుముడిని కూడా చక్కదిద్దుకోలేదు. ప్రణయ కోపంతో లేచిపోతున్న లక్ష్మీదేవి పైటకొంగును కూడా వదలి పెట్టలేదు.

'మకర మొకటి రవిఁజొచ్చెను
మకరము మఱియొకటి ధనదు మాటున డాఁగెన్;
మకరాలయమునఁ దిరిగెడు
మకరంబులు కూర్మరాజు మఱువున్ కరిగెన్.'

ఈ విధంగా సుదర్శన చక్రం రెప్పపాటు కాలంలో మకరం శిరస్సును ఖండించింది. ఆ సమయంలో ద్వాదశరాసులలో ఉండే మకరం సూర్యుని చాటున నక్కింది. నవనిధులలోని మకరం కుబేరుని చాటు చేసుకొని రక్షణ పొందింది. సముద్రంలో తిరుగాడే మకరాలు అది కూర్మం చాటుకు వెళ్ళి దాగుకొన్నాయి.

## దేవాసుర సంగ్రామం :

ఒకనాడు ఐరావతముపై తిరుగాడుతున్న ఇంద్రునికి మార్గమధ్యమున దుర్వాసమహర్షి కనిపించెను. అతడు ఇంద్రుని మెచ్చుకొని తన కంఠాన ఉన్న పుష్పమాలను అతనికి ప్రసాదముగా ఇచ్చెను. ఇంద్రుడు ఆ మాలను ఐరావతపు శిరస్సుపై వేయగా అది ఆ మాలను తొండముతో క్రిందికి విసిరి కాళ్ళతో నలిపివేసెను. తన ప్రసాదమును అలా అవమానించుట చూచిన దుర్వాసుడు ఇంద్రుణ్ణి - శ్రీ భ్రష్టునిగా మారిపొమ్మని శపించెను. ఆ శాపఫలితముగా బలితో చేసిన యుద్ధములో ఇంద్రుడు ఓడిపోయెను. బలి త్రిలోకాధిపతి అయ్యెను. ఓడిపోయిన దేవతలందరూ బ్రహ్మతో కలిసి విష్ణువును శరణుజొచ్చి ఈ విపత్తు నుండి కాపాడుమని కోరిరి. విష్ణువు 'మీరందరూ దైత్యులతో సంధి చేసికొని వారి సహాయముతో మందరాచలమును కవ్వముగా వాసుకి అనే పామును త్రాడుగను చేసి క్షీరసాగరమును మథించిన అమృతము పుట్టును. దానిని త్రాగించి మిమ్ములను అమరులను చేయుదును. ఆ బలముతో మీరు దైత్యులను జయింపవచ్చు' అని చెప్పెను. ఇంద్రుడు బలి వద్దకు వెళ్ళి ఈ విషయములను చెప్పగా అమృతమును పొందవచ్చునన్న ఆశతో సంధికి ఒప్పుకొనెను. దేవతలూ, దైత్యులూ కలిసి మందరాచలమును సముద్రపు ఒడ్డుకు తెచ్చుటకు ప్రయత్నించిరి.

## మోహినీ అవతారం :

'ఈ అన్నుల మిన్న ఎవ్వరిదో కదా! ఏ కల్పంలోనూ నేను ఇటువంటి అందమైన ఆడదానిని చూడలేదు. ఈమెను బ్రహ్మ సృష్టించ లేదనడం తథ్యం. ఈ ఒయ్యారిని ఇల్లాలుగా పొందగలిగే అదృష్టవంతుడెవడో! ఈ లావణ్యవతి నా లీలావిహారాలకు లభిస్తుందా ?' అనుకొన్నాడు శివుడు. అంతలో మన్మథుని జయించిన పరమశివుని నిబ్బరం నీరైపోయేటట్లు మోహిని ముడుచుకున్న కొప్పుముడి వీడింది. వెంద్రుకలు భుజాలపైన, మెడపైనా చెదరి కదలాడినాయి. మోహిని ఎఱ్ఱ తామరల వంటి తన పాదాల అరుణ కాంతులతో తూర్పుకొండపైని సూర్య బింబాన్ని స్ఫురింపజేస్తున్నది. అందమైన ఆ వగలాడి వాడి చూపుల వల్ల శివుడు నిగ్రహాన్నీ, నిబ్బరాన్నీ పూర్తిగా గోల్పోయినాడు. తన్ను తాను మరచిపోయినాడు. తన ఇల్లాలినీ, ప్రమథగణాలనూ విస్మరించినాడు. ఆ సమయంలో మోహిని బంతిని ఎగురవేసింది. పట్టుకోవడానికి వీలుపడకుండా అది జారిపడిపోయింది. దానిని తీసుకోవడానికి వస్తుండగా గాలి తాకిడికి ఆమె చీరముడి ఊడిపోయింది. అప్పుడు శివుని మనస్సు కంపించి పోయింది. మోహిని కడగంటి కాంతులు తళుక్కుమని మెరసినాయి. చీర కట్టుకోవడానికి ఆమె ప్రయత్నించింది. ఆమె మేను పులకించింది. స్తనభారంతో ఆమె వంగింది .రెండు చేతులతో ఆమె వక్షఃస్థలాన్ని కప్పుకొన్నది. ఆమె కొప్పుముడి వీడి వ్రేలాడుతున్నది. ఆ స్థితిలో ఆమెను చూచి కామావేశంతో శివుడు చలించి పోయినాడు. అతడు సిగ్గు పడేటట్లు సతీదేవి చూస్తున్నది. అయినా ఆయన మోహిని చేయిపట్టుకోవడానికి వెళ్ళినాడు.

### బలిచక్రవర్తి :

అష్టమ స్కంధంలోని మరో భగవదనుగ్రహం పొందిన కథ బలి చక్రవర్తి. బలిచక్రవర్తి ప్రహ్లాదునికి మనుమడు. ఇతడు దైత్యరాజు. దేవతలచే సహజ వైరం కారణంగా వారినోడించి రాజ్య భ్రష్టుని చేసి స్వర్గలోకాధిపత్యమును

పొందెను. దేవతామూర్తి అయిన అతిధి తన బిడ్డల దుస్థితికి చింతించి నారాయణుని స్తుతించి అతనిని ప్రత్యక్షము చేసుకొంటాడు. శ్రీమన్నారాయణుడు దేవమాత ప్రార్థనను మన్నించి ఆమెకు తనయుడుగా దేవతల రక్షణార్థము వామనమూర్తిగా అవతరించి బలి చక్రవర్తి చేయు యజ్ఞములందు ప్రవేశిస్తాడు. బలి చక్రవర్తి చేత ఆతిథ్యము స్వీకరించి అతని వద్ద నుండి మూడు అడుగుల భూదానమును పుచ్చుకొంటాడు. మొదటి పాదమును ఊర్ధ్వ లోకమునందు, మరొక పాదము భూలోకము నందు పెట్టి, మూడవ పాదమును బలిచక్రవర్తి శిరస్సుపై మోపి శ్రీహరి తన భక్త పరాధీనతను చాటి దేవతలకు స్వర్గాధిపత్యము ఇస్తాడు. అటు తర్వాత బలిని అనుగ్రహించదలిచి, ప్రహ్లాదుడికిచ్చిన మాటకు కట్టుబడి, బలి సంరక్షణా భారమును తానే స్వయంగా స్వీకరించి అతడిని పాతాళమునకు అధిపతిగా చేసి, ఆ నగరమునకు తానే రక్షకుడై ఉంటాడు. ఈ కథ వలన బలిని అనుగ్రహించిన విధానములో సకలైశ్వర్య సంపన్నుడు, సర్వసృష్టి ప్రదాత అయిన శ్రీమన్నా రాయణుడు చిన్నపిల్లవాడై యాచకునిగా అవతరించి భక్తుడైన బలి చక్రవర్తిని దాతగా చరిత్రలో చిరస్థాయిగా నిలిపెను.

సముద్ర మథనం: సముద్ర మథనంలో దేవహితంగా జనార్థనుడు కూర్మ రూపం ధరించి మందర పర్వతాన్ని భరిస్తాడు. దేవతలు, నారదాది ఋషులు కూర్మరూపం ధరించిన విష్ణువును ఆయన అవ్యాయుడు, సాక్షి-అట్లాంటి విష్ణువును స్తుతించారు. సముద్ర మథనం నుంచి ఉద్భవించిన నారాయణ వల్లభ అయిన శ్రీదేవి ఉదయించింది. పురుషోత్తముడయిన విష్ణువు ఆమెను పరిగ్రహించాడు. శ్రీదేవి తేజస్సుతో మోహితులయిన ఇంద్రాది దేవతలు, నారదాది ఋషులు విష్ణువును - ఓ జగన్మయుడవయిన దేవదేవుడవయిన నారాయణా। ఈమె ఎవరు? అని అడిగారు. అప్పుడాయన ఆమె వైపు ఒకసారి చూచి వారితో ఇట్లా అన్నాడు.

'ఇయంసా పరమాశకి । మన్మయీ బ్రహ్మరూపిణీ
మాయామయ ప్రియానుతి । యయేదం మోహితం
జగత్ ॥

అమృతాన్ని త్రాగడం కోసం ప్రయత్నించి సముద్రాన్ని చిలికి రాక్షసులు దుఃఖానికి గురియైనారు. విష్ణుభక్తిలేని వివేక హీనులు తాము కోరిన సంపదలను పొందలేరు. విష్ణువు సముద్రాన్ని చిలికి అమృతాన్ని సంపాదించి రాక్షసుల కనుగప్పి దానిని దేవతలకే పంచిపెట్టినాడు. అటుపిమ్మట దేవతలను హెచ్చరించి గరుడునిపై కూర్చొని వెళ్ళి పోయినాడు.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్ర వచన భాగవతము, రెంటాల గోపాలకృష్ణ.
2. మహాభారతంలో ఉపఖ్యానాలు, సామ్రాజ్యలక్ష్మి
3. పోతన భాగవతము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి ప్రచురణ 1998.
4. ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు, ఆంధ్ర సారస్వత పరిషత్తు, బొగ్గులకుంట హైదరాబాదు.
5. భాగవత రహస్యోపన్యాసములు, పులిపాటి వెంకట సుబ్బయ్య.

❖❖❖

# లంబాడాల సంప్రదాయంలో 'తీజ్' పండుగను జరుపుకునే విధానం

– డా॥. లక్ష్మణ్ నాయక్ భానోత్, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేర్, యాదాద్రి భువనగిరి జిల్లా.

మానవుడు సహజంగానే ఉత్సాహ ప్రియుడు. ఈ ఉత్సాహప్రియత్వమే మనం ఆచరించే పండుగలకు మూల కారణం. ప్రపంచంలో మరే జాతికిలేని పండుగలు హిందువులకున్నాయి. మన పూజించే అసంఖ్యాకమైన దేవతల పేరుతో, రుతుభ్రమణ కాలం పేరుతో, అవతార పురుషుల పేరుతో, పితృదేవతల పేరుతో, వర్థంతుల పేరుతో పండుగలు జరుపుకోవడం మన సంప్రదాయం. పండుగలు మన ధార్మిక, సామాజిక జీవితానికి మూల కందాలుగా ఉన్నాయి. అందరూ అన్ని పండుగల్ని జరుపుకోరు. వారి వారి సంప్రదాయాలు, విశ్వాసాలు దేశాచార కులాచార, మతాచారం ప్రకారం కొందరు కొన్ని పండుగలు జరుపుకుంటారు.

లంబాడాల పండుగలను పరిశీలిస్తే కొన్ని ప్రత్యేకతలు కన్పిస్తాయి. సాధారణంగా జానపదులు జరుపుకునే పండుగలను జరుపుకుంటూనే మరోవైపు తమ సంప్రదాయాన్ని తెలియజేసే మరికొన్ని పండుగలను జరుపుకుంటారు. వారు "తీజ్" పండుగను జరుపుకునే విధానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

సీత్లా భవానిని పూజించే రోజే తీజ్ పండుగను జరుపుకునే విషయాన్ని తండా నాయక్ సమక్షంలో తండా పెద్దలు ఒక నిర్ణయానికి వచ్చి తీజ్ బుట్టలు కొనడానికి నగారా మోగించగా అది విన్న కన్యలు, చిన్నలు, పెద్దలు ఆనందంతో నాయక్ ఇంటికి చేరుకొని వారి అనుమతితో అదే రోజు గోధుమలను నానబెట్టి ఎరుకల వారు చేసిన బుట్టలను కొనుగోలు చేసి సేవాభాయ దండియాడిలకు రెండు తీజ్ బుట్టలను ప్రత్యేకంగా వారి పేరుమీద ఏర్పాటు చేసి తండాలోని ప్రతి ఇంటికి ఒక తీజ్ బుట్ట ఉండేటట్లు చేసి ఎవరికి వారు వాటిని గుర్తుపెట్టుకుంటారు. మరుసటి రోజు సోమవారం ఉదయం ఆయా బుట్టలలో పుట్ట మన్ను, మేక ఎరువును కలిపి నాయక్, నాయకణ్, ఇతర పెద్దల చేత నానపెట్టిన గోధుమల్ని బుట్టల్లో చల్లిస్తారు. భాజా భజంత్రీల నడుమ పుట్టుమన్నును పాటలు పాడుకుంటూ సేకరించేటపుడు మగపిల్లలు కన్యలను అడ్డగిస్తారు.

ఈ తొమ్మిది రోజుల కార్యక్రమం సజావుగా సాగడానికి ఈడులో ఇద్దరు పెద్ద అమ్మాయిలు నాయకత్వం వహిస్తారు. వీరిద్దరి అడుగుజాడల్లో తక్కిన కన్యలు నడుస్తారు. కన్యలందరూ తొమ్మిదిరోజులు భోజన విషయంలో కఠోర నియమ నిష్టిలు పాటిస్తారు. మాంసాహారం, ఉప్పు, కారం మొదలగు పదార్థాలకు దూరంగా ఉంటారు. కేవలం శాఖాహారమే భుజిస్తారు. పూజా కార్యక్రమాలు నాయికలు నిర్వహిస్తారు. ఇలా ఉపవాస దీక్షలో ఉంటేనే, నియమాలు పాటిస్తేనే గోధమనారు చక్కగా ఎదుగుతుందని నమ్ముతారు. ఈ కార్యక్రమానికి సాధారణంగా నాయక్ ఇల్లే వేదిక అవుతుంది. అతని ఇంటి ముందు ఒక 'డాకళో' అంటే మంచెకట్టి దానిపై బుట్టలను పెడతారు. ఈ వేదికకు కొంతదూరంలో హోమగుండాన్ని ఏర్పాటు చేస్తారు. 'తీజ' నిమజ్జనం అయ్యేంత వరకు హోమగుండాన్ని ఆరనివ్వరు. కన్యలు శుచి శుభ్రతను పాటిస్తూ రోజు మూడు పూటల గేయాలు ఆలపిస్తూ బావి, చెరువు లేదా వాగుల నుండి భాజా భజంత్రీలతో నీళ్లు తెచ్చి తీజ్ నారుపై పోస్తారు. తొమ్మిది రోజులు ఈ వేదిక వద్ద ఆటలు, పాటలు, కోలాటం, ఉయ్యాల లూగడం మొదలైనవి చేస్తూ పిల్లలు, పెద్దలు అందరూ ఆనందసాగరంలో మునిగితేలుతుంటారు. ఏడవ రోజు 'ఢమోళి' అనే కార్యాన్ని నిర్వహిస్తారు. ఎనిమిదవ రోజు 'గణ్‌గోర్' పూజా తొమ్మిదవ రోజు నిమజ్జనంతో తీజ్ వేడుక ముగుస్తుంది. 'తీజ్' బుట్టలో గోధుమవలను అలికినపుడు సేవాభాయ, దండియాడి నాటిన విత్తనాలంటూ ఇలా గేయాలను పాడుతారు.

"సేవాభాయ బోరాయో తీజ్ ఘంవులా డెడేరియో
దండియాడి బోరాయియే తీజ్ ఘంవులా డెడేరియో"

**భావం** : సేవాభాయ, దండియాడి అలికిన 'తీజ్' నారును తీసుకురండి.

తీజ్ ఉత్సవం ప్రతి సందర్భంలో అడుగడున గేయాలు ఆలపిస్తారు. తీజ్ బుట్టలకు నీళ్లు పోస్తూ కన్యలు గేయాన్ని ఇలా పాడుతారు.

"ఖోద ఖోదారే సేవాభాయ ఝిరియా ఖోద
అకెలాపి భరె, సకెలాపి భరె
ఛ్వారవాళి భరే, ఛ్వారివాళి భరె
గడెవాం కోరె భామియో ఝిరియా ఖోద"

**భావం** : తీజ్ మొలకలపై నీళ్లు చల్లడానికి మేముతోడే చెలిమ గుంతల్లో నీటి ధారలు సమృద్ధిగా వచ్చేటట్లు చేయాలని సేవాభాయను ప్రార్థిస్తారు. అంతేకాదు ఆడ, మగ పిల్లలు అనే తేడా లేకుండా ప్రతి ఇంటివాళ్లు తీజ్ నిమిత్తం ఆ నీటిని తీసుకెళతారు.

## బోరడి ఝూఫ్కాయేర్ (రేగు చెట్లు దులిపే కార్యం):

తొమ్మిది రోజుల 'తీజ్' నవరాత్రుల్లో భాగంగా కన్యలందరూ రోజు ఉదయం సాయంత్రం తండా బయట ఉండే రేగుచెట్ల ముళ్లకు నానబెట్టిన శనగలను భాజాభజంత్రీల నడుమ పాటలు పాడుకుంటూ కుచ్చుతారు. కాని మగపిల్లలు కట్టెలు పట్టుకొని రేగుచెట్లకు శనగలు కుచ్చనివ్వకుండా కొడతారు. చెట్లను కదిలిస్తుంటారు. అయినా వాళ్లను వారిస్తూ కన్యలు తమపని తాము పూర్తి చేస్తూ ఇలా పాటలు పాడుతారు.

"బోర్ బోర్ తురుఝడెమతె జాయేస్ పడమతె జాయేస్
బోరడి బోరరె కనురో కనియ కనూరోరె

**భావం** : ఓ రేగు పండా! శనగా ! నీవురాలి పడిపోవద్దు. నీవురాలకుండా నేను చెప్పినట్లు అలాగే ఉంటే నిన్ను 'కనియ' అనే చెవి నగ చేయించుకొని ధరిస్తారు.

లంబాడాలు వ్యాపారాన్ని వదలి వ్యవసాయాన్ని చేపట్టారు. అందుకే పాటలో మోటబావి, మోట కాలువలు మొదలైన పదాలు చోటు చేసుకున్నాయి. గజ్జలమోట, వెండి కాలువలు, బంగారు తాళ్లు మొదలైన విశేషణాలతో కూడిన గేయాలని చూద్దాం.

"సేవా భాయ బోరాయో తీజ్ బాయిరో పాలేణో
సోనేర్ సరవ ఘడానె బాయిరో పాలేణో

ఘుగరారి మోటె ఘలానె బాయిరో పాలేణో రెషణ పాటేరి డోరె ఘూలానె యాడిరి పాలేణో రూపేరో కాలవ కడానె బాయిరో పాలేణో వాడినె పాణి ఫెరానె బాయిరో పాలేణో

దండి యాడి బోరాయి తీజ్ బాయిరో పాలేణో
మారి మళాయేతి రాజవేగి తీజ్ బాయిరో పాలేణో
మారి సాతణుతి రాజి వేగి తీజ్ బాయిరో పాలేణో

**భావం** : సేవాభాయ నాటిన తీజ్ ఉయ్యాలలో ఊగుతుంది. ఆ తీజ్ అనే తోటకు నీళ్లు కట్టడానికి భావికి బంగారు సరవలు, గజ్జెలతో కూడిన మోటను, బంగారంతో నేసిన తాళ్లను ఏర్పాటు చేసి వెండితో కాలువలు తీయించి నీళ్లు కట్టించాడు. అలాగే దండియా నాటిన తీజ్ తమ సభికులతోను, సఖులతోను సన్నిహితమైంని వర్ణిస్తారు.

దండియాడి నాటిన తీజ్ కోసం మరోపాట

"సీతాబోయియే అంబాకేరి బాగ్ ఫళె పులె లాగరెచె
తోడె తోడెరె అల్లేమల్లె పూలె పంతియా వసరెచె
సీతాబోయియే నారేంగిరి బాగ్ పంతిఅ వసరెచె
ఓనె ఖాదియే గటలారి హరియే కొబలె పంతియా వసరెచె"

**భావం** : సీతామాత నాటిన మామిడి, జామ చెట్ల తోటలు ఏపుగా పెరిగి వాటికి పూత, కాయలు జోరుగా కాస్తున్నాయి. ఆ జామ పండ్లను పచ్చని అడవి కోయిల తింటుంది.

పై గేయంలో తీజ్ మొక్కలు నాటింది దండియాడి దేవత. కాని సీత మామిడి, జామ తోటల్ని పెంచగా జోరుగా కాసాయి. అందులో జామ పండును పచ్చకోకిల తినడం

విడ్డూరం. తీజ్ మొక్కలు తోటలాగా ఎందగడం బాగుంది. అయితే పచ్చ కోకిల అంటే రామ చిలుకతోనే పోల్చి ఉంటారు. ఎందుకంటే సీతారాముల పేరు వచ్చేటట్లు కూర్చారు. అంతేగాక కోకిల గానం తర్వాత చిలుక పలుకులే కమనీయం.

పండుగలో దేవత ప్రాధాన్యతను తెలుపుతూ తెలియని వాళ్లకు తెలియజేస్తూ ఆనందాన్ని పొందుతారు. పచ్చపచ్చగా ఏపుగా గునుగు పూవులాగ పెరిగే గోధుమ నారును చూస్తూ మురిసిపోతూ ఇలా పాడుతారు.

"లాంబి లాంబియే లాంబడి ఎకేరియా
దళురియె లాంబడి ఎకెరియా
ఝూక ఖారియే లాంబడి ఎకేరియా
సేవాభ్యాయారియే లాంబడి ఎకేరియా
ల్యాజా లెరియే లంబాడి ఎకేరియా"

**భావం** : దండియాడి సేవాభాయాలా ఆ తండా పెద్దలు నాటిన తీజ్ గోధమనారు. గోగునార చెట్లవలె పొడవుగా పచ్చపచ్చగా ఎదుగుతూ ఊరకలేస్తుంది. ఇది దేవతలే నాటినట్లుగా భావిస్తూ దేవతల పేర్లతోపాటు, తండా పెద్దల పేర్లను కూడా స్మరిస్తారు.

అంత్య ప్రాసలతో అలరారే ఈ గేయం వినసొంపైన అందాన్ని సంతరించుకుంది.

తండా సర్వాధికారి భార్య తీజ్ ఆడడానికి వచ్చింది. ఆమె నారుబుట్టను తలపై ధరించిన విధానాన్ని వర్ణించే గేయం.

"నాని బుందియే మారినాని బుందియే నాని బుందిరి
పామడినె కూణె ఓడియే ఎనెఓడియె ఓనె ఓడియె
హచ్చానాయకేరి నాయకణ్ ఓడియే
నాని బుందియే మారినాని బుందియే నాని బుందిరి
ఒలడినె కూణె ఓడియె
ఎనె ఓడియే ఒనె ఓడియే రూపానాయకేరి నాయకణ్
ఒనె ఓడియే"

**భావం** : ఆమె తలపై ధరించిన నారుబుట్టకు బుంది, పామడి, ఒలడి పేర్లు పెట్టి వర్ణిస్తారు. అలాగే తండాలోని ఇతర నాయకుల భార్యలను కూడా పేరు పేరున వర్ణిస్తారు.

అలనాటి శ్రీరాముడే నేటి బాలాజీ అని చెప్పే లంబాడాల గేయం.

"సేవాభాయారి సుతేరి సప్నమా
భాయి భాయిరే హనమాన్ లచమణ్ బాలాజీ"

**భావం** : సేవాభాయ పడుకోనుండగా అతని స్వప్నంలో హనుమంతుడు, బాలాజీ, లక్ష్మణుడు అన్నదమ్ములై కలసి వచ్చారట.

సేవాభాయ గుడిలో కొలువుదీరి ఉండగా ఆ కోవెల ఏ విధంగా మెరుస్తుందో చెప్పే గేయం.

"మ్యరామ బ్యాటి మ్యన పాలకీమా
సేవాభాయ బ్యాటో సోనలె గూడీమా
గూడి చళెకె దూలేమా ఏదనియామా
గూడి చళెకె సారి నంగరీమా సారి మలకేమా"

**భావం** : మెరామ మేనపల్లకిలో సేవాభాయ బంగారు గోపురంలో సేదదీరి ఉండగా ఆ కోవెల ప్రపంచం మొత్తంలో తళుక్ తళుక్ అని మెరుస్తుందట.

**ఢమోళి :**

ఏడవ రోజు అనగా శనివారం ఢమోళి చేస్తారు. ఢమోళి అంటే ఆరోజు ప్రతి ఇంట్లో తీజ్ పేరు మీద బియ్యం పిండితో చేసిన రొట్టెలను బెల్లం కలిపి బాగా పిసికి చిన్న చిన్న ముద్దలు చేస్తారు. దీనినే చూర్మో అంటారు. ఈ విధంగా చేసిన ఉండలను "ఖాసేర్ థాళి" పెద్ద కంచు పళ్లెంలో పెట్టుకొని ఆ పళ్లెమును తలపై ధరించి దానిపై నూతన వస్త్రాన్ని కప్పుకొని కన్యలందరూ తీజ్ దగ్గరకు చేరుకొని పాటలు పాడుతూ ఆకు దొప్పలతో ఆ ముద్దల్ని పెట్టి తీజ్‌కు నైవేద్యం సమర్పిస్తారు. ఆ తర్వాత అందరూ సామూహికంగా పాటలు పాడుతూ ఇల్లిల్లు తిరిగి ఆ దేవతల ప్రసాదాన్ని అందరికీ పంచుతారు.

**గణ్ గోర్ పూజేర్ (గౌరిపూజ) :**

ఎనమిదవ రోజు కన్యలు ఒండ్రుమట్టిని సేకరించి

దానిని చక్కగా నీళ్లలో కలిపి ముద్దుచేసి 'గణ్ గోర్'స్త్రీ, పురుష దేవతల ప్రతిమలను తయారు చేస్తారు. లంబాడ వధూవరులు వేసుకునే సంప్రదాయ వస్త్రాలను ఆ బొమ్మలకు అనుగుణంగా తయారు చేసి వారికి తొడిగించి పెళ్లికి సిద్ధం చేస్తారు.

'గణ్' అంటే బంజార భాషలో భార్య అని అర్థం. 'గోర్' అంటే గ్వార్, భర్త అని అర్థం. ఇక్కడ ఆడ బొమ్మపేరు గణ్ అంటే మెరామ దేవత. మగ బొమ్మపేరు గోర్ అంటే సేవాభాయ. కన్యలు వీరికి 'గణ్ గోర్' అంటే పెళ్లి నిర్వహించడాన్ని వారి అన్నదమ్ములు అడ్డుపడుతుంటారు. చెరువు నుంచి మట్టిని తేనివ్వరు తెచ్చినా ప్రతిమలను తయారుచేయనివ్వరు. చేసినా 'తీజ్' ఉన్న చోటికి తీసుకురానివ్వరు. ఎట్టకేలకు కన్యలు అతికష్టం మీద 'గణ్ గోర్' బొమ్మలకు లంబాడాల సంప్రదాయబద్ధంగా పెళ్లి చేయడంతో మెరామ, సేవాభాయాలను ఏకం చేసే కార్యక్రమం ముగుస్తుంది.

ఆ తర్వాత అక్కడే బియ్యం పాలు, బెల్లంతో వండిన పాయసాన్ని పెట్టె మోదుగాకు దొప్పను తీసుకొని ఆటంకం కలిగించేటప్పుడు ఈ గేయాన్ని అమ్మాయిలు గానం చేస్తారు.

నవెదాడేరి లూణ్ మార్చారి తపస్సరె భీయో చడకలిరో
దోనాదరె దోనాదె నవె దాడేరి భూకిరె భీయో దోనాదరె
దోనాదె
భూకెతి కడువ బ్యాస గాయిరె భీయతారీ జీవెనె రోవుం
కాయిరె
తారె పగెల పడుంచు చడకలీరో దొనదరె భీయా
దోనదె

**భావం :** ఓ అన్నయ్యా తొమ్మిది రోజుల తపస్సులో భాగంగా ఉపవాస దీక్షలో ఉప్పు, కారం లేని ఆహారాన్ని ఒకపూట తింటూ నీరసంగా ఉన్నాను. వంగి వంగి దొప్ప కొరకు నిన్ను వేడుకోవడం వల్ల నడుం నొప్పితో నిల్చోలేకున్నాను. నీకు ప్రాధేయపడతాను. నైవేద్యం పెట్టెదొప్పను ఇచ్చేయి.

కన్యల దీక్షాసమయంలో తినే ఆహారాన్ని కూడా ఇందులో పేర్కొనడం ప్రశంసనీయం. చప్పిడి ఉప్పు, కారంలేని ఆహారాన్ని మాడిపోకుండా ఉన్న పదార్థాలను మాత్రమే భుజిస్తారు. ఇందుకు విరుద్ధంగా భుజిస్తే నారు ఎదగదని వీళ్ల ప్రగాఢ విశ్వాసం. నారు ఎదగనిచో పవిత్రులు కారని అంతరార్థం.

మరోవైపు అబ్బాయిలు గణ్ గోర్ కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తారు. ఈ సందర్భంలో పరస్పర శృంగార, హాస్యరసాలతో కూడిన మాటలు, పాటలు, చేష్టలు కనువిందు చేస్తాయి. యువకులు అమ్మాయిలు చేసిన మట్టి ప్రతిమలను ధ్వంసం చేసే ప్రయత్నం చేస్తారు. కన్యలు చేతికర్రలతో వాళ్లను బాదుతారు. అయినా ఆ దెబ్బలు భరించి కొందరు పరువు ప్రతిష్టలకోసం, మగ వాళ్ళని నిరూపించుకోవడం కోసం ప్రతిమలను ధ్వంసం చేసే ప్రయత్నం చేస్తారు. అప్పుడు కన్యలు ఈ విధంగా పాటలు పాడుతారు.

'మారె గణ్ గోర్ మారె హాత్
ఓ గేరియాఆరి ఛాత్తిమా లాత్'

**భావం :** నాగణ్ గోర్ నా చేతిలో ఉంది. ఆ యువకుల ఛాతిపై తన్నులున్నాయి అని హెచ్చరిక చేస్తూ బెదిరిస్తారు.

**కడావో కరేర్ (పాయసం వండుటం) :**

తొమ్మిదవ రోజు ఇంటింటికి కొన్ని బియ్యాన్ని, కొంత నెయ్యిని సేకరిస్తారు. బియ్యపు పిండితో 'పిసిపాసిలాప్సి' అనే పాయసం తీజ్ ముందు వండుతారు. దీనినే 'కడావో' అంటారు. దానితోనే సేవాభాయకు నైవేద్యం పెడతారు. తర్వాత ఆ పాయసాన్ని తండా మొత్తం ఇంటింటికి పంచుతారు. మరోవైపు తండా జనుల ఆహ్వానాన్ని మన్నించి తమ బంధువులు ఇతర తండాల నుంచి వచ్చిన అతిథులు తీజ్ దగ్గర కొలువు దీరే సమయంలో ఈ గేయాన్ని కన్యలు ఆలపిస్తారు.

అద్వితీయమైన భావనతో అందుకు తగిన అంత్యాను ప్రాసలతో సాగిన ఈ గేయం గమనించండి.

"ఝుమ్మకేళ మారి ఝుమ్మకేళ
మారో మళావో ఘేరాయేరి వేగివేళ
ఝుమ్మకేళ మారి ఝుమ్మకేళ
మారి సాతణు ఆయేరి వేగివేళ
ఝుమ్మకేళ మారి ఝుమ్మ కేళ
మారి తీజ్ తోడేరి వేగివేళ
ఝుమ్మకేళ మారి ఝుమ్మకేళ
మారి తీజ్ జాయేరి వేగి వేళ"

**భావం :** పచ్చగా ఏపుగా ఉండే అరటి చెట్లు లాంటి నా ప్రియమైన తీజ్ మొక్కలు మిమ్ములను తండా ప్రజల, అతిథుల, సఖుల మధ్య సాగనంపే సమయం వచ్చింది.

పవిత్రమైన తీజ్ బుట్టల నుండి కొద్దికొద్దిగా నారును సేకరించి ఆ తండా నాయకునితోపాటు పెద్దలందరికి, అతిథులుగా వచ్చిన వారికి తలపాగ చివరకు కడతారు. అదేవిధంగా స్త్రీలకు 'పేటియా' అంటే లంగానాడకు కడతారు. అంతేగాక ధాన్యం గుమ్ముల్లో డబ్బులు దాచే పెట్టెల్లోను గోధుమ నారును పెడతారు. ఇందుకు ధనలక్ష్మి సంపదలు చేకూరుతుందని తమ ఇంట్లో సకల శుభాలు కలుగుతాయని వీరి ధృఢనమ్మకం.

తీజ్ బుట్టలకు విప్పే ముందు కొబ్బరికాయలు కొట్టి సేవాభాయకు పిసిపాసిలాప్సి అనే పాయసంతో శాఖాహార నైవేద్యం సమర్పించి ప్రార్థిస్తారు.

కన్యలందరూ తమ నవరాత్రుల పండుగ దూరమవుతున్నందులకు శోకసాగరంలో మునుగుతూ నిమజ్జనానికి అనువైన గంగా నది, చెరువు, కాలువలను దూషిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తారు.

నిమజ్జనం చేస్తున్న చెరువుకు చేరుకోగానే కన్యల కోసం చేయించిన చిన్నచిన్న పీటలను వరుసైన అబ్బాయిలు తమ వద్దే ఉంచుకొని గేలి చేస్తుంటారు. యువకులు ఆ పీటలను కన్యలకు ఇవ్వకుండా వేసే ఎత్తులకు కన్యలు పై ఎత్తులు వేసి ఆ పీటలను స్వాధీనపరుచుకుంటూ కన్యలు యువకులను 'గరకలా' గోరింక అని అవహేళన చేస్తూ ఈ గేయాన్ని ఆలపిస్తారు.

'మారె పిఇయా మారే సాత్
ఓ గేరియారి ఛాత్తిమా లాత్
మారె పిడలా మారె హాత్
జే గేరియారి ఛాత్తిమా లాత్'

**భావం :** నా పిడియ నా దగ్గరే ఉంది యువకుల ఛాతిపై తన్నులుంటాయి. నా పీట నా దగ్గరే చేస్తారు. ఆ సమయంలో తీజ్ పండుగ ఎడబాటుకు కన్యలు కళ్లల్లో కన్నీళ్లు కట్టలు తెంచుకుంటాయి. వాళ్ల సోదరులు, సోదరుల వరుసైన వాళ్లు ఆడపడుచులను ఓదార్చుతారు. ఆ చిన్న పీటలపై వాళ్ల కాళ్లను పెట్టి కడుగుతారు. కానుకలు సమర్పిస్తారు. ఈ విధంగా తీజ్ నవరాత్రుల ఉత్సవం ముగుస్తుంది.

## ఉపయుక్త గ్రంథసూచికలు :

1. ఆంధ్రజ్యోతి దినపత్రిక నవ్య వ్యాసం - సమిష్టితత్వమే, పండుగ పరమార్థం, తేది : 9-10-2008.
2. డా॥. జె. రాజారాం, తెలంగాణ బంజారాల మౌఖిక కథలు పరిశీలన, పుటలు : 118, 119.

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 04, April 2024
భావవీణ
ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# నిజామాబాద్ (ఇందూరు) జిల్లా గ్రామ నామాలు

- డా॥. ఎన్. అంబర్‌సింగ్, అసోసియేట్ ప్రొఫెసర్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (స్వ), నిజామాబాద్.

**పరిచయం :**

నిజామాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ఒకటి. ఈ జిల్లాకు ఉత్తరంగా నిర్మల్ జిల్లా, తూర్పున జగిత్యాల మరియు రాజన్న సిరిసిల్లా జిల్లా, దక్షిణాన కామరెడ్డి జిల్లా, పశ్చిమాన మహారాష్ట్ర రాష్ట్రం సరిహద్దులుగా ఉన్నాయి. ఈ జిల్లా 4,288 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఈ జిల్లాలో 33 మండలాలు మరియు 530 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. అయితే ఈ జిల్లా గ్రామాల పేర్లు చాలా ఆసక్తికరంగా మరియు చారిత్రక ప్రాముఖ్యతతో ఉన్నాయి. ఈ గ్రామ నామాల అధ్యయనం చాలా ముఖ్య మైనది.

**ఆవశ్యకత :**

నిజామాబాద్ జిల్లా గ్రామ నామాల అధ్యయనం వలన ఈ ప్రాంతాన్ని పరిపాలించిన ఆయా రాజవంశాల చరిత్రను తెలుసుకోవచ్చు. కొన్ని ప్రాంతాలు కొండలు, గుట్టల మీదుగా చెరువులు, చెట్లు మరియు నదుల పేర్ల మీదుగా గ్రామాల నామాలుగా స్థిరపడ్డాయి. వీటి ద్వారా భౌగోళిక స్థితి గురించి అర్థం చేసుకుంటాం. ఇక్కడి ప్రజలు తెలుగు, హిందీ, మరాఠీ, ఉర్దూ భాషలు మాట్లాడతారు. ఈ భాషల యొక్క వైవిధ్యత మరియు అభివృద్ధి గురించి ఒక అవగాహనకు వస్తాం. ఇక్కడ వివిధ జాతి, మత, వృత్తులకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. ఈ అంశం ప్రాతిపదికన ఏర్పడ్డ గ్రామ నామాల ద్వారా ప్రజల సామాజిక స్థితి గురించి అంచనా వేయవచ్చు. ఇంకా ఈ జిల్లాలో చాలా పురావస్తు ప్రదేశాలు మీదుగా కూడా కొన్ని గ్రామ నామాలు వచ్చాయి. వీటి ద్వారా ఈ ప్రదేశాల చారిత్రక ప్రాముఖ్యత గురిఇంచి ఆకళింపు చేసుకోవచ్చు.

**విషయం :**

నిజామాబాద్ జిల్లా గ్రామ నామ చరిత్రతో ప్రారంభించి, జిల్లాలోని వివిధ గ్రామ నామాల చరిత్రను విశ్లేషిద్దాం.

**నిజామాబాద్ (ఇందూరు) :**

నిజామాబాద్‌ను 8వ శతాబ్దంలో రాష్ట్రకూట వంశానికి చెందిన ఇంద్రవల్లభ పాంత్యవర్ష - ఇంద్ర సోముడనే రాజు పరిపాలించాడు. అతని పేరుపైననే ఈ ప్రాంతానికి ఇందూరు అని పేరు వచ్చింది. మరో కోణంలో కొందరు చరిత్రకారులు 'నిజామాబాద్‌లో మునుపు ఇనుము పరిశ్రమ ఉంది. దీనికి ప్రతీకగా జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథాలయం గుట్ట క్రింది భాగములో కుడివైపు ఇనుమాయి (ఇనుము + అయి) దేవాలయం ఉంది. ఇదే కాలక్రమేణా ముమ్మాయి దేవాలయంగా మారింది. ఈ ఇనుము ఇక్కడ ఉండటం మూలాన ఇనుమూరుగా మారింది. ఇది తర్వాత వ్యవహారంలో ఇందూరుగా స్థిరపడింది' అని అంటారు. 20వ శతాబ్దం తొలినాళ్ళ వరకు కూడా ఈ ఊరు ఇందూరుగానే పిలవబడింది.

అయితే 19వ శతాబ్ది చివర్లో నిజాం నవాబుల కాలంలో, ఈ ఇందూరు ప్రాంతాన్ని, సిర్నాపల్లి గడీ కేంద్రంగా చేసుకొని 'రాణి చీలం జానకీబాయి' పరి పాలించేవారు. వీరి హాయంలో జరిగిన అభివృద్ధి పనులు ఇప్పటికీ అజరామరం. 1887లో మొదటి సాలార్‌జంగ్ జిల్లాలను ఏర్పాటు చేస్తున్నప్పుడు ఈ జానకీబాయే, ఇందూరుగా పిలబడే ప్రాంతాన్నంతా 'నిజాంబాద్'గా మార్చింది. ఆ 'నిజాంబాదే..' క్రమంగా 'నిజామాబాద్'గా మారింది. దీనికి కారణం 'నిజాం నవాబైన మీర్ మహబూబ్ అలీఖాన్ 1899లో హైదరాబాదు నుండి మహారాష్ట్రలోని మన్మాడ్ వరకు రైల్వే మార్గాన్ని నిర్మిం చాలని నిర్ణయించాడు. తొలి ప్రణాళిక ప్రకారం బొల్లారం నుండి మన్మాడ్ రైలుమారగం బోధన్ గుండా వేయ నున్నట్లు తెలుసుకుని, రాణి జానకీబాయి గారు దీన్ని

సిర్నాపల్లి, ఇందూరుల మీదుగా ఏర్పాటు చేసేలా రాజును ఒప్పించారు. దీనికి కృతజ్ఞతగా రాణి గారు, ఇందూరు పట్టణానికి నిజామాబాద్ అని పేరు పెట్టారు. ఆ విధంగా 1905వ సంవత్సరంలోనే నిజామాబాద్ పేరుతో రైల్వేస్టేషన్ ఏర్పడింది. ఈ విధంగా జిల్లా పేరు నిజామాబాద్‌గా చరిత్రకెక్కడం జరిగింది.

**సిర్నాపల్లి :**

తెలంగాణ గడీల్లో అతి పురాతన చరిత్ర గల గడీ నిజామాబాద్ జిల్లాలోని సిర్నాపల్లి గడీ. దాదాపు ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న సిర్నాపల్లి కోట ఇప్పటికీ చెక్కు చెదరకుండా కళాత్మకంగా ఉంది. ఈ కోటపై బురుజులు పిరమిడ్ ఆకృతిలో తీర్చదిద్దబడినవి. ఈ గడీని ప్రస్తుతం పాఠశాలకు దానం చేయడం వల్ల శిథిలం కాకుండా ఉంది.

అయితే ఈ సంస్థానానికి, ఆ పేరు రావడం వెనుక స్థానిక గ్రామస్తులలో ఒక ఆసక్తికరమైన కథ ప్రచారంలో ఉన్నది. 'నిజాం దగ్గర పనిచేసే ఒక అధికారి వేట కోసం, సిర్నాపల్లి అడవిలోకి ఒంటరిగా వెళ్ళి అడవిలోనే దారి తప్పిపోయి కొన్ని రోజులపాటు భయం భయంగా అడవి లోనే గడుపుతుంటే, కట్టెలకోసం వచ్చిన ఒక పన్నెండేళ్ల అమ్మాయి ఆ అధికారిని చూసి క్షేమంగా అడవి నుండి బయటకు తీసుకువచ్చిందట. ఆ అమ్మాయిలో అపార మైన తెలివితేటలు, అత్యంత చురుకుదనం చూసిన ఆ అధికారి నిజాం రాజుతో సంప్రదించి, సిర్నాపల్లి సంస్థానాన్ని ఆ బాలికకు అప్పగించాడని ఒక కథనం. అయితే ఈ బాలికనే స్థానికులు ''చిన్న రాణి'' అని గౌరవంగా పిలచేవారట. ఆ పల్లె ''చిన్నరాణి పల్లె''గా అయిందది. ఇది కాలక్రమంలో సిర్నాపల్లిగా స్థిరపడింది.

**బోధన్ :**

బహు ధాన్యపురం అనే పేరు నేడు బోధన్‌గా పిలువ బడుతున్నది. బహు ధాన్యపురం అనగా అనేక రకాల ధాన్యాలు పండే ప్రాంతం అని అర్థం. అందుకే బకా సురుడు అనే రాక్షసుడు ఇక్కడ ఉండేవాడని మహా భారతేతిహాసం చెప్తుంది. దీని ప్రకారం ''కొన్ని సంఘటన కారణంగా, ఆ రాక్షసుడితో చేసుకున్న ఒప్పందాన్ని అనుసరించి ప్రతిరోజూ గ్రామస్తులు బండెడు అన్నాన్ని, రెండు దున్నపోతులను ఒక మనిషిని అతడికి ఆహారంగా పంపేవారు. రాక్షసుడు వాటిని తిని ఊరిపై దాడి చేయ కుండా ఉండేవాడు. అయితే అదే సమయంలో రాజ్యాన్ని కోల్పోయిన పాండవులు బహుధాన్యపురానికి వస్తారు. అప్పుడు భీముడికి, రాక్షసుడి గురించి తెలుస్తుంది. తర్వాత బకాసురుడితో యుద్ధం చేసి అతన్ని చంపేస్తాడు. ఆ తర్వాత భీముడు, శాండిల్య మహాముని కలిసి ఇక్కడ ఒక ఆలయం కట్టించి శివలింగాన్ని ప్రతిష్టిస్తారు''. అదే ప్రస్తుత బోధన్ పట్టణంలోని గల చారిత్రక ఏకచక్రేశ్వర ఆలయం. ఈ ఆలయం ఆధారంగానే బహు ధాన్య పురానికి ఏకచక్రపురం అనే పేరు వచ్చింది. కానీ 12వ శతాబ్దంలో ముస్లిం రాజులు దండయాత్రలు చేసి, హిందూ ఆలయాలను ధ్వంసం చేస్తున్న సమయంలో ఈ ఆలయాన్ని రక్షించేందుకు ఇసుక, రాళ్లతో ఎవరికీ కనపడకుండా పూర్తిగా కప్పేశారని చరిత్ర. అలా కప్పిన ఆలయాన్ని వందల ఏళ్లపాటు ప్రజలు మరిచిపోయారు. అలా ఏకచక్రపురం అనే పేరును కూడా ప్రజలు మరచి పోయారు. ఆ విధంగా మళ్ళీ బహు ధాన్యపురం అనే పేరే అందరి నోళ్లలో నాని బహుధాన్ - బోధనగా స్థిర పడింది.

**విశేషాంశం :**

1959లో ఒక రైతు ఇల్లు కట్టుకోవడానికి స్థలాన్ని చదును చేస్తుండగా ఏకచక్రేశ్వర గర్భాలయ శిఖరం బయటపడింది. రాళ్లనన్నింటినీ తొలగించి చూస్తే ఆలయం చెక్కుచెదరకుండా అలాగే ఉంది. అదే ఇప్పుడున్న శ్రీ ఏకచక్రేశ్వర ఆలయం, బోధన్.

**ఆర్మూరు :**

'ఆరామ' ఊరు పరిణామంలో ఆర్మూరుగా మారింది. ప్రాచీన కాలంలో ఈ ప్రాంతంలో బౌద్ధారామం ఉండేది. ఇది అక్కడ సహజసిద్ధంగా రాళ్ళతో ఒక గుట్టలా ఏర్పడిన

ప్రాంతాన్ని, గుహలా మార్చుకొని బౌద్ధ సన్యాసులు ఒక ఆరామ ప్రాంతంగా అభివృద్ధి చేసుకున్నారు. ఆ గుట్టకు సమీపంలో ఉన్న ఊరు కాలక్రమంలో "ఆరామ + ఊరు = ఆర్మూరు"గా పిలవడం జరిగింది.

ఈ గుట్టకు సిద్ధుల గుట్ట అని కూడా ఒక పేరుంది. దీనికి కారణం తెలియాలంటే కాస్త బౌద్ధ వాదముల గురించి ప్రాథమిక అవగాహన కావాలసిందే. చరిత్రలో బౌద్ధమతంలో కొన్ని సంఘటనల కారణంగా కొన్ని వాదాలు పుట్టుకొచ్చాయి. అందులో థేరవాదం, మహాయానం మరియు వజ్రయానం అనేవి ముఖ్యమైనవి. వీటిలో మనకు అవసరమైన సమాచారం కొరకు వజ్రయాన దిశలో చర్చిస్తే - ఈ వజ్రయానం 9వ శతాబ్దం తర్వాత సిద్ధ, నాథ సంప్రదాయంగా మారింది. 'సిద్ధి' అంటే కొన్ని విద్యలు సాధించడం అని అర్థం. ఈ సిద్ధ సంప్రదాయం బహుశా ప్రస్తుత ఆర్మూరు ప్రాంతంలో బాగా విస్తరించి ఉండవచ్చు. అందుకే సిద్ధులు ఉన్న ప్రాంతం కాబట్టే "సిద్ధుల గుట్ట' అనే పేరు వచ్చి ఉంటుంది. మరొక కోణంలో చూస్తే నాథ సంప్రదాయంలో 9 మంది గురువులు ఉంటారు. వీరు కూడా ఈ ప్రాంతానికి వచ్చి బోధలు కొనసాగించి ఉండవచ్చు. ఆ కారణంగా నవ నాథపురం అని, తొమ్మిది మంది స్వాముల ఆసనాలు ఎదురెదురుగా 6+3 (ఆరు + మూడు) స్థానాలుగా విడిగా ఉండటం వల్ల కాలక్రమేణా ఆర్మూరుగా స్థిరపడి ఉండవచ్చు.

**బాల్కొండ :**

రాష్ట్ర కూటులు 10వ శతాబ్దంలో ఈ ప్రాంతంలోని ఒక పెద్ద గుట్టపైన, కోటను నిర్మించారు. రాష్ట్రకూటుల ప్రతినిధులైన అల్లయ్య కొండయ్యలు ఈ దుర్గాన్ని పాలించారు. వారి విగ్రహాలు ఇప్పటికీ ఈ దుర్గంలో ఉన్నాయి. అయితే అల్లయ్య, కొండయ్యలు పాలించిన ప్రాంతం అనో లేక వారి విగ్రహాలు, సమాధులు ఆ కోటపైన ఉన్నాయన్న కారణంతోనో ఇది "అల్లయ్య కొండయ్యల కోట" అనే పేరుతో ప్రజల్లో నానింది. అదే పేరు ఔరంగజేబు ఆక్రమించిన సమయంలో 'అల్లా కొండ'గా మారి అనేక దర్గాలకు నిలయం అయ్యింది. ఇదే కాలక్రమంలో 'బాల్కొండ'గా స్థిరపడింది.

## ఇతర గ్రామ నామాలు :

### భౌగోళికంగా గ్రామ నామాలు :

**నది :**

భౌగోళికంగా పరిసరాల ప్రభావంతో నది ఒడ్డున గుట్ట గానీ, దిబ్బ గానీ ఉండి ద్వీపంగా ఏర్పడిన ప్రాంతాన్ని కుర్తి అంటారు. అలాంటివి ఈ జిల్లాలో రెండు గ్రామాల పేర్లు ఉన్నాయి. అవి కుర్తి, రెంజల్ మండలంలోని కందకుర్తి.

**కల్ (రాయి) :**

కల్ అంటే రాయి అని చరిత్రకారులు అభిప్రాయం కల్‌తో పేర్లు చాలా గ్రామాల పేర్లు ఉన్నాయి. అందులో రాయకల్, దోన్కల్, పడకల్, పడగల్ మరియు కల్లడి (కల్ + అడి) మొదలైనవి.

**కొండ (గుట్ట) :**

లేకపోతే గుట్ట పేరుతో కూడా కొన్ని గ్రామాలు ఉన్నాయి. అందులో బాల్కొండ, సిరికొండ, పల్లికొండ, కొండూరు, కొండాపూర్ (కొందాపూర్), తొర్లికొండ, వీరన్నగుట్ట మొదలైనవి.

**చెట్లు :**

చెట్ల పేరుతో కూడా గ్రామాలు ఇలా ఉన్నాయి. అందులో ముఖ్యంగా మామిడిపల్లి, గుమ్మిరియాల, ముల్లంగి, చింతకుంట, మోర్తాడు (మూడు తాడిచెట్ల మధ్య ఉన్న ప్రాంతం), బొప్పాసపల్లి, చింతలూరు, పిప్పెర, తాడ్ బిలోలి, తాళ్లరాంపూర్, కమలాపూర్, వేంపల్లి, వేముగల్ - భీంగల్ మొదలైనవి. అట్లాగే పవ + ఆవళి (వనముల వరుస) అనే పేరుతో వచ్చిన 'వనావళి' కాస్త కన్నడ భాషా ప్రభావంతో 'బోనోల'గా మారింది.

### జైన, బౌద్ధ ఆరామాల మీద గ్రామ నామాలు :

జైన, బౌద్ధ మతానికి సంబంధించిన ఆరామాల మీదుగా సమీప గ్రామాలకు ఆయా పేర్లు ఆపాదించ బడ్డాయి. సిద్ధ సంప్రదాయాన్ని పాటించడం మూలాన సమీప గ్రామానికి 'సిద్ధపురి - సిద్దాపూర్'అనీ, సహజ సిద్ధంగా గుండ్లతో ఉన్న ప్రాంతంలో ఆరామం ఏర్పరచు కున్న కారణాన 'గుండారామం-గుండారం' అని పేర్లు వచ్చాయి. అట్లాగే ధర్మబోధలు తెలిపే ఆరామ ప్రాంతం కాబట్టి ధర్మారం అనీ, బుద్ధుని దమ్మపద ప్రచార ప్రభావాలు కలిగిన ప్రాంతానికి దమ్మన్నపేట అనీ పేర్లు రావడం జరిగింది.

జైన మతానికి సంబంధించిన ఆవాస ప్రాంతమైన 'జైన పల్లి' కాలక్రమేణా 'జన్నేపల్లి'గా మారింది. అదే కోవలో దీక్షపల్లి - డిచ్‌పల్లిగా రూపాంతరం చెందింది.

### వ్యక్తుల పేరు మీద గ్రామ నామాలు :

ఫకీర్ నివాసం ఉన్న ప్రాంతాన్ని ఫకీర్+ఆబాద్ = ఫకీరాబాద్ గా పిలవడం మారింది. అలాగే నసీరుల్ + ఆబాద్ = నసీరుల్లాబాద్, హుస్సేన్‌నగర్, అక్బర్‌నగర్, అలీసాగ్, లక్ష్మాపూర్, వెంకటాపూర్, గంగారంమంద, రామన్నపేట్ మొదలైనవి.

జక్కరానిపల్లి జక్కమ్మ అనే పేరు జైన మతానికి సంబంధించింది అని చెప్తారు చరిత్రకారులు. జైన మత ప్రభావంతో జక్కమ్మ పేరుతోనే జక్రాన్‌పల్లి ఏర్పడింది.

### గ్రామ దేవతల పేరు మీద గ్రామ నామాలు :

ప్రజలు కొలవగానే కోరిన వరాలిచ్చే కొంగుబంగారు దేవతల పేర్ల మీదుగా కూడా ఆయా గ్రామాలకు పేర్లు వచ్చాయి. అవి ఒడ్డేటమ్మ పేరు మీదుగా ఒడ్డేట్‌పల్లి, చౌడమ్మదేవి పేరు మీద చౌడమ్మ కొండూరు అనీ పేర్లు వచ్చాయి. అలాగే పెద్ద నంది విగ్రహం ఉన్న కారణంగా నందిపేట అని, సాక్షాత్తూ రాముని పాదముద్ర కారణాన రామడుగు అని, రుద్రేశ్వరాలయ కారణాన రుద్రూరు అని, నాగులమ్మ గుడి కారణాన నాగంపేట అనే పేర్లు మొదలైనవి.

ఉమా మహేశ్వరాలయం పేరు మీదుగా ఉమ పేరిట (ఉమ+ఇల) ఉమ్మెల అని మారి, కాలక్రమేణా ఉమ్మెడగా స్థిరపడింది.

### వృత్తుల పేరు మీద గ్రామ నామాలు :

వృత్తుల పేరుతో కూడా గ్రామనామాలు ఏర్పడ్డాయి. గొర్లు, గోదలు కాచే గొల్లలు ఎక్కువగా నివసించే ప్రాంతాన్ని గొల్లపల్లి అని, పౌరోహిత్యం చేసే బ్రాహ్మణులు ఉన్న ప్రాంతాన్ని బ్రాహ్మణపల్లి అని, కమ్మరి పనివారు గల ప్రాంతాన్ని కమ్మర్‌పల్లి అని పిలవడం జరిగింది.

**విశేషాంశం :**

ఈ మండలంలో అతి ప్రాచీన కాలం నుంచి 1850 వరకు ముడి ఇనుప ఖనిజం దొరికేది. కావున ఇనుప వస్తువుల తయారీకి ఈ మండలం జగత్ ప్రసిద్ధిగాంచింది. అందుకే మండల కేంద్రానికి కమ్మర్‌పల్లి అనే పేరు వర్తించింది. విజయనగర సామ్రాజ్యాన్ని స్వర్ణయుగంగా పాలించిన శ్రీకృష్ణ దేవరాయుల చేతి ఖడ్గం మన కమ్మర్‌పల్లిలో తయారైనదే. ఇలాంటి మండలంలోని కోనసముద్రం పాలించిన శ్రీకృష్ణదేవరాయల చేతి ఖడ్గం మన కమ్మర్‌పల్లిలో తయారైనదే. ఇలాంటి మండలంలోని కోనసముద్రం కూడా ముడి ఇనుముకు ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ ప్రాచీన కాలాన తయారైన ఇనుప ఆయుధాలు ప్రస్తుతం లండన్ (ఇంగ్లాండ్) మ్యూజియంలో దర్శన మిస్తాయి.

### ఆంధ్ర ప్రాంతీయుల వలసల ప్రభావంతో ఏర్పడిన గ్రామ నామాలు :

ఆంధ్ర ప్రాంతీయులు ఎక్కువగా నదులు ఉన్న తెలంగాణ ప్రాంతాలకు వలస వచ్చారు. అందునా దక్షిణ భారతదేశంలో పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రానికి నిలయమైన కందకుర్తి గ్రామం నిజామాబాద్ జిల్లాదే. ఇది మూడు పవిత్ర నదులైన గోదావరి, హరిద్ర మరియు మంజీరల సంగమం. ఈ ప్రాంతానికి వచ్చిన ఆంధ్ర ప్రజలు, వారికి తోచిన విధంగా పేర్లు, బోర్డులు పెట్టు

కున్నారు. ఉదా : క్యాంపులనే పేరుతో నీలక్యాంపు, రెడ్డి క్యాంపు. నగరములనే పేరుతో ఆంధ్రనగర్, శ్రీనగర్, పౌల్ట్రీ ఫారం, డెయిరీ ఫారంల పేరుతో ఆర్కే ఫారం, భూలక్ష్మి ఫారం, రెడ్డి ఫారం.. ఇలా ఉన్నాయి.

**ముగింపు :**

నిజామాబాద్ జిల్లా గ్రామ నామాలు మన జిల్లా సంస్కృతి, చరిత్ర యొక్క ఒక ముఖ్యమైన భాగం. ఈ నామాలను భవిష్యత్ తరాలకు అందించడానికి మనం కృషి చేయాలి. ఈ నామాలను సంరక్షించడం మన ప్రధాన కర్తవ్యం.

**గ్రామ నామాలను సంరక్షించడానికి కొన్ని మార్గాలు:**

**గ్రామాల చరిత్రలను రాయడం :**

గ్రామాల చరిత్రలను రాయడం ద్వారా గ్రామ నామాలను సంరక్షించవచ్చు.

**గ్రామ నామాల గురించి పుస్తకాలు, వ్యాసాలు రాయడం:**

గ్రామ నామాల గురించి పుస్తకాలు, వ్యాసాలు రాయడం ద్వారా ఈ నామాల గురించి అవగాహన పెంచవచ్చు.

**గ్రామ నామాలను పాఠశాల, కళాశాల స్థాయి పాఠ్యాంశాలలో చేర్చడం :**

గ్రామ నామాలను పాఠశాల, కళాశాల స్థాయి పాఠ్యాంశాలలో చేర్చడం ద్వారా భవిష్యత్ తరాలకు ఈ నామాల గురించి తెలియజేయవచ్చు.

**ఆధారగ్రంథాలు :**

1. నిజామాబాద్ జిల్లా చారిత్రక వ్యాసాలు - కందకుర్తి యాదవరావు (1990).
2. సిద్ధ సాయరెడ్డి - నిజామాబాద్ జిల్లా చారిత్రక వైభవం (2000)
3. ఎం. రాజేంద్రప్రసాద్ - నిజామాబాద్ జిల్లా చరిత్ర (2010)
4. బి.ఎన్. శాస్త్రి - నిజామాబాద్ సంస్థాన చరిత్ర (1972)
5. ఏనుగులు వీరా స్వామయ్య - కాశీయాత్ర చరిత్ర (1941)
6. ఎస్. యార్లగడ్డ - ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల చరిత్ర (1975)
7. వి. రామారావు - నిజామాబాద్ జిల్లా సంస్కృతి (1980)
8. డి. సుధాకర్ - నిజామాబాద్ జిల్లా కళలు (2010)
9. ఎం. వెంకటేశ్వర్లు - నిజామాబాద్ జిల్లా సాహిత్యం (2005)

❖❖❖

# గీత కార్మికుడి మరణ వాంగ్మూలమే - బతుకుతాడు నవల

- డా॥. ఆగపాటి రాజ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

సాహిత్యంలో ఎవరి జాతి గురించి, ఎవరి జీవితం గురించి వారు నిశితంగా పరిశీలించి అక్షరబద్ధం చేసినట్లయితే అదే గొప్ప సాహిత్యమవుతుందని చెప్పిన బిఎస్ రాములు మాటను శాసనంగా భావించిన నేరెళ్ల శ్రీనివాస్‌డ్ తాటిచెట్టును నమ్ముకొని బతికే గౌడల జీవన విధానం, వారి జీవితంలోని బాధలను, గాథలను బతుకు తాడు నవలలో అద్భుతంగా చిత్రికపట్టాడు. తెలంగాణ లోని జగిత్యాల ప్రాంతంలో గీతవృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న నిరుపేద గౌడ కుటుంబమైన నారయణ గౌడ్-లక్ష్మి దంపతులకు మొదటి సంతానంగా జన్మించిన శ్రీనివాస్ గౌడ్ చిన్నతనం నుండే కుటుంబ కష్టాలను, కటిక పేదరికాన్ని అనుభవిస్తూ పట్టుమని పదేళ్ళు నిండకుండానే కులవృత్తిని చేపట్టి కుటుంబానికి అండగా నిలవడమే కాకుండా రచయితగా మారడం సాహితీ లోకంలో గర్వించదగిన విషయం. గౌడల అస్థిత్వం, ఆత్మగౌరవమే కేంద్ర బిందువుగా రచనలు చేసిన శ్రీనివాస్ గౌడ్ ఇప్పటి వరకు 3 నవలలు, 4 కథ సంపుటాలు రచించాడు. అవి : నవలలు. 1, బతుకుతాడు, 2. దుల్దుమ్మ, 3. కల్తీ బతుకులు, కథ సంపుటాలు 1.పేదోళ్ళ బతుకులు, 2 మా బ్రుతకులు, 3 రచ్చ బండ 4. సర్పంచ్ కథా సంపుటాలను రచించారు. శ్రీనివాస్ గౌడ్ నవలలు రాసిన, కథలు రాసిన తన సాహిత్యమంతా గౌడల అస్థిత్వానికి సంబంధించినవే.

ఉత్తర తెలంగాణాలోని జగిత్యాల పరిసర ప్రాంతా లన్ని అత్యంత విప్లవ ప్రభావిత ప్రాంతాలు, ఎమర్జెన్సీ తరువాత భూస్వాములంతా ప్రాణభయంతో పట్నం బాట పట్టారు. ఆ సమయంలో అనేక సమస్యల పట్ల ప్రజా పోరాటాలబాటకు సాలుదీసి ముందుకు నడిచినవారైన జగిత్యాల జైత్రయాత్ర ఉద్యమం అత్మంత తీవ్ర రూపం దాల్చడానికి కారణమైన వారైన జగిత్యాల చుట్టుపక్కల నాయకత్వం వహించిన గౌడ్‌లే ప్రధాన కారణం. అంటే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న గౌడల పోరాటపటిమ ఎంతటిదో అర్థం చేసు కోవచ్చు. ఈ క్రమేణా తెలుగు వాఙ్మయ ప్రపంచంలో గౌడల జీవన విధానంపై వచ్చిన తొలి తెలుగు నవల బతుకుతాడు.

రచయిత ఈ నవలలో ముప్పై సంవత్సరాల కాలాన్ని తీసికొని ఈ ముప్పై ఏండ్లలో గీత కార్మికులు బ్రతికిన బ్రతుకు, బతుకుతున్న బతుకును వర్ణించాడు. ఈ నవల ప్రధానంగా మూడు కుటుంబాల మధ్య నడుస్తుంది. ఈ మూడు కుటుంబాలు తాటి చెట్టును నమ్ముకొని బతికినవే. నేరెళ్ల ధర్మయ్యగౌడ్-లింగవ్వ కుమారులు. 1.నేరెళ్ళ భూమమ్మ - లక్ష్మీనర్సవ్వ 2. రచయిత కుటుంబం నారయణగౌడ్ - లక్ష్మీ 3. లక్ష్మణ్ గౌడ్- రాజేశ్వరీ ఈ కుటుంబాలు పడిన బాధలు, అనుభవించిన కష్టాలే నవలలో చిత్రించిబడినవి.

"నేనేమి సేతు - నెనెట్ల బతుకుడు
బతుకుదెరువు కొరకు
బాధలేన్నో పడిన
బాధ తీరలేదు
బతుకు మారలేదు !

నవల ప్రారంభంలోనే నారయణగౌడ్ 'కనిమిద్ది' అనే తాటి చెట్టు మీద కల్లు గొలలు గీస్తూ పాడుతుంటాడు. కనిమద్ది తాటి చెట్టు దగ్గర పరపుదాల్ల సీజన్‌లో ప్రారంభమైన నవల అనేక మలుపులు తిరిగి ముప్పై ఏండ్ల తరువాత అదే కనిమిద్ది తాటి చెట్టు దగ్గర పరపుదాల్ల సీజన్‌లోనే ముగిసిపోవడం కనిపిస్తుంది.

ఈ నవల రచయిత ఆత్మకథ లాంటిది అయిన కథ ఉత్తమ పురుషలో నడవదు. రచయిత ఇందులో ఒక

పాత్రదారిగా మాత్రమే కనిపిస్తాడు. ఈ నవలలోని ముఖమైన పాత్రలు - భూమయ్యగౌడ్

ధర్మయ్య గౌడ్ పెద్ద కొడుకు భూమయ్యగౌడ్, తాటి చెట్లు ఎక్కుతున్న తన తండ్రి. తండ్రి లాంటి వాళ్ళు పడుతున్న కష్టాలను గమనిస్తాడు భూమయ్య గౌడ్. తన ఊర్లోని తాటిచెట్ల గురించి గౌడ్‌ల జీవితాల గురించి నిశితంగా పరిశీలిస్తాడు. తన తండ్రి పూర్వీకుల నుంచి తన కులం వారంతా తరతరాలుగా తాటిచెట్లకు అంకితమై బ్రతకడం గమనిస్తాడు. కుల వృత్తి అంటే ప్రేమ వునా ఉన్నా అందులో ఎదుగదల లేకపోవడంతో పాటు తన పూర్వీకులు తన వాళ్ళు ఎంత కష్టాపడ్డా ఎదిగిరాక పోవడం భూమయ్యగౌడ్‌కు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇక్కడుంటే తను కూడా ఎంత కష్టపడ్డా భవిష్యత్తులో ఎదగలేడనే భావన ఏర్పడింది.

బొంబాయిలో ఆబ్కారీ చట్టాలు, వాటి రూల్సు తెల్పుకోని వేలం పాటలో ఒక కల్లు దుకాణం తన సొంతం చేసుకుంటాడు. కొన్ని తాటి చెట్లు తీసుకుంటాడు తాటిచెట్లు ఎక్కడం కోసం ఒక గీత కార్మికుడిని జీతం ఉంచుకున్నాడు. అతనికి జీతంతో పాటు తిండి కూడా పెట్టాలి. దీంతో భూమయ్య గౌడ్‌కు పని పెరిగింది. అన్నం వండుకోవడానికి తీరిక దొరకడం లేదు. బొంబాయిలో అన్నం వండడం కోసం అతని భార్య పిల్లలను తీసుకెళ్ళ డానికి వచ్చినప్పుడు భూమయ్యగౌడ్ అమ్మనాన్నలు ధర్మయ్యగౌడ్, లింగమ్మలు తిరిగి అతడు బొంబాయి వెళ్ళకుండా ఆపడానికి ప్రయత్నిస్తారు. ఊర్లో పెద్ద మనుషుల చేత చెప్పిస్తారు. అయితే భూమయ్య గౌడ్ ఆలోచించిన విధానం వేరేలా ఉంది. పల్లెలో పంటలు బాగా పండితే రైతులు కల్లు తాగుతారు. తమకు లాభం ఉంటుంది. రైతుకు పంట లేకుంటే గౌడ్‌లకు చిల్లర ఖర్చుకు కూడా కష్టమే. పెద్ద పట్టణాల్లో ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు, కార్మికులు, కాంట్రాక్టర్లుంటారు. అందువల్ల పట్టణాల్లో కల్లు తాగే వారు ఎక్కువ కల్లు మాముల లాభల్లో నడుస్తుంది. అందుకే తను బొంబాయిలో కల్లు దుకాణము పట్టినట్లుగా పెద్ద మనుషులకు వివరిస్తాడు.

నాన్న ఇన్ని రోజులు మనమో తీరుగ బతుకుతున్న మాట వాస్తవమే కానీ అన్ని కాలాలు మనయి కావు. ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. మారుతున్న పరిస్థితుల్లో ఈ సంపాదన ఏ మూలకు చాలదు. సంపాదనే పెంచుకునే ప్రయత్నం చేయాలి. నేను అన్ని ఆలోచించే బొంబాయి కల్లు దుకాణం పట్టినాను. అక్కడ నష్టం రాదనీ నమ్మకం నాకుంది అని భూమయ్య గౌడ్ తండ్రిని తల్లిని ఒప్పిస్తాడు. భార్యపిల్లలతో తిరిగి బొంబాయి వెళతాడు. బొంబాయిలో కల్తి కల్లు వ్యాపారం చేసి బాగా డబ్బు సంపాదిస్తాడు. జగిత్యాలలోని డిగ్రీ కాలేజీ దగ్గర ధర్మపురి రంగపేట రోడ్ చౌరస్తాలో పది గుంటల భూమికొంటాడు. ఇంకా రెండు ఇళ్ళు కొంటాడు. ఆ తరువాత రెండుతస్తుల మేడ కట్టించి పై అంతస్తుల్లో లాడ్జి, కింద అంతస్తులో హెూటల్ పెడతాడు. తన ఊరికి వచ్చినప్పుడల్లా తన వారికి బహుమతులు తెచ్చి, వెళ్ళేటప్పుడు డబ్బులిచ్చి వెళుతుంటాడు తమ్ముడు లక్ష్మణ్‌గౌడ్‌ను గ్రామ పంచాయితీ ఎలక్షన్లలో పోటీ చేసే పెద్దవాళ్ళతో పేచీ పెట్టుకోవద్దనడం రెండవ తమ్ముడు నారయణగౌడ్ దుర్భర జీవితాన్ని చూసి ఇల్లును నారయణగౌడ్‌కు ఇచ్చి ఆర్థిక స్థితిని బట్టి తోచినవి ఇవ్వనమనటం కుటుంబ సంబందాల పట్ల అతనికి గల ప్రేమానురాగాలకు నిదర్శనం. ఈ నవలలో భూమయ్య గౌడ్ పాత్రను భవిష్యత్ గురించి ఆలోచించే వాడుగా లౌక్యం తెలిసినవాడుగా రచయిత తీర్చిదిద్దాడు.

### నారయణగౌడ్ :

బతుకుతాడు నవలలో ప్రధానపాత్ర నారాయణగౌడ్. ఇతను ధర్మయగౌడ్ ముగ్గురు కుమారుల్లో రెండవవాడు. ఇతనికి కులవృత్తిపై మమకారం ఎక్కువ. తాటిచెట్టును ఆరాధిస్తాడు, ప్రేమిస్తాడు, తల్లిని నమ్ముకున్న పిల్లలు, తాటిచెట్టును నమ్ముకున్న గౌండ్లోల్లు ఎప్పటికి చెడిపోరని నారాయణగౌడ్ నమ్మకం.

ఇట్నీని శివలింగం అప్పనిరాజం, పూరెల్ల లచ్చంలకు కల్లు మండువ దగ్గర నారయణగౌడ్ కల్లు పోస్తున్నప్పుడు అక్కడికి చాకలి భూమయ్య, వచ్చి లక్ష్మణ్‌రావు పటల్ కల్లు పోయమంటున్నాడు అని అంటాడు. నారయణగౌడ్ కల్లు లేదంటాడు కారణం అంతకుముందు కల్లు పోస్తే డబ్బులివ్వలేదు పైగా అడిగితే బెదరించాడు ఆ కారణంగా కల్లు లేదంటాడు. కాగా కల్లు అమ్ముకొని సాయంకాలం తిరిగి ఇంటికి పోతున్న సమయంలో నారయణ గౌడ్‌ను దొరకబట్టి గుంజుకువెళ్ళి తన ఇంటిలోని పందిరి గుంజకు కట్టేస్తాడు. లంజకొడుక నాకు కల్లు లేదంటావా! అని తిడుతుంటే బుద్ధి గడ్డి తిన్నది పటేలా.. పిల్లలు గలవాణ్ణి నన్నేం జేయకండ్రి-నీ కాల్మొక్త అంటూ కాళ్ళ మీద పడిపోవడాన్ని బట్టి పటేల్, పట్వారీ భూస్వామ్య వ్యవస్థ గౌడుల జీవితాల మీద నిన్నటి తరంలో ఎంతటి జులం చేలాయించిందో అర్థం చేసుకోవచ్చు.

డబ్బులిచ్చినా, ఇవ్వకపోయినా దొరలకు కల్లు పోయాల్సి రావాడం నారయణగౌడ్ జీవితంలోని దైన్యం. భార్య లక్ష్మీకి జ్వరం వస్తే వైద్యం చేయించలేక ప్రభుత్వ ఆసుపత్రిలోనే చూపిస్తే జ్వరం తగ్గకపోవడంతో తన పుట్టింటి వారికి కబురు చేసి వారికి భార్య బాధ్యత నప్పగించిన నిస్సహాయత, కన్న బిడ్డలకు కడుపునిండా తిండి పెట్టలేని దారిద్ర్యం నారయణగౌడ్‌ది. రోజురోజుకు నారయణగౌడ్ ఆర్థికంగా దిగజారుడు పైగా ఎదుగుతున్న పిల్లలు, పెరుగుతున్న ఖర్చులు పెరగని సంపాదన ఇది వరకు వ్యవసాయంలో వచ్చిన పంట ఇంటి అవసరాలకు పోగా మిగిలిన పంటను అమ్మతే వ్యవసాయానికి పెట్టిన ఖర్చులు వచ్చేవి. ఇప్పుడు పెటుబడి లేక ఇంటి అవసరాలకు సరిపోయేంత పంట కూడా రావడం లేదు. అదికాక నారయణగౌడ్ ఉండే ఇల్లు ఒక మూలకు కూలిపోయింది. ఆ ఇల్లు కూలగొట్టి కొత్తగా ఇల్లు కట్టే శక్తి అతనికి లేదు. అందుకు కూలిపోతున్న ఇంట్లో నుంచి వెళ్ళి ఇంటి ప్రక్కన గుడిసే వేసుకుంటాడు. ఇది ఇలా ఉంటే అప్పుడే ఎలక్షన్లు వచ్చినాయి. ఎలక్షన్లు అయిపోయే దాక గవర్నమెంట్ వారు కల్లు అమ్మవద్దని ఆంక్షలు పెడతారు. దీంతో మూలుగుతున్న నక్కమీద తాటిపండు పడ్డట్టు నారాయణగౌడ్ ఇంట్లో పరిస్థితి దారుణంగా తయారైంది. చేసేదేమిలేక తన దగ్గర అటకం పట్టి కల్లు తాగే బొడ్డు గంగన్నతో ఆవేదన చెప్పుకుంటే ఆయన వారి కుటుంబానికి సరిపడ బియ్యం యిస్తాడు. దీన్ని బట్టి రెక్క ఆడితేగాని డొక్కడే జీవితాలు గౌండ్లోల్లవి. 'కులవృత్తి పై మమకారం ఉన్న దాన్ని నమ్ముకొని భార్యబిడ్డలకు ఒక పూట తిండి పెట్టలేని స్థితిలో ఉన్నాడని అర్థమవు తుంది.

ఎన్నిసార్లు ఎన్నికలొచ్చిన ఎందరు ముఖ్యమంత్రులు మారిన ఎన్ని పథకాలు ప్రవేశపెట్టిన నారయణగౌడ్ బతుకులో ఎలాంటి మార్పు లేకపోవడం గమనిస్తాడు. కొడుకు చదువుకోవడం ఇష్టం లేనంతగా తయారవుతుంది నారయణగౌడ్ పరిస్థితి. ఎందుకంటే కొడుకును చదివించే ఆర్థిక స్థోమత అతనికి లేదు. ఈ క్రమంలో ఊర్లోకి గౌడశెట్టిలు ఆటలాడటానికి వచ్చినప్పుడు గంగారాంగౌడ్ మొదలైన వాళ్ళు తమ ఊర్లోనే ఆటాలాడుమని గౌడశెట్టి లకు చెప్పి నారయణగౌడ్‌ను తమ ఊర్లోనే ఆట చూడ మంటారు. కానీ నారయణగౌడ్ పట్టుబట్టి తమ ఊర్లో కూడా గౌడశెట్టిల ప్రదర్శన ఇచ్చేలా చేసి గ్రామస్థుల మెప్పు పొందుతాడు. దానికి గాను పాలిచ్చే ఆవును అమ్మి గౌడ శెట్టిలకు డబ్బులు ఇవ్వడాన్ని చూస్తే పట్టుదల గల వానిగా, ఆత్మాభిమానం గల వ్యక్తిగా రచయత నారయణ గౌడ్ పాత్రను తీర్చి దిద్దారనిపిస్తుంది.

తాటిచెట్టును నమ్ముకున్న నారయణగౌడ్ ఆర్థిక పరిస్థితిలో ఏ మాత్రం మార్పురాదు. పైగా పిల్లలు పెద్ద వాళ్ళవుతున్నారు. ఎప్పుడో వెసుకున్న గుడిసే అలాగే ఉంది. తన అప్పు మాత్రమే కట్టులేకపోతున్నాడు. ఇక భవిష్యతలో ఇల్లు ఎలా కట్లాలి, పిల్లలకు పెండ్లిల్లు ఎలా చేయాలనే ఆలోచనతో కృంగిపోతుంటాడు. ఈ పరిస్థితిలో అన్న భూమయ్య గౌడ్ ఊర్లో కొన్న రెండిళ్ళలో ఒక దానిలో తమ్ముడిని ఉండమని ఎంతో కొంత ఇవ్వమనటంతో

బాధల్లోంచి కొంత తేరిపించినట్లయింది. నారాయణగౌడ్ బతుకు లౌక్యం తెలియనివాడు ఉన్న ఊరిని కన్న తల్లిగా ప్రేమించినవాడు. ఆ తల్లి కోపంతో కసిరిన, ప్రేమతో మెచ్చకోలు మాట విసిరినా నిలువెత్తు ఓపికగా మారిన వాడు, గౌండ్లల్లకు తాటిచెట్టు తల్లిలాంటిది, ఈత చెట్టు ఇల్లు లాంటిది. మా పూర్వీకులు తాటిచెట్లను, ఈత చెట్లను నమ్ముకొని బతికిన వాళ్ళే అంటాడు. దీన్ని బట్టి ఎన్ని కష్టాలు ఎదురైన కులవృత్తిపై నారయణ గౌడ్‌కు ఎంత మమకారమో విశదమవుతుంది. నారయణగౌడ్ చివరకు ఈతచెట్టుకు మెరబెడుతూ చెట్టుమీదనే మరణిస్తాడు. ఇలా ఒక గీతకార్మికుడి జీవితం ముగిసిపోవడం బాధకారం. కావడి కుండల్లాంటి కష్టసూఖల మర్మం తెలిసిన కష్టజీవిగా రచయిత నారయణగౌడ్ పాత్రను తీర్చిదిద్దాడు.

**లక్ష్మీ :**

బతుకుతాడు నవలలో నారయణగౌడ్ భార్య లక్ష్మీ. లక్ష్మీకి కుటుంబ ఆర్థిక పరిస్థితి చూస్తూంటే ఒక్కొక్కసారి బ్రతకడం కంటే చావడమే మేలనిపిస్తుంది. పొద్దటి పూటకి మక్క గడక, రాత్రి పూటకి వరి అన్నం వండుతుంది. ఇంకా పొలం కోతకు రాలేదు. ఇంట్లో తినడానికి బియ్యం లేవు, మక్కలు లేవు. అసలు ఇంట్లో ఏ వస్తువు లేదు. లక్ష్మీ ఒక్కొక్క రోజు కూలికి పోతుంది. ఆ కూలీ రూపాయలతో బియ్యం కొని తెచ్చి వండుతుంది. అలా వీలుకాని నాడు నారయణగౌడ్ దగ్గర ఎవరైన కల్లు తాగితే ఆ కల్లు తాగిన వారి దగ్గర రూపాయలకు బదులు బియ్యం తీసుకువస్తాడు. అలాంటి దైన్యస్థితిలో కుటుంబం కష్టాల్లో మునిగి తేలుతుంది. ఆలోచించిన కొద్దీ పిచ్చెక్కిపోతుంది లక్ష్మీ దుఃఖిచని రోజు లేదు. లక్ష్మీకి కడుపునిండా తిండిలేదు, కంటినిండా నిద్ర లేదు, ఒంటి నిండా బట్టలేదు. లక్ష్మికే కాదు పిల్లలకు ఒంటినిండా బట్టు లేదు. అనేక సందర్భాల్లో ఊర్లో వారి దగ్గర పాత బట్టలు అడిగి తొడిగింది. కొన్ని సార్లు లక్ష్మి తల్లి లాలవ్వ బట్టలు కొని ఇస్తుంది. తినడానికి బియ్యం తీసుకవస్తుంది. ఈ విధంగా రోజులు గడిచిన లక్ష్మికి ఏమి తోచదు. భవిష్యత్ గురించి ఆమె భయపడుతుంది. పిల్లలను ఎలా బతికించాలని ఆలోచిస్తుంది. ఎక్కడ మార్గం కనిపించక పిచ్చెక్కినట్టు ఏడుస్తుంది. ఆ ఏడుపు ఆవేశంగా మారి ఒక్కొక్కలు బొంబాయి వోయి సంపాదించుకోవట్రి, నీకే తెలివిలేక పాయె అని దుఃఖించేది. దానికి సమాధానంగా తాటి చెట్టు తల్లి లాంటిది. ఈత చెట్టు ఇల్లు లాంటిది అని నారాయణగౌడ్ అన్నప్పుడు తాటిచెట్టు తల్లిలాంటిదే, ఈతచెట్టు ఇల్లు లాంటిది. .? మన కుటుంబాలను సాదుతున్నాయి నిజమే కానీ మూడోద్దులాయె వానపడ బట్టి అయిన్ని తాటిచెట్లు ఎండిపోతే అని లక్ష్మీ ఆవేదనను నారాయణగౌడ్‌కు తెలియజేస్తుంది. ఈ రకంగా దీన అవస్థలోని ఒక గౌడ స్త్రీ పాత్ర లక్ష్మీ.

**లక్ష్మణ్‌గౌడ్ :**

నవలలో ధర్మయ్యగౌడ్ చిన్న కొడుకు లక్ష్మణ్ గౌడ్, జగిత్యాల జైత్రయాత్ర సభ, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలలో లక్ష్మణ్ గౌడ్ కీలక పాత్ర పోషిస్తాడు. దొరలకు భూస్వాములకు వ్యతిరేకంగా ప్రసంగాలు చేసేవాడు. ఆ ఊరిలో పెద్ద దొరలు లేరు. చిన్న దొరలే ఉన్నారు. ఊర్లో ఎవరిదైన పంట పొలంలో ఎక్కువ పంట వచ్చెదుంటే రాత్రికి రాత్రే కోసుక వచ్చేవారు. అలా వీలు కాకుంటే ఎడ్లను తీసుకవెళ్ళి మేపుక వచ్చేవారు. అలాంటి దొరలను రెండు మూడు సార్లు నక్సలైట్లు చితిక్కొడతారు. అయితే లక్ష్మణ్‌గౌడ్ లాంటి వారే అన్నల చేత మమ్మల్ని కొట్టించారని వారి అనుమానం వామపక్ష భావజాలంలో అనేక కార్యక్రమాలు చేపడుతూ ఊర్లో అందరికి భరోసగా ఉంటాడు. అతనికి ఆర్థిక ఇబ్బందులు ఏమిలేవు. ఈ కారణంగా ఊర్లో దొరలకు వ్యతిరేకంగా గ్రామ పంచాయితీ ఎన్నికల్లో వార్డ్ మెంబర్‌గా పోటి చేసి గెలిచి ఉపసర్పంచి అవుతాడు. ఇదీ జీర్ణించుకోలేని దొరలు భూస్వాములు అతని మీద కుట్రచేస్తారు. కాలం గడిచే కొద్దీ అతని మీద దాడులు అవినీతి ఆరోపణలు చేసి ఊర్లో అవమానాలకు గురిచేస్తారు. దీంతో లక్ష్మణ్ గౌడ్

బొంబాయి వెళ్ళి తన అన్నలాగే కల్లు వ్యాపారం చేస్తాడు. మొదట్లో లాభాల్లో నడిచిన వ్యాపారం 'లౌక్యం తెలియని కారణంగా ఆర్థికంగా చాలా నష్టపోతాడు. ఒక్కగానొక్క బిడ్డ కాపురం సరిదిద్దడానికి ఊర్లో ఉన్న ఎకరంన్నర భూమి అమ్మివేస్తాడు. భార్య పిల్లలను తీసుకుని పుట్టిన ఊరయిన హన్మాజీపేటకు రాకుండా అతని అత్తగారి ఊరయిన అనంతారం వెళతాడు. ఇది తన ఊరిలో తలవంపులు పడకూడదన్న అతని ఆత్మాభిమానాన్ని సూచిస్తుంది. అత్తగారి ఊరిలో కొన్ని రోజులు తర్వాత ఆనారోగ్యం కారణంగా విషాదకర మరణం సంభవిస్తుంది. సమాజాన్ని ఏదో మార్చాలనుకుని సహచరుల చేతుల్లో మోసపోయి, వ్యాపారంలో లౌక్యం తెలియక జీవిత సమరంలో ఓడిపోయి మరణం చెందిన అభాగ్య జీవిగా లక్ష్మణ్ గౌడ్ పాత్ర చిత్రీకరణ జరిగింది.

## శ్రీనివాస్ గౌడ్ :

బతుకుతాడు నవలలో మూడవ తరానికి చెందిన వ్యక్తి శ్రీనివాస్ గౌడ్. తల్లిదండ్రుల కష్టాలు, బాధలు వాళ్ల బతుకు పోరాటం చూస్తూ పెరిగినవాడు, ఇంట్లో పరిస్థితి అర్థం చేసుకొని ఏడవ తరగతితోనే చదువు మానేసి కుల వృత్తిని నేర్చుకొంటాడు. తండ్రి నారయణగౌడ్ దగ్గర శ్రీనివాస్‌గౌడ్ మరింత సంపాదించాలనే ఆలోచన కలుగుతుంది. వ్యవసాయం చేస్తూ ఈత చెట్లుగాని, తాటిచెట్లు గాని ఎక్కితే ఈ పరిస్థితిలో మార్పురాదనీ ఆలోచన కలిగి బొంబాయి వెళ్ళి బాగా సంపాదించాలను కుంటాడు. తండ్రి అంగీకరించక పోవడంతో చెప్ప కుండానే బొంబాయి వెళతాడు. అతని పెద్దనాన్న భూమయ్యగౌడ్ వద్ద పనిలో చేరతాడు. అయితే భూమయ్య గౌడ్ చేసే కల్తీ కల్లు వ్యాపారం నచ్చక తిరిగి హన్మాజీపేట చేరుకుంటాడు. ఇది అతనిలోని నిజాయితిని సూచిస్తుంది. ఈ క్రమంలో శ్రీనివాస్ గౌడ్‌కు పెండ్లి చేయాలని నిర్ణయించుకుంటాడు నారయణగౌడ్. పెళ్ళి చూపులకు వెళ్ళినప్పుడు కట్నం దగ్గర బేరసారాలు జరుగుతున్నప్పుడు శ్రీనివాస్ గౌడ్‌కు అంగట్లో పశువులకు బేరం చేసినట్లే అనిపిస్తుంది. తండ్రి నారయణగౌడ్ డిమాండ్ చేసినంత కట్నం ఇవ్వలేని స్థితిలో ఆడపెళ్ళి వారు ఉండటం గమనించి వారు ఇవ్వగలిగే కట్నానికే అంగీకారం తెలుపుతాడు. ఇది అతనిలో మంచి లక్షణా లను తెలియజేస్తుంది. శ్రీనివాస్ గౌడ్ చెల్లి, తమ్ముడి పెండ్లికి సగం ఖర్చులు యిస్తాడు.దీంతో కుటుంబంపట్ల బాధ్యతలు తెలిసి నెరవేర్చిన వాడిగా శ్రీనివాస్‌గౌడ్ కనిపిస్తాడు. తాటిచెట్లు బందు చేసిన సందర్భంలో బొంబాయి వెళ్ళి కూలీ పని చేస్తాడు. ఇది అతనిలో కష్టపడే మనస్తత్వాన్ని తెలుపుతుంది. బొంబాయి నుండి తిరిగి వచ్చి మళ్ళీ గీతవృత్తినే నమ్ముకుంటాడు. కులవృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగించ లేక చాలా మంది సౌదీ, బొంబాయి, దుబాయి లాంటి ప్రాంతాలకు వలస వెళ తారు. అందువల్ల హన్మాజీపేట గ్రామంలో తిరుపతిగౌడ్, శ్రీనివాస్ గౌడ్ ఇద్దరే గీత కార్మికులు మిగులుతారు. గీతవృత్తినే జీవనాధారంగా చేసుకొని మనస్ఫూర్తిగా ఆచరించిన వక్తిగా శ్రీనివాస్ గౌడ్ పాత్ర చిత్రణ చేశాడు రచయిత.

ఎప్పుడూ ఎవరో ఒకరి బాధలు వినడానికి సిద్ధంగా ఉండేవాడు ఇప్పుడు స్వయంగా తన బాధలు చెప్పడానికి నడుంబిగిస్తే వినడానికి చదవడానికి ఆసక్తి చూపడం లోక సహజమైన విషయం. ఈ ఆసక్తి 'బతుకుతాడు' నవల చదువుతుంటే రెట్టింపు అవుతుంది. ప్రాచీన సాహిత్యమంతా తాటి కమ్మల మీదే రాయబడింది. అయినా అది తాటిచెట్లు ఎక్కే గౌండ్ల వారి జీవితాన్ని మాత్రం ఎన్నడూ పట్టించుకొన్న పాపాన పోలేదు.

భారతదేశంలో మహాశ్వేతాదేవి, శివరామరావు, గోపిచంద్, రావూరి భరద్వాజ, బి.ఎస్ రాములు, కంచ ఐలయ్య మొదలైన వాళ్ళంతా బడుగు జీవుల ఆక్రందనలను వాళ్ళ సాంస్కృతిక నేపథ్యాన్ని అక్షర బుద్ధం చేశారు. ఈ కోవలోనే నేరెళ్ళ శ్రీనివాస్‌గౌడ్ రచన చెరుతుంది. కులవృత్తినే నమ్ముకొని ఆత్మగౌరవంతో జీవనం కొనసాగించలేని సగటు గీత కార్మికుడి మరణ వాంగ్మూలమే బతుకుతాడు నవల.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. బతుకుతాడు నవల-నేరేళ్ళ శ్రీనివస్‌గౌడ్ (2004)
2. నవలలోకనం-కేతవరపు రామకోటిశాస్త్రి (2015)
3. సవ్వడి (సాహిత్య వ్యాససంపుటి-డా॥బన్న అయిలయ్య-2006
5. తెలుగులో దళిత నవలలు-అనుశీలన-సిహెచ్.కృష్ణమూర్తి-2018)
6. కాలువ మల్లయ్య నవలలు సామాజిక చిత్రణ-మల్లికార్జున్-2006.

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# వాల్మీకి చరిత్రము - సామాజిక విశ్లేషణ

– డా॥. నూనావత్ రాంబాబు, సీనియర్ ప్రాజెక్టు ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.

## తంజావూరు నాయక రాజులు :

సాహిత్య పోషణ తంజావూరు నాయక రాజులు - క్రీ.శ. 1600 నుండి 1674 వరకు తంజావూరు రాజధానిగా చేసుకొని దక్షిణ భారతదేశంలో విశాలమైన సామ్రాజ్యాన్ని పరిపాలించారు. వీరిలో రఘునాథ నాయకుడు. విజయ రాఘవ నాయకుడు ప్రసిద్ధులు.

## రఘునాథ నాయకుడు - కావ్య రచనలు :

రఘునాథ నాయకుడు (క్రీ.శ. 1600-1631) ఎక్కువ కాలం యుద్ధాలలో పాల్గొనవలసి వచ్చినా, రక్షాపోషను, సాహిత్య సృజనను విస్మరించలేదు. సంస్కృతాంధ్ర భాషలు రెండింటిలో కృతులు రచించిన రఘునాథ రాయలను పెక్కు విషయాలలో శ్రీకృష్ణదేవరాయలతో పోల్చవచ్చు. రఘునాథుని రచనలలో వాల్మీకి చరిత్రము, రామాయణము, నలచరిత్ర (ద్విపద) శృంగార సావిత్రి కావ్యములు మాత్రమే లభ్యమైనవి. ఇతడు సంగీత వేత్త కూడా. సంగీత సుధ అనే శాస్త్ర గ్రంథాన్ని రచించటమే గాక జయంత సేన రాగాన్ని రామానంద తాళాన్ని కూడా కనిపెట్టాడు. కవిత్వాన్ని గురించి రఘునాథుడు.

“చెప్పవలె గప్పురంబులు
గుప్పలుగా బోసినట్లు కుంకుమ పైపై
గప్పిన క్రియ విరిపొట్లము
విప్పిన గతి మమ్మునన్ గవిత్వము సభలన్” అని
చెప్పాడు.

తంజావూరి పరిసరాలను రఘునాథుడు తన కావ్యాలలో మనోజ్ఞంగా వర్ణించాడు. రఘునాథ రాయల ఆస్థానములో చేమకూర వేంకటకవి, కృష్ణాధ్వరి, రామభద్రాంబ, మధురవాణి, కవి చౌడప్ప అనే కవులు కలరు. కవి చౌడప్ప రఘునాథ రాయల సుభావైభవాన్ని

“నేరుతునని మాటాడగ
వారిజ భవునంతవాని వశమా? తంజా
వూరి రఘునాథ నాయని గారి సభన్
కుదవరపు కవి చౌడప్పా!” అనే పద్యలో వర్ణించాడు.

కృష్ణదేవరాయల అనంతరం అంతటివాడేకాక, అంతకుమించినవాడని ఎన్నదగిన ఆంధ్రభోజుడు, ఇతను రాజేకాకుండా సంస్కృతం, తెలుగు ఉభయ భాషలలోనూ కవిత్వం చెప్పగలవాడు. అంతేకాకుండా నూతన రాగాలను, తాళాలను కనిపెట్టి వీణల మేళ వింపును సంస్కరించిన సంగీతశాస్త్ర నిపుణుడు. పారిజాతాహరణం అను గ్రంథంను చిరుత ప్రాయంలోనే సంస్కృతంలో రచించాడు. ఇప్పుడు లభిస్తున్న ఇతని గ్రంథాలు వాల్మీకి చరిత్ర, రామాయణం అను పద్య కావ్యాల, నల చరిత్ర అను ద్విపద కావ్యం, జానకీ కల్యాణం అను చాటు కావ్యం, రుక్మిణీ కల్యాణం అను యక్షగానాలు. ఇతని పాలనలో తంజావూరు సాహిత్యానికి, కళలకు, కర్ణాటక సంగీతానికి ప్రధాన కేంద్రమైంది. రఘునాథుని రచనలో కూడా నయం. రసోదయం, నుడిరారం అను మూడు. త్రివేణిలాగా ప్రవహిస్తూ ఉంటాయి. అతను వ్రాసిన గ్రంథాలన్నీ లభించకపోవడం దురదృష్టమే. రఘునాథుడు చేసిన రచనలను సమకాలికులు చాలామంది పేర్కొన్నారు. అవి యక్షగానాలు, ప్రబంధాలు, ద్విపదులు అని చెప్పారు. ఏ భాషలో వ్రాశాడో కూడా వివరించారు.

## కవుల పోషణ :

రామభద్రాంబ, మధురవాణి సంస్కృతాంధ్రాలలో కవిత్వమల్లినట్లు తెలుస్తున్నది. కాని వారి తెలుగు గ్రంథాలేవీ ఇప్పుడు లభించడంలేదు. కృష్ణాధ్వరి నైషధ పారిజాతీయము” అనే ద్వ్యర్థికావ్యాన్ని రచించాడు. దక్షిణాంధ్రయుగములో ధ్రువతార అని చెప్పదగిన చేమకూర వేంకటకవి వలన ఆంధ్రభాషలో ప్రసిద్ధి పొందినవి. విజయవిలాసములో అర్జునుడు తీర్థయాత్రకు

వెళ్ళుట ఉలూచి, చిత్రాంగన, సుండుట ఇతివృత్తము. ప్రతి పద్యరసోచితముగా చేమకూర యీ కావ్యాన్ని రచించి కూర పాకమున బడినదన్న ప్రశస్తి పొందారు. ఈయన రచనలో శబ్దాలంకారాలు అందంగా అమిరాయి. శ్రీకృష్ణదేవరాయల భువన విజయమువలె రఘునాథ రాయలు ఇందిరా మందిరము అనే సభాభవనాన్ని నిర్మింపజేసి అందులో కవి పండిత గోష్టి జరిపేవాడు.

## వాల్మీకి చరిత్రం :

మహర్షి వాల్మీకి ఎవరు? వల్మీకము (పుట్ట) నుండి వెలుపలికి వచ్చిన వారు కావున వాల్మీకి. రామరామ అని తపస్సు చేసిన వారు కావున మహర్షి, రాముడి జీవిత చరిత్రము రామాయణముగా మహాకావ్య రచన గావించినవాడిగా ఆదికవి అయ్యాడు. వాల్మీకి జీవితమును తెలుపు మొట్టమొదటి ప్రబంధము. రామాయణము వలెనే ఈ కృతికాడ ద్వాపర యుద్ధా నంతరమే వ్రాయబడినదని దీని గద్య తెలుపుచున్నది. కవిత్వము మిక్కిలి పరిణతి చెందినది. హృదయంగమ, కవితాశైలితో మనోరంజకమునగు వర్ణనలతో గంభీర రథానములతో శాంత రస ప్రధానముగ ఈ కావ్యము రచింపబడింది. ఇది ముచ్చటగ మూడాశ్వాసములలో పొందికగ కూర్చబడినది. మొటి అశ్వాసము సప్తర్షం క్షేత్రాటనము స్తుతులు, రెండవ అశ్వాసమున బోయమనః పరివర్తన, తపస్సు, మూడవ అశ్వాసము రంభోర్వతుల వాగ్వివాదము వాల్మీకి జన్మ, తపస్సిద్ధి కలవు. మొత్తము 448 గద్యపద్యములు కలవు (1-122; 2-157; 3-169). తంజావూరు గ్రంథాలయమయిన, తిరుపతి, విశ్వ విద్యాలయ గ్రంథాలయమయిన, కాకినాడయందు, దీని ప్రతులు కలవు తంజావూరు. తిరుపతుల నుండి వ్రాత ప్రతుల ప్రతికృతులను తెప్పించి పరిశీలించిన, కొలది పాఠ్య భేదములతో చాలా ప్రజకు పోలుచున్నవి. కాని ముంప్రతి తంజావూరు నందలిడేః (క్రమసంఖ్య - 247, 249). దీనిని 1. మొదటి పర్యాయముగ 1911-1921 ఎ.డి. నాడు "సరస్వతీ పత్రిక"లో కొంతరాగముకు ముద్రించి. రామవిలాసు గ్రంథమాల వారును తదుపరి ముద్రించిరి. అముద్రితాంధ్ర గ్రంథ సర్వస్వ ప్రచురణలో మూడవ పువ్వుగ 1919 ఎ.డి.లో ఇది అవతరించినది. అప్పుడు శ్రీ చెలికాని లచ్చారావు (చిత్రాడ) సంపాదకులుగ ఉండిరి. 2. 1940 ఎ.డి.లో ఆంధ్ర విజ్ఞాన సమితి (విజయనగరము) ఆధ్వర్యమున శ్రీ నిడదవోలు వేంకట్రావు గారు. వీరికి వ్రాయగ ముద్రించబడినది. 3. చివరగ 1968 ఎ.డి.లో "ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ" రామరాజు గారు పరిష్కరించగ ప్రచురించినది. ఏమయినను రఘునాథుని రచనలలోని అన్ని గ్రంథముల కంటే ఈ వాల్మీకి చరిత్రకే అధిక ప్రసిద్ధి ఏర్పడినది. ఎందులకనిన ఇది ప్రబంధ పద్ధతిలో, పాండిత్యస్ఫూర్తితో రచింపబడినది, కావున పండితులు ఆదరించిరి. సాధారణ విధముగ. చముత్కారాదిసర్జనలతో, కల్పనలతో కూడి యున్నది. ఛందోబద్ధమై తమకు కావలసిన రీతిలో చిరువస్తువు పెనుపాత్తముగ మారినందున వారు దీనిని ప్రశస్తికి తెచ్చిరి. తక్కిన కావ్యములు అసంపూర్ణములు కదా! అందునను వానియందలి కవిత్వము పామర జనులకు దగ్గర కలిగి వ్యవహారిక భాషా ప్రాధాన్యమును చాటుచున్నది. అందరికి అందుబాటులో ఉండిన కావ్యములు కవుల దృష్టిలో (విద్వాంసుల దృష్టిలో) సత్కృతులు కావు అందుచేతనే కాబోలు ఇతనికి 'మిగిలిన కృతులు వ్యాప్తిని పొందలేక, ఈ వాల్మీకి చరిత్ర మాత్రమే మూడు పర్యాయములు ప్రచురణ స్థితిని పొందినది.

## వాల్మీకి చరిత్రము సామాజికత :

మనం ఆదికావ్యం అనుకునే రామాయణాన్ని గురించి, ఆదికవి వాల్మీకిని గురించి చాలామందికి తెలిసిన కథ ఒకటుంది. ఇప్పుడు వాల్మీకి రామాయణం అనే పేరుతో సంస్కృతంలో అచ్చయే రామాయణ పుస్తకాలు అన్నింటిలోను ఈ కథ వుంటుంది. ఈ రామాయణం రెండవసర్గలో వాల్మీకి తమసా నదిలో స్నానం చేయడానికి వెళ్తాడు. ఆయనతోపాటు ఆయన శిష్యుడు భరద్వాజుడు కూడా వెళ్తాడు. ప్రశాంతంగా

ఉన్న ఆ ఉదయం ప్రశాంతమనస్కుడైన వాల్మీకి హాయిగా ఉన్న రెండు పక్షులను చూశాడు. అవి క్రౌంచ పక్షులు. ఒకటి ఆడ, ఇంకొకటి మగ, ఆ పక్షులు రెండూ హాయిగా మైథునానందంలో మైమరచి వున్నాయి. ఆ సమయంలో ఒక బోయవాడు (నిషాదుడు) ఆ రెండింటిలో మగపక్షిని చంపుతాడు. చచ్చిపోతున్న మగపక్షిని చూసి ఆడపక్షి ఏడుస్తూ వుంటుంది. ఆ విషాద దృశ్యాల్ని చూసి అప్రయత్నంగా వాల్మీకి నోటి నుంచి శాపరూపమైన ఈ వాక్యం వినిపిస్తుంది.

"మా నిషాద ప్రతిష్ఠామ్ త్వమగమశ్శాశ్వతీస్సమాః
యత్క్రౌంచమిథునాదేక మవధీః కామమోహితమ్"

ఆ మాటలు తన నోటి నుండి వచ్చిన వెంటనే వాల్మీకి తనకు తానే ఆశ్చర్యపోయి "కిమిదం వ్యాహృతం మయా" (ఏమిటి నేనన్నాను?) అని చూసుకుంటాడు. ఆ తరువాత ఒక మంచి సాహిత్య విమర్శకుడి లాగా తన వాక్యాలను తానే చర్చిస్తాడు. అందులో నాలుగు సమానమైన పంక్తులున్నాయి. ప్రతి పంక్తిలోను ఉన్న అక్షరాలు సమానంగా వున్నాయి. తీగలున్న యంత్రం మీద ఇది పాడడానికి వీలుగా వుంది - అని వివరించాక, ఇది శోకంలోంచి పుట్టింది కాబట్టి దీన్ని శ్లోకం అనడమే న్యాయం అని దీనికొక పేరు పెడతాడు.

ఆయన ఈ శ్లోకాన్ని చెప్పిన వెంటనే. పక్కనే వున్న భరద్వాజుడు దాన్ని అప్పటికప్పుడు కంఠస్థం చేసి రాగ, తాళబద్ధంగా పాడతాడు. రచన, విమర్శ, పఠన - ఈ మూడూ కలిసి దీనిని కావ్యం చేస్తాయి. ఇది మొదటి కావ్యం. ఈ కావ్యాన్ని చెప్పాడు కాబట్టి వాల్మీకి మొదటి కవి. ఈ కథ మీలో చాలామందికి తెలుసు. అయితే వాల్మీకిని గురించిన కథ ఇది ఒకటే కాదు. ఇంకో కథ కూడా వుంది. ఆ కథ సంస్కృత సాహిత్య విమర్శ రంగంలోకి ఎక్కలేదు. కానీ ఆ నోటా ఈ నోటా వచ్చిన ఈ కథ స్కాంధపురాణంలో, ధర్మఖండంలో వుంది. తెలుగులో వాల్మీకి చరిత్ర రాసిన రఘునాథ నాయకుడు (రాజ్యకాలం 1600-1631) కూడా చెప్పాడు. కానీ అంతకన్నా ప్రచారంగా ఈ కథ నోటి మాటగా చాలా కాలంగా ఉంది. ఆ కథ ఇది.

వాల్మీకి మొదటిలో బందిపోటు దొంగ. దారులు కాసి వచ్చేవాళ్ళని, పోయేవాళ్ళని బెదిరించి, అవసరమైతే చంపి వాళ్ళ డబ్బు దోచుకునేవాడు. ఒకరోజున కొంతమంది బ్రాహ్మలు, కాశీకి వెళ్ళేవాళ్ళు, అతనికి కనిపించారు. అతను వాళ్ళని ఆపి, "మీ ధనం అంతా ఇవ్వండి, లేకపోతే చంపేస్తాను" అన్నాడు. వాళ్ళు అతన్ని నెమ్మదిగా మాటల్లోకి దింపి, "ఒక సంగతి చెప్పు. ఇలాంటి పని ఎందుకు చేస్తున్నావు?" అని అడిగారు. నాకు పెళ్ళాం పిల్లలు ఉన్నారు. వాళ్ళని పోషించుకోవడం కోసం నేను చేసే వృత్తి ఇది" అని అన్నాడు అతను. బాగుంది, నువ్వు ఈ పని చేయడంలో చాలా పాపాన్ని మూట కట్టుకుంటున్నావు. నువ్వు సంపాదించే డబ్బులో పాలు పంచుకునే నీ భార్య పిల్లలు నీ పాపంలో కూడా పాలు పంచుకుంటారా"? అని అడిగారు ఆ బ్రాహ్మలు. ఈ ప్రశ్నకు సమాధానం తోచక ఆ దారిదొంగ నాకు తెలియదన్నాడు. నువ్వు ఇంటికెళ్ళి కనుక్కురా. మేమిక్కడే వుంటాం" అన్నారు వాళ్ళు. ఆ దారిదొంగ ఇంటికెళ్ళి భార్యా పిల్లల్ని అడిగాడు. నేను మిమ్మల్ని దారులు కాసి మనుషుల్ని చంపి డబ్బు సంపాదిస్తున్నాను. అందువల్ల నాకు చాలా పాపం ఒస్తోందని కొందరు బ్రాహ్మలు చెప్పారు. నా డబ్బులో పాలు పంచుకుంటున్న మీరు నా పాపంలో కూడా పాలు పంచుకుంటారా?"

వాళ్ళు దానికి సమాధానంగా, "నువ్వు మాకోసం ధనం సంపాదించడంలో ఏ పాపపుణ్యాలు మూట కట్టుకుంటున్నావో అది నీ పని అందులో మాకేమీ వాటా లేదు. నీ పాపం నీదే, అది నువ్వే అనుభవించాలి" అని అన్నారు. దిక్కుతోచని ఆ దొంగ తిన్నగా ఆ బ్రాహ్మల దగ్గరికి వెళ్లి వాళ్ళ మీద పడి తను చేసిన పాపం నుంచి విముక్తుడవడానికి మార్గమేమిటని అడిగాడు. వాళ్ళు అతన్ని దయ తలిచి రామమంత్రం అతనికి ఉపదేశించదలచుకుని అయినా తామసుడు, శుద్ధమూర్ఖుడు

అయిన అతనికి ఆ మంత్రాన్ని యథామార్గంలో 'రామ' అని చెప్పకుండా తిరగేసి 'మరా' అని చెప్పి ఆ మంత్రాన్ని ఒకచోట కూర్చుని నిష్ఠతో జపించమన్నారు. ఆ బందిపోటు దొంగ మూర్ఖంగా బండగా మఠం వేసుకుని ఒకచోట కూర్చున్న ఆ దొంగ మీద చెదలు పుట్టలు పెట్టాయి. అయినా అతను అలా జపిస్తూనే కూర్చున్నాడు. కొన్నాళ్ళకి రాముడు ప్రత్యక్షమై అతనికి మోక్షమిచ్చాడు. సంస్కృతంలో పుట్ట అంటే వాల్మీకం. వాల్మీకం లోంచి పుట్టాడు కాబట్టి ఆయన వాల్మీకి అయ్యాడు.

## చరిత్రకారుల విమర్శ :

భారతదేశానికి ఇంగ్లీషువాళ్ళతో సంబంధం వచ్చిన తరువాత ఇలాంటి కథలు తలాతోకా లేనివి, ఎప్పుడు ఎలా పుట్టాయో తెలియనివి విజ్ఞానుల్ని చిరాకు పెట్టేవి. ఈ కొత్త విజ్ఞానులు ఇలాంటివన్నీ కట్టు కథలనీ, చరిత్రలేని జాతికి ఇలాంటి కథలే వుంటాయని వేళాకోళం చేయడం మొదలుపెట్టారు. ఇది ఇలా వుండగా భారతీయ విజ్ఞానులలోనే అలంకార శాస్త్ర పండితులు కూడా ఈ కథల్ని పనిగట్టుకుని నిరాకరించక పోయినా కావాలని ఆదరించలేదు. అటు ఆలంకారికుల చేత, ఇటు ఆంగ్లేయుల చేత నిరాదరణకు గురయిన ఈ కథలు కొత్త చదువులు ముదురుతున్న కొద్దీ పాతపడి ఎవరికీ జ్ఞాపకం కూడా లేకుండా పోతున్నాయి. ఈ కథల్లో ఒక కాలానికి చెందనివాళ్ళు అని సాహిత్య చరిత్రకారులు నిర్ణయించిన కవులు కలిసి మాట్లాడుకుంటారు. అసలు ఏ కాలంలోనూ వున్నారని చెప్పడానికి వీలులేని కవులు ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తారు. పైగా, వాళ్ళకు లోకాతీత శక్తులుంటాయి. ఒక్కమాటతో వాళ్ళు మహారాజుల్ని బిచ్చగాళ్ళుగా మార్చగలరు, బిచ్చగాళ్ళని మహారాజుల్ని చేయగలరు. అవసరమైతే దేవుణ్ణే ఎదురించగలరు. ఈ కథల్ని ఎలా అన్వయించాలో తెలియక తికమకపడ్డారు సాహిత్య చరిత్రకారులు.

వలస పాలన ద్వారా వచ్చిన పాశ్చాత్య విద్యల్లో ఒకటి సాహిత్య చరిత్ర, ఏ కవి ఏ పుస్తకం ఏ కాలంలో రాశాడు అనేది నిర్ణయించడం ఈ సాహిత్య చరిత్రకి మొదటి అవసరం. ఈ కొత్త చరిత్రకారులు కొత్త ప్రశ్నలు అడగటం మొదలుపెట్టారు. కాళిదాసు ఎప్పటివాడు? ఎంతకాలం బ్రతికాడు? ఈ వాల్మీకి, వ్యాసుడు నిజంగా రామాయణం, భారతం రాశారా? ఒక్క వ్యాసుడు అన్న వ్యక్తి అంటూ వుంటే వేదాల్ని విభజించి, మహాభారతాన్ని రాసి, పురాణాలన్నింటికీ కర్త అయి, ఆ తరువాత ఇంకా తోచక భాగవత పురాణాన్ని కూడా రాశాడంటారు కదా, అతను ఎంతకాలం బ్రతికి ఉండాలి? అది అలా వుంచి మీ కవులు ఒక్క పద్యంతో రాజుల్ని రాజ్యభ్రష్టులుగా ఎలా చేయగలిగారు? ఇలాంటి ప్రశ్నలు అడగటంతో సాంప్రదాయిక భారతీయ పండితులు ఒక పక్క తమ సంప్రదాయాన్ని రక్షించుకునే పనిలోను, రెండో పక్క ఆ కొత్త చరిత్ర పద్ధతుల్ని నేర్చుకునే పని లోను పడి సాహిత్య చరిత్రకారులుగా పునర్జన్మ యెత్తారు. పాత శాసనాలని పరిశీలించడం, అవి ఆధారంగా రాజవంశాల కాలక్రమాల్ని నిర్ణయించచడం, గ్రంథంలోనే వున్న అంతర్గత సాక్ష్యాల ఆధారంగా శైలీభేదాలని పట్టి కావ్యకర్తృత్వాలని నిర్ణయించడం - ఇలాంటి పని పందొమ్మిది - ఇరవై శతాబ్దాల సాహిత్య చరిత్రకారులు చాలామంది చేశారు. ఈ పద్ధతిలో నిర్మించిన తెలుగు సాహిత్య చరిత్రలో ఎన్ని విలువైన విషయాలు తెలిశాయో, అందుకోసం ఎంత మంది ఎంత పరిశ్రమ చేశారో తలచుకుంటే ఆశ్చర్య మేస్తుంది. ఈ పనిలో వాళ్ళకు తారసపడిన ఈ కథలు కాదనలేక తమ సాహిత్య చరిత్రలో చొప్పించిన వాళ్ళు కొందరు, నిర్దాక్షిణ్యంగా నిరాకరించిన వాళ్ళు కొందరు.

## ముగింపు :

ఈ కథల్ని దగ్గర పెట్టుకుని జాగ్రత్తగా పరిశీలించి సాహిత్య చరిత్ర నిర్మాణానికి అతి నిశితమైన పరమ ప్రామాణికమైన పదార్థానికి ఈ కథలు ఆధారమని చెప్పడం ఈ నా ఉద్దేశం. ఇవి నిజమైన సాహిత్య చరిత్రకి మూలభూతమైన దినుసులు అనీ, కవి అంటే ఎవరు, గ్రంథం అంటే ఏమిటి, పాఠకులు అంటే ఎవరు, ఈ

మూడు పదార్థాలకి (అంటే, ఈ పదాల అర్థాలకి) వున్న సంబంధాలు ఎటువంటివి, ఈ పదార్థాలు, ఏ పరిస్థితుల్లో ఎలా మారాయి, ఆ మార్పులు చెప్పడమే సాహిత్య చరిత్ర చేయవలసిన పని అని నా ఉద్దేశం. అంతేకాని కాల క్రమంలో ఏ పుస్తకం ముందు వచ్చిందో, ఏ పుస్తకం తరువాత వచ్చిందో చెప్పకుంటూ కూర్చోవడం సాహిత్య చరిత్రకాదు. అలాంటి చరిత్ర మనకి లేకపోయినందుకు మనం విచారించక్కర్లేదు అని నా అభిప్రాయం.

**ఆధారగ్రంథాలు :**

1. రఘునాథభూపాల 'వాల్మీకి చరిత్రము', ఆంధ్రవిజ్ఞానంబుతి, విజయనగరం, 1940.
2. ఆరుద్ర 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' (రెండవ సంపుటి) తెలుగు అకాడమి, హైదరాబాదు, తెలుగు అకాడమీ ప్రచురణ, 2013.
3. దంటు హేమలత 'తెలుగులో వ్యాఖ్యాన సంప్రదాయం ఉత్పత్తి, వికాసాలు' (తెలుగు పురాణాలు ఇతిహాసాలు కావ్య ప్రబంధాల వ్యాఖ్యానాలు), హైదరాబాదు, 2009.
4. ఆర్.ఎల్. కామేశ్వరరావు, 'మహాకవి రఘునాథ భూపాలుడ', గాయత్రి ఆర్ట్స్ ప్రింటర్స్, హైదరాబాదు, 1987.
5. ఎం.వి.ఎల్. నరసమాంబ, 'రఘునాథ భూపాలుని వాల్మీకి చరిత్ర - ఒక పరిశీలన' హైదరాబాదు విశ్వవిద్యాలయం, ఎం.ఫిల్ డిగ్రీకోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం, 1982.

❖❖❖

# శ్రీకృష్ణదేవరాయల "భువన విజయ" వైభవం

- **రాజు మోరె,** పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

## పరిచయం :

విజయనగర సామ్రాజ్య స్థాపన క్రీ.శ. 1336లో ఆనెగొంది ప్రదేశంలో విద్యారణ్య స్వామి ఆశీస్సులతో హరిహర, బుక్క రాయలు స్థాపించారు. రాజధానిగా విద్యా నగరాన్ని చేసుకుని విజయనగర సామ్రాజ్యాన్ని నాలుగు వంశాలు పాలించాయి. సంగమ, సాళువ, తుళువ, అరవీటి వంశ రాజులు విజయనగర చరిత్రను ఎంతగానో పెంచారు. విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు 1509 నుంచి 1530 వరకు పాలించాడు. వీరి పాలనా కాలం తెలుగు సాహిత్య చరిత్రలో ప్రబంధయుగమని, స్వర్ణ యుగమని పిలవబడింది.

## ప్రబంధం :

రాయల కాలంలో ఇది ప్రత్యేకమైన ప్రక్రియగా పేరు గాంచింది. రాయల కాలంలో వచ్చిన కావ్యాలకి ప్రబంధం అనే పేరు ఏర్పడింది. ప్రకృష్టమైన బంధం కలిగినదే ప్రబంధం. సినారే చెప్పినట్లు "రచన విధానంలో, కథ వస్తువులో, పాత్ర చిత్రణలో, రస పోషణలో, అలంకరణ వర్ణనాదికంలో కొత్త రీతులు సంతరించుకున్న కావ్య ప్రక్రియనే ప్రబంధంగా పేర్కొనాలి" (తెలుగు సాహిత్య చరిత్ర, డా. ద్వానా శాస్త్రి పుట: 95) ప్రబంధానికి వర్ణనలు ఎక్కువ ప్రాధాన్యత. అష్టాదశ వర్ణనను పోలుస్తూ ప్రబంధ రచన జరుగుతుంది. పురాణంలోని అంశాన్ని స్వీకరించి విస్తృతంగా వివరించి రాయడం ప్రబంధం లక్షణం. ఇతివృత్తం ప్రఖ్యాతం, కల్పితం, మిశ్రమంగా ఉండి ఏక నాయకాశ్రయమై ఉంటుంది. ప్రబంధ కవులకి శృంగార రసాపేక్ష ఎక్కువ అందుకే అంగీరసంగా శృంగారాన్ని ఎంచుకొని రచనలు చేశారు.

నన్నెచోడుని కాలం నుండి ప్రబంధం అనే పదం వాడకలోకి వచ్చింది. శ్రీనాధుని శృంగార నైషదంలో దీని ప్రస్థావన కనిపిస్తుంది. శ్రీకృష్ణదేవరాయల కాలంలోని రచనల్లో పూర్తి ప్రబంధ లక్షణాలు కనిపించడం వల్ల ఈ యుగాన్ని ప్రబంధ యుగంగా చెప్పారు.

తెలుగు దెలయన్న దేశంబు తెలుగేను
..................... దేశభాషలందు తెలుగు లెస్స

అన్న కృష్ణదేవరాయల పలుకులు అక్షర సత్యాలు. నాగాంబ, నరసరాయుల పుత్రుడైన శ్రీకృష్ణదేవరాయలు తిరుమల దేవి, చిన్నదేవి, అన్నపూర్ణాదేవిలను వివాహం చేసుకున్నారు. కళా పోషకులు, రాజకవి, కవి రాజు అయిన రాయలు తన ఆస్థాన కవులతోనే కాకుండా తను కూడా కావ్యాలని రచించాడు.

## భువన విజయం :

రాయలు కవిత గోష్టులు, విద్యా వినోదాలు నిర్వ హించేందుకు ఏర్పాటు చేసిన వేదికనే 'భువన విజయం'. దీనిలో ఉండే కవులను అష్టదిగ్గజాలు అని పిలిచేవారు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మాదయగారి మల్లన, ధూర్జటి, తెనాలి రామ కృష్ణుడు, పింగళి సూరన, రామ భద్రుడు, రామరాజభూషణులతో భువన విజయం కలకలలాడేది. దేవరాయలు కళాపోషకులు అనడానికి వీరి కాలంలో వచ్చిన కావ్యాలే నిదర్శనం.

## శ్రీకృష్ణదేవరాయల రచనలు :

ఆముక్తమాల్యద ప్రబంధ కావ్యం కాగా సంస్కృతంలో మదాలస చరిత్ర, సత్య వధుప్రీణం, సకల కథా సార సంగ్రహం, జాంబవతీ కళ్యాణం నాటకాన్ని అలాగే జ్ఞాన చింతామణి, రసమంజరి అనే రచనలను కూడా చేశారు. హజా రామాలయం, విట్టల స్వామి ఆలయం వీరి కాలంలోని చారిత్రక కట్టడాలు. ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగన సార్వభౌముడు, పరిభూత సురత్రాణుడు, మూరు రాయల గండడు, యవనరాజ్య స్థాపనచార్యుడు అనే బిరుదులతో రాయలు తన సామ్రాజ్యాన్ని పాలించాడు.

**ఆముక్త మాల్యద :**

విష్ణు చిత్తీయమనే మరొక పేరు కలదు. ఏడు అశ్వాసాల శృంగార ప్రబంధ కావ్యంగా ప్రసిద్ధి పొందినది. తమిళంలో చూడి కొడుత్తాల్ అన్న పేరుతో పిలవ బడుతుంది. ఆముక్తమాల్యద అంటే తాను ధరించిన మాలను సమర్పించుట అని అర్థం. మొదటిసారిగా నాయికా పేరు మీదుగా వెలసిన ప్రాచీన ఆంధ్ర గ్రంథంగా చెప్పవచ్చు. విష్ణు చిత్తుడు మహావిష్ణువు కోసం అలిన పూలమాలను గోదాదేవి ముందుగా తాను ధరించి తర్వాత దేవునికి సమర్పించేది అందుకే దీనికి అముక్తమా లేదా అని పేరు వచ్చింది. దీనిలో వర్ణించిన ఉపా ఖ్యానాలు  విష్ణు చిత్తునివృత్తాంతం, గోదాదేవి శ్రీరంగేశ్వరుల పరిణయం, మాల దాసరి కథ ,యమునా చార్యుల వృత్తాంతం, కాండిక్యకేశధ్వజోపాఖ్యానం. గోదావరి శ్రీరంగేశ్వరుల కళ్యాణం రాయలు వర్ణనా ప్రియుడు కాబట్టే ఈ కథలో వర్ణనకి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. విష్ణు భక్తిని ప్రబోధించే ఈ ప్రబంధాన్ని శ్రీ వెంకటేశ్వర స్వామికి అంకితం ఇచ్చాడు.

**శ్రీకృష్ణదేవరాయుల భువన విజయంలోని అష్టదిగ్గజాలు :**

భువన విజయ సభలో  అష్టదిగ్గజాలను పోషించి, అష్టాదశ వర్ణలతో,  ఏక నాయకాశ్రయంలో  ప్రబంధ కావ్యాలను సభలోని కవులచే రచింపచేశారు.

**అల్లసాని పెద్దన :**

రాయల ఆస్థానంలో 16వ శతాబ్దంలో  అష్టదిగ్గజాలలో అగ్ర ధన్యుడు. పెద్దన్న తండ్రి చొక్కానామాత్యుడు, గురువు శఠగోపయతి. రాయల చేత గండపెండేరాన్ని తొడిగించుకున్న ఘనుడు. ఆంధ్ర కవిత పితామహుడిగా బిరుదును పొందిన పెద్దన మను చరిత్రను మార్కండేయ పురాణ కథ నుంచి స్వీకరించి రచించాడు. సమగ్ర ప్రబంధ లక్షణాలతో వెలువడిన మొదటి రచన మనుచరిత్రకు స్వారోచిత మనసంభవం అనే పేరు కూడా ఉంది. హరికథా సారం లభించడం లేదు, జిగిబిగి అనే కవితాశైలి వీరి సొంతం. ప్రవరుడు పాద లేపనంతో హిమాలయాలను చూడడానికి వెళ్లడం అక్కడ వరూధినితో జరిగిన సంఘటనలు ప్రవరుని వ్యక్తిత్వాన్ని తెలుపుతాయి. వరూధినిని అప్సరస, గాన కళ కోవిద, కామశాస్త్రంలో దిట్టగా పెద్దన సృష్టించాడు. ప్రవరుని కోమలత్వాన్ని అంద చందాలను చూడగానే అతడిని మోహిస్తుంది . ప్రవరుడు భక్తి తత్పరుడు, ధర్మ వీరుడు, యాగాది అనుష్టానం, ఇంద్రియ నిగ్రహము కలిగిన వాడు కావున తిరస్క రించాడు. భార్యని తప్ప అన్యకాంతని ఆకాంక్షించనని వరూధిని  కోరికను తృణప్రాయంగా తిరస్కరించాడు.

గంధర్వుడు మాయా ప్రవరుని రూపంలో వచ్చి వరూధిని మోసం చేసి సంగమించగా వారికి మనువు జన్మిస్తాడు. మనోరమ ఇందీవరాక్షుని కుమార్తె గృహస్థ ధర్మాన్ని పాటించిన ఉత్తమ శీలి .మరొక ముఖ్యపాత్ర స్వరోచిచుడు, సరోచికి వనదేవత వల్ల పుట్టిన వాడు .హరి భక్తుడు, భూలోకాన్ని మనువుగా పాలించిన మహా మహుడు. పెద్దన్న రాయల భువన విజయం సాహిత్య సభలో మను చరిత్ర ప్రబంధాన్ని రచించి పాత్ర చిత్రనని కళ్ళ ముందుంచి రక్తి కట్టించారు. ప్రవరాఖ్యుని ఉత్తమ గుణాలు పెద్దన ప్రవరుని రూపురేఖల్లో  ఉపమ, రూపక అలంకారాలతో వర్ణించి రాయలకే అంకితం ఇచ్చి రాజభక్తిని తెలిపాడు. పంచ మహాకావ్యాలలో ఒకటైన మను చరిత్ర రచించిన పెద్దన రాయలచే పల్లకి మొయించుకున్నాడు అనేక గ్రామాలను దానంగా పొందాడు.

**నంది తిమ్మన :**

రాయల అష్టదిగ్గజాలు భువనవిజయ సభలో రెండవ వాడిగా పేరు పొందాడు. ముక్కు తిమ్మన అనే పేరు కూడా ప్రసిద్ధి. అరణపు కవిగా కూడా పిలుస్తారు. పారిజాతపహరణం కావ్యాన్ని రచించి రాయలకు అంకితం ఇచ్చాడు. వాణి విలాసం దొరకడం లేదు. ముక్కు తిమ్మనార్య ముద్దు పలుకు అని నానుడి లోకంలో ప్రసిద్ధి. తిమ్మన గారి ముక్కు పెద్దగా ఉండడం కాగా మరొక

ప్రసిద్ధి తిమ్మన ముక్కు మీద అందమైన పద్యాలను రాశాడు అందుకే ముక్కుతిమ్మని పేరు వచ్చిందని అంటారు. ముక్కు పద్యాన్ని రామరాజభూషణుడు తిమ్మన దగ్గర కొనుక్కొని తన వసు చరిత్రలో రాశాడని అంటారు. తిమ్మన రాయల వారి పెద్దభార్య తిరుమల దేవితో అరణంగా వచ్చాడు.

**పారితాపహరణం :**

ఐదు ఆశ్వాసాల శృంగార ప్రబంధం. వ్యాసుని హరివంశం నుండి కథా వస్తువు స్వీకరించి వర్ణనలతో మధురంగా రచించాడు.

పారిజాతాపహరణంలోని ప్రధాన కథా ఘట్టాలు: అతిథి వృత్తాంతం, ఇంద్రుని వృత్తాంతం, సత్యభామ స్వాంతనం, పుణ్యకవ్రత వృత్తాంతం. తిమ్మన ఈ కథ రాయడానికి కారణమైన మరో కథ నేడు ప్రచారంలో ఉంది. తిరుమల దేవి పాదం రాయల వారి శిరస్సును తాకగా రాయలు తిరుమలాదేవిని వదిలేశాడు. చాలా కాలం బాధపడిన తిరుమల దేవి తన బాధను తిమ్మనతో చెప్పుకోగా వారి జీవితాన్ని చక్కదిద్దడానికి రాయలవారికి కనువిప్పు కలిగించడానికి భార్యాభర్తల మధ్య గల ప్రేమకు చిన్నచిన్న ఆటంకాలు సహజమని తెలపడానికి పారిజాతాపహరణం రచించాడు. నారదుడు, సత్యభామ, శ్రీకృష్ణుడు, రుక్మిణి మొదలైన పాత్రలు ఇందులో ఉన్నాయి.

నారదుడు పారిజాత పుష్పంతో కృష్ణుని వద్దకు రాగా ఆ పుష్పాన్ని కృష్ణుడు రుక్మిణికి ఇస్తాడు. ఆ సమయంలో నారదుడు బహు కోపిష్టైన సత్యభామ గురించి కొంత ప్రస్తావన తీసుకువస్తాడు. నారదుడు వచ్చి పుష్పం ఇచ్చిన తీరు ఆ పుష్పాన్ని కృష్ణుడు రుక్మిణికి ఇచ్చిన విధానం చెలికత్తె సత్యభామకు తెలుపుతుంది.

పారిజాత పుష్పాన్ని రుక్మిణికి ఇచ్చాడనే కోపంతో పాటు అక్కడ జరిగిన సంఘటన గురించి భర్త ఏమి మాట్లాడ కుండా ఉండడం మొదలైనవన్నీ సత్యభామ కోపానికి కారణాలు అయ్యాయి. భామ కోపాన్ని గ్రహించిన కృష్ణుడు ఆమెను బ్రతిమాలుతాడు ,చివరికి కాళ్లు కూడా పట్టు కుంటాడు. సత్యభామ మాత్రం దూర్త గోపాలుడు, పశు ల కాపరి అంటూ అనేక విధాలుగా మాట్లాడుతుంది. చివరికి పారిజాత పుష్పానికి బదులు వృక్షాన్ని తెచ్చి ఇస్తానని ఒప్పుకోగా ఆమె కోపాన్ని తగ్గించుకుంటుంది. సత్యభామతో స్వర్గం వెళ్లి దేవేంద్రునితో నందనోధ్యాన వనంలో యుద్ధం చేసి, పారిజాత వృక్షాన్ని తీసుకొని కృష్ణుడు భూలోకానికి వస్తాడు. ఈ విధంగా భార్య కాలుతాకడం కృష్ణునినంతటి వాడికి గౌరవాన్ని పెంచింది అని సూచనప్రాయంగా రాయాలను మెప్పించాడు తిమ్మన.

**మాదయగారి మల్లన :**

రాజశేఖర చరిత్రను రచించి నాదెండ్ల అప్పయ్య మాత్యునికి అంకితం ఇచ్చాడు. కాంతిమతి రాజశేఖరుడు ప్రధాన పాత్రలు  కాగా ఇతర పాత్రలను కూడా సందర్భానుసారంగా వర్ణన చేసి అద్భుతంగా తీర్చిదిద్దాడు మల్లన్న.

**ధూర్జటి :**

సింగము, నారాయణ మాత్రులకి ధూర్జటి జన్మిం చాడు. మహాదేశ సార్వభౌముడు శివ భక్తుడు అయిన ధూర్జటి సంసార సుఖాలను అనుభవించిన తర్వాత విరక్తి చెంది యోగి అయ్యాడు. శివునిపై భక్తితో కాళహస్తి మహత్యం, కాళహస్తీశ్వర శతకం అనే రచనలు చేశాడు.

రాయల అష్టదిగ్గజాలలో ఏకైక శివ భక్తుడు, రాజా శ్రయంలో ఉండి కూడా తన కావ్యాలను రాజాంకితం చేయకుండా భగవంతునికి అంకితం చేసిన గొప్పవాడు.' అతులిత మాధురి మహిమ' వీరి కవితాశైలి. మనవడు వెంకటాచార్యుడు రాసిన కృష్ణరాయ విజయంలో ధూర్జటి గురించి వివరాలు ఉన్నాయి. కాళహస్తీశ్వర మహత్యానికి మూలం స్కంద పురాణంలోని వైష్ణవఖండలోని ఆరవ అధ్యాయం. నాలుగు అశ్వాసాల ప్రబంధమైన ఈ కావ్యంలో ప్రధాన ఘట్టాలు వశిష్టుని వృత్తాంతం, బ్రహ్మ వృత్తాంతం, తిన్నని కథ, నత్కీరుని కథ , వేశ్య పుత్రికల

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

చరిత్ర, అగస్తుడు- స్వర్ణముఖి నది కథ ముఖ్యమైనవి. సాలె పురుగు, పాము, ఏనుగుల భక్తి చరిత్ర ప్రధానంగా చెప్తాడు. శ్రీకాళహస్తీశ్వర మహత్మ్యం మధుర ప్రబంధం దీనిలో యాదవ భోపాలునికి శివునికి జరిగిన సంభాషణ ప్రధాన ఇతివృత్తంగా కొనసాగింది. పోతన తర్వాత తన రచనలని నరాంకితం చేయని కవి ధూర్జటి అని చెప్పవచ్చు. శ్రీ అంటే సాలెపురుగు, కాలం అంటే పాము, హస్తి అంటే ఏనుగు ఈ మూడింటికి కాళహస్తిలో శాప విమోచనం ఎలా జరిగిందో తెలియ చెప్పేదే శ్రీకాళ హాస్తీశ్వర మహత్మ్యం. శివలింగానికి పాము మాణిక్యా లను, మణులను తెచ్చి పూజిస్తే ఏనుగు వాటిని తీసి తొండంతో నీరు తెచ్చి పోయడం, మారేడు దళాలు, తామర పూలతో సేవించడం తర్వాత పాము వచ్చి వాటన్నింటినీ తీసి మళ్లీ మాణిక్యాలతో పూజించడం ఇలా జీవాలకు ప్రాణాన్ని కల్పించి అద్భుతంగా తీర్చిదిద్దాడు.

మధురానగరంలో మాణిక్యవల్లి అనే వేశ్యకు ఇద్దరు కుమార్తెలు అమిత శివ భక్తురాండ్లు, ఆడే ఆటలు కూడా శివమయాలుగా ఉండేవి. తల్లి వీరిని వేశ్యవృత్తిలో మార్చడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించవు. చివరికి శ్రీకాళహస్తీశ్వరుని దర్శించి ఆ ఇద్దరు శివ కైవల్యాన్ని పొందుతారు. ఇలా శివ భక్తిని బలోపేతం చేసిన ధూర్జటి మహాకవి రచించిన నీతి, వైరాగ్య శతకమే కాళహస్తీశ్వర శతకం.

అయ్యల రాజు రామభద్రుడు: రామాభ్యుదయం అనే రచనలు చేసి గొబ్బూరి నరసరాజుకు అంకితం ఇచ్చాడు. రాయలు తన సకల కథా సార సంగ్రహమను సంస్కృత కావ్యాన్ని తెలుగులోకి అనువదించమని కోరినట్లు ఆధారాలు ఉన్నాయి.

తెనాలి రామకృష్ణుడు: తెలుగు వారికి రామలింగడుగా సుపరిచితుడైన తెనాలి రామకృష్ణుడు రాయల ఆస్థానంలో ఒకరు. తెనాలి వాస్తవ్యులు రామకృష్ణుని ఇంటిపేరు గార్లపాటి. పాలగుమ్మి ఏలేశ్వరుడు తెనాలి రామకృష్ణుని గురువు. వికటకవి, పరిహాస ప్రియుడు, కుమార భారతీ బిరుదులు ఉన్నాయి. ''వాక్చమకృతి గల ఉద్దండ పండితుని''గా ప్రసిద్ధి పొందాడు. ఉద్భటారాధ్య చరిత్ర ,ఘటికాచాల మహత్మ్యం, పాండురంగ మహత్మ్యం, హరి లీల విలాసం, కందర్పకేతు విలాసాలు లభించడం లేదు.' పాండురంగ విబుని పద గుంఫనంబు' అని వీరి శైలికి ప్రత్యేకత కలదు.

రామకృష్ణుడు మొదట శైవుడు అందుకే ఉద్భటారాధ్య చరిత్ర అనే శైవ ప్రబంధ కావ్యాన్ని రచించి ఊర దేశ మంత్రికి అంకితమిచ్చాడు. పాల్కురికి సోమనాథుని బసవ పురాణంలోని ఉధ్భటుని కథని ఉధ్భటారాధ్య చరిత్రకు మూలం. పాండురంగ మహత్మ్యం ఘటికాచల మహత్మ్యం ఈ రెండు క్షేత్ర మహత్మ్యం గల కావ్యాలు. స్థల పురాణ గ్రంథాలను క్షేత్ర మహత్మ్య కావ్యాలంటారు.. పాండురంగ మహత్మ్యాన్ని విరూరి వేదాద్రి మంత్రికి అంకితం ఇచ్చాడు. స్కంద పురాణం నుండి ఇతివృత్తాన్ని గ్రహించి పాండురంగ మహత్మ్యాన్ని రచించాడు. దీనిలో ముఖ్యమైన ఘట్టాలుగా పుండరీకోపాఖ్యానం, నిగమ శర్మోపాఖ్యానం, శ్రీకృష్ణ అవతార చరిత్ర ,శ్రీ రాధాదేవి చరిత్ర, కాకి, హంస, పాము, చిలుక, తేనెటీగ మోక్షం పొందిన కథ, సుశర్మోపాఖ్యానం, సుశీల అనే పతివ్రత కథ, ధర్మరాజు తమ్ములతో కలిసి పాండురంగ క్షేత్రం దర్శించిన కథ, ఆయుతనియతోపాఖ్యానం.

ఘటికాచల మహత్మ్యంలో ప్రధాన దైవం యోగ లక్ష్మీనరసింహస్వామి. 108 దివ్య తిరుపతిలలో ఘటికా చలం ఒకటిగా పిలవబడుతుంది.

పాండురంగ మహత్మ్యం పాత్రలు: పుండరీకుడు మహా భక్తుడు శాంతి, దయ అనే గుణాలతో మూర్తి భవించినవాడు. కృష్ణుని గురించి తపస్సు చేసి లోక కళ్యాణం కోసం భూమి పై అవతరించమని కోరిన ఉదాత్తముడు. రాధాదేవి చరిత్రలో రాధను ఒక సామాన్య స్త్రీ మాత్రమే కాదు ఆనంద రూప శక్తిగా తీర్చిదిద్దాడు. కృష్ణునికి వరసకు మేనత్త అయిన రాధ సౌందర్యవతి తపస్సు చేసి కృతార్థురాలైంది. కృష్ణుడు కూడా మాయతో

కప్పబడిన జీవాత్మలుగా రాధతో భోగాలను అనుభవించాడు. సుశీలోపాఖ్యానంలో సుశీల పేరుకు తగినట్టు సౌశీల్యవతి. దుష్టుడైన భర్త వల్ల బాధలు పొందిన సాధ్వి.

ఆయుతనియతోపాఖ్యానంలో ఆయూతుని పాత్రకి ప్రాధాన్యం ఎక్కువ. ఉత్తముడు దీక్షా దక్షితలు కలిగిన ఆయతుని ద్వారా గృహస్థ ధర్మప్రశస్థాని రామకృష్ణుడు తెలిపాడు.

పాండురంగ మహత్మ్యంలో పైన పేర్కొన్న పాత్రలని ఒక ఎత్తు అయితే నిగమ శర్మ అక్క పాత్ర మరొక ఎత్తు. ఒక అద్భుత సృష్టిగా సాహిత్యకారులు కొనియాడారు. పేరు లేని ఈ పాత్ర ఎంతో పేరుగాంచిదని చెప్పవచ్చు. తమ్ముడు నిగమ శర్మ నీచ స్థితిని తెలుసుకుని అతడిని మంచి మార్గంలో పెట్టాలని నిర్ణయించుకుంది. వేద పఠనం మరిచాడని, బంధు ప్రీతిని మరిచాడని తెలిసి పుట్టింటికి వచ్చి సన్మార్గాన్ని వీడితే 'సాల గ్రామ ఖనిలో గులకరాళ్లు పుట్టినట్లే కదా' అంటూ తమ్ముడి కాపురం చక్కదిద్దడానికి ప్రయత్నించింది.

**పింగళి సూరన :**

కర్నూలు జిల్లా నంద్యాల తాలూకా కానాల గ్రామ నివాసి. గిరిజా కళ్యాణం, గరుడ పురాణం లభించడం లేదు. రాఘవ పాండవీయం , కళాపూర్ణోదయం, ప్రభావతి ప్రద్యుమ్నం అనే కావ్యాలు నేడు అందుబాటులో ఉన్నాయి. ద్వర్థికావ్య రచనకు తెలుగులో మార్గాన్ని వేసిన వాడు సూరన. రాఘవ పాండవీయం తొలి తెలుగు ద్వర్థికావ్యం దీనిలో ఒకే పద్యంలో రామాయణ, మహాభారత కథలు వచ్చేలా రచించి తన సాహితీ పటిమను చాటుకున్నాడు. రాఘవ పాండవీయాన్ని విరూపాక్షేశ్వరునికి అంకితం ఇచ్చాడు.

### కళాపూర్ణోదయం :

8 అశ్వాసాల ఈ ప్రబంధం కల్పితం ఇతివృత్తంతో రచించబడింది. నాటకరూపంలో ఉన్న నవల ప్రబంధంగా పేర్కొంటారు. ఆరుద్ర తన సమగ్రాంధ్ర సాహిత్యంలో కళాపూర్ణోదయం కొంత నవల, నాటకం , ఈనాటి సినిమా లాగా అనిపిస్తుందని తెలిపాడు.

### కళాపూర్ణోదయంలోని ప్రధాన ఘట్టాలు :

సరస్వతీ చతుర్ముఖుల ప్రణయ కలహ వృత్తాంతం, కలభాషిని -మణికందరుల కథ, సుగాత్రి శాలీనుల కథ. ఈ కథకి మూలం సరస్వతీ ,చతుర్ముకుల ప్రణయ కేళి విలాసమే.

### ప్రభావతి ప్రద్యుమ్నం :

సూరన్న చివరి రచన తండ్రి అయిన అమరామాత్యునికి అంకితమిచ్చారు. శుచిముకి పాత్ర సూరన్న గారి అపూర్వ సృష్టి. వజ్రనాభుని వధ, శుచిముఖి కథ, గంగావతారణం ప్రధాన ఘట్టాలు. ఈ కావ్యం చదువుతున్నప్పుడు శుచిముఖి పాత్ర కోసమే ప్రభావతి ప్రద్యుమ్నం సూరణ రచించాడేమోననే అభిప్రాయం కలుగుతుంది. హంస ఈ కథకి కేంద్ర బిందువు. ఇంద్రుడికే ఉపాయం చెప్పగలదిట్ట, ప్రభావతీ, ప్రద్యుమ్నులను కలిపి, వజ్రనాభుని చంపించి దేవతలకు మేలు చేసింది. అందుకే శుచిముకి బుద్ధిబలం అసమానమైనది.

### రామరాజభూషణుడు :

అసలు పేరు మూర్తి రాజు, వ్యవహార నామం భట్టుమూర్తి. రాయల సాహితీ సభలోని అష్టదిగ్గజాలలో తనదైన పాండిత్యాన్ని నడిపించాడు. చతుర్విధ కవితా నిర్మాత, సంగీత రహస్య కళానిధి, శ్లేష కవితా చక్రవర్తి బిరుదులతో పాటు లాక్షణికుడు ,బహుశాస్త్ర కోవిదుడు, సాహిత్య రస పోషకుడు అనే ప్రాచుర్యం పొందాడు. కావ్యాలంకార సంగ్రహం (లక్షణ గ్రంథం), వసుచరిత్ర (శృంగార ప్రబంధం), హరిశ్చంద్ర నలోపాఖ్యానం (ద్వర్థీ కావ్యం) రచనలు.

### కావ్య అలంకార సంగ్రహం :

నరస భూపాలయం అనే పేరు కూడా కలదు. ఓబయ్య నరసరాజుకు అంకితం ఇచ్చాడు. సంస్కృత

విద్యానాథుడు రచించిన ప్రతాపరుద్ర యశోభూషణం అనుసరించి రచించిన లాక్షాణీయ గ్రంథం. 8 అశ్వాసాల శృంగార ప్రబంధ కావ్యమే వసు చరిత్ర. తెలుగు పంచ మహాకావ్యాల్లో స్థానం ఉంది. మహాభారతంలోని కథలు కొంత గ్రహించి వర్ణనలతో తీర్చిదిద్దిన ప్రబంధ కావ్యం వసుచరిత్ర. నన్నయ ఆది పర్వంలో కూడా ఉపరిచర వసు వృత్తాంతం దీనికి ఆధారం. తిరుమల రాయలకి అంకితం ఇచ్చాడు. వసు చరిత్ర ద్వారా శ్లేష కవితా చక్రవర్తిగా పేరు పొందాడు. ఈ ప్రబంధంలో ప్రధాన కథా శుక్తిమతి నది, కోలాహాలుడనే పర్వత రాజుకు జన్మించిన గిరిక. గిరిక, వసురాజుల వివాహమే వసు చరిత్ర ఇతి వృత్తం.

వసు చరిత్రలోనే ప్రధాన ఘట్టాలు: శుక్తమతి కోలాహాలుల వృత్తాంతం, గిరిక వసరాజుల వివాహ వృత్తాంతం, మంజువాని దౌత్యం,. గిరిక శుక్తమతి కోలాహాల కూతురు వసు చరిత్ర శ్లేష వైచిత్రికి పుట్టినిల్లుగా పేరుగాంచింది. కోలాహలుడు శుక్తమతిని బంధించి రతి జరపగా గిరిక జననం జరిగింది. పెరుగుతున్న గిరికను వసు రాజు చూసి ఇష్టపడతాడు. యుక్త వయసులో గిరికను తన తండ్రి అద్దాలమేడలో ఉంచి వీణ వాయిద్యాలు నేర్పిస్తాడు. ఆ సమయంలో వసురాజు ఆమెను చూసి మోహిస్తాడు. గిరిక చెలికత్తె మంజువాని, నర్మసకుడు వీరిని కలపడంలో సహాయం చేస్తారు. చివరి రచన హరిచంద్ర నాలోపాఖ్యాను రామచంద్రునికి అంకితం ఇవ్వబడింది.

రాయల తన పాలనలో సాహిత్య సభను పోషించడమే కాదు ఈ సభలో పాండిత్య సంపద గల కవి మహాశయు లను కూడా పోషించాడు.

**ముగింపు :**

శ్రీకృష్ణదేవరాయల భువన విజయం ఆనాటి కాలంలో సాహితి ప్రబంధాలకు నిలయం. వీరి ఆస్థానంలోని ఒక్కొక్క కవి ఒక్కో రకం పాండితీ ప్రకర్ష కలవారు. రాయలనాటి ప్రబంధాలు ఈనాటికి ప్రజలలో మనసులో చోటుచేసుకుని అలాగే ఉండిపోయాయి. రాయల ఆస్థాన కవులే కాని వీరి రచనా విధానం , శైలి భిన్నంగా ఉం డేది. కొన్నిసార్లు రాయల కావ్యమా ఆస్థాన కవుల కావ్యమో చెప్పడానికి వీలు లేనంతగా కలిసిపోయి రచించేవారు. నేటికీ సాహిత్యం ఇంకా ముందుకు నడుస్తుంది అంటే రాయల కాలంలోనే ప్రబంధ కావ్యాల గొప్పతనమేనని చెప్పవచ్చు. అందుకే ఈ కాలంలోనే యుగాన్ని ప్రబంధ యుగం, స్వర్ణ యుగం అని పిలవడం అతిశయోక్తి కాదు.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. ఆముక్తమాల్యద, ఆంధ్రవాఖ్యానం,వావిళ్ల, రామస్వామి శాస్త్రులు, అండ్ సన్, 1907.
2. పారిజాతాపహారణం, శ్రీ నాగపూడి కుప్పుస్వామి, మొహన్ పబ్లికేషన్, 2024.
3. శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం, శ్రీ బులుసు వేంకటరమణయ్య గారు, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్సు,1966.

❖❖❖

# చేనేత వృత్తి జీవన కథలు- ప్రపంచీకరణ ప్రభావం

- వై. శివకుమార్, పరిశోధక విద్యార్థిని.

మన సమాజంలో ఉన్న వ్యక్తులు, సమూహాలు, వృత్తులను చూడకుండానే అడుగువర్గాల బతుకుల్ని అర్థం చేసుకోలేం. పాత సమాజం ఈ వ్యక్తులకు, శక్తులకు చాలా అన్యాయం చేసింది. భూస్వామ్యం శ్రమదోపిడీనే కాదు మతం, కులం బిగిచట్రంలో బంధించి వారిని మరింత కుంగదీసింది. ఆధునికత, సాంకేతికాభివృద్ధి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఏవీ కూడా వాళ్ల జీవితాన్ని కొద్దిగానైనా కదిలించలేకపోయాయి. అభివృద్ధి మార్గాన నడపలేకపోయాయి. కాలం మారింది. మారు తుంది. కాని ఈ జీవితాలు మారలేదు. వీటితోపాటు కొత్తగా మరికొన్ని వృత్తులు సైతం వచ్చాయి. వాటి పరిస్థితి కూడా అంతంత మాత్రమే.

ఒకప్పుడు సమాజంలో గౌరవం, ఆర్థిక స్థిమితం కలిగి ఉన్న విశ్వబ్రాహ్మణులు ఇవ్వాళ కొత్తరకం సొమ్ముల తయారీ యంత్రాలవల్ల బికారులుగా మారిపోతున్న వైనం అందరికీ తెలిసిందే. ప్రపంచీకరణ ప్రభావంతో పద్మశాలీల ఆత్మహత్యల పరంపర పెచ్చు పెరిగింది. గిట్టుబాటు ధర లభించక ఆర్థిక నష్టం, అధికశ్రమ చేసి కూడా శ్రమకు సరిపడ ఆర్థిక వెసులుబాటు లేక అప్పుల పాలవుతున్నారు. రెడీమెడ్ దుస్తుల ప్రవాహాలలో దర్జీలు తమ అస్తిత్వాన్ని సైతం కోల్పోయి నామరూపాలు లేకుండా కొట్టుకు పోతున్నారు. కొన్ని వేల ఏళ్లుగా స్థిరమైన వృత్తులవారు ఇవ్వాళ అలవోకగా శోకసముద్రంలో మునిగి పొట్ట చేతబట్టి వలస కూలీలవుతున్నారు.

మరోవైపు కేవలం ఒక కులాన్ని మాత్రమే ఆశ్రయించి పొట్ట నింపుకొనే ఉపకులాల కళాకారులు భట్రాజులు సాతానులు బైండ్లోళ్లు డక్కలివారు మాష్టాళ్లు పిచ్చు కుంట్లు బుడబుక్కలవారు కాటిపాపలు లాంటివారు ఎన్నో శతాబ్దాలుగా యాచిస్తూ అడుక్కుంటూ , అర్థిస్తూ ఆధారపడి బతికినవాళ్లు వాళ్ల పోషక కులంవారే కృశించి పోతుంటే తమ గతేంకాను అని ఆక్రోశిస్తున్నారు. ఇలాంటి అడుగువర్గం వారికి విశ్వాసం అధికం. కడుపు కాల్చుకునైనా వాళ్లకి ఆట, మాట, పాటని అందించడానికి నిర్ణయించు కోవడం గొప్ప విషయమే. కాదనం. కాని అందువల్ల వాళ్లు ఎన్నిరకాల క్షోభకు గురవుతున్నారో చూసినవాళ్లకే ఎరుక!

పల్లెల్లో వ్యవసాయం ప్రధాన జీవనాధారం. ఆ వ్యవ సాయానికి అనుబంధంగా అనేక వృత్తులు కనిపిస్తాయి. కులాలు మనకు ఉంది. అందుకే అయితే క్రమంగా విద్యా, విజ్ఞానం కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, తట్టలల్లె ఎరుక, బుట్టలల్లే మేదరి - ఇట్లా అనేక పట్నంలోనూ సజీవంగా కనిపిస్తాయి. వారి అవసరం పట్నంలో కూడా చాలాకాలంగా అంటే కొన్ని తరాల నుంచి వారు బస్తీల్లో మనగలుగుతున్నారు. వారు సమాజంలో ప్రభావితం చేసే ఇతర సెక్షన్లను అనుకరించడం, అందుబాటులోకి రావడంతో వారిలో కొందరు తమ కులవృత్తులకు దూరమవు తున్నారు. ఇతర వృత్తులను చేపడుతున్నారు. 'నాగరికమైన వృత్తులను అక్కున చేర్చుకుంటు న్నారు. మేధో సంబంధమైన పనులు చేపడుతున్నారు. శ్రమ ఆధారిత వృత్తుల కన్నా క్రమంగా మేధో సంబంధ మైన వృత్తులను ఆశ్రయిస్తున్నారు. అలా చాలామంది పరాయీకరణ చెందుతున్నారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల పద్మశాలీల జీవన వృత్తులు కుంటపడ్డాయి. ఈ ప్రపంచీకరణ ప్రభావంతో విధ్వాంసం అయిన చేనేత పరిశ్రమ గురించి, చేనేత కార్మికుల గురించి తెలంగాణ కథా సాహిత్యంలో కథకులు అనేకమంది వివిధ ఇతివృత్తాలతో చేనేత కథలను రచించడం జరిగినది. ఈ నేపధ్యాన్ని తెలిపే ఉద్దేశ్యంతో ఈ వ్యాసాన్ని రాయడం జరిగినది. పద్మశాలీల బతుకుల గూర్చి "తెగినపోగు", "బొంబాయి ప్రయాణం" లాంటి కథల్లో కొక్కుల భాస్కర్, బొంబాయిలో ఉంటూ ప్రవాసాంధ్ర పద్మశాలీల బతుకుల

గూర్చి బొంబాయి కథలు రాసాడు అంబట్ల జనార్ధన్, ఆడెపు లక్ష్మీపతి పద్మశాలీ బతుకులు చిద్రమవడాన్ని త్రిభుజపునాలుగోకోణం కథలోనూ, మొసల్దానిముల్లే కథలోనూ ఐతా చంద్రయ్య 'చిలుక పచ్చచీరక కథలోను చిత్రించారు. పుప్పలనరసింహం గారి స్వగతాలు వివిధ వృత్తిపనివారి బతుకుల జీవితాలను చిత్రించే కథలు. చాకలి వృత్తి వారి బతుకుల నేపథ్యంలోంచి ఐతా చంద్రయ్య రాసిన 'వరాలమూట' కథ చెప్పుకో దగినది. కూతురు రాంరెడ్డి గౌడుల సమస్యపై వంకతాడు కథలో చిత్రించాడు. 'తలకోరుకుండ' కథల సంపుటిలో వివిధ కులాలు, వారి వృత్తులు ఏ విధంగా చిద్రమైపోతున్నాయో కళ్ళకు కట్టినట్లు చూపించాడు బోయజంగయ్య. దర్జీవారి బతుకుల చిత్రాన్ని, వారి వృత్తికి ఆటంకపర్చిన రెడిమెంట్ షాపుల దుస్థితిని పరవస్తు లోకేశ్వర్ ' దర్జీసాబ్' కథలో సూక్ష్మంగా వర్ణించాడు.

ఇలా తెలంగాణ కథాసాహిత్యంలో బి.సి.వాద కులవృత్తులపై ఎన్నో కథలు వచ్చాయి. మరెన్నో వస్తూనే ఉన్నాయి. పైన పేర్కొన్న కథలు ప్రస్తుత పరిశోధ నాంశానికి బలాన్ని చేకూరుస్తున్నాయి. ఇంకా పరిశోధిస్తే మరిన్ని కథలు సేకరించే అవకాశం ఉంది కనుక, ఇటువంటి కథల ఆధారంగా బీసీకులాల వృత్తుల జీవితాన్ని పరిశీలించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ బహుజనుల అస్తిత్వవాద బి.సి.వాద కథా సాహిత్యాన్ని అనే అంశాన్ని పరిశోధనకు అంశంగా ఎంచుకున్నాను.

ప్రపంచీకరణం తెచ్చిన విధ్వంసంలో గ్రామాలు గ్రామాలుగా ఉండలేకపోవడాన్ని వృత్తులు నశించడాన్ని, విలువలపతనాన్ని వస్తువినిమయ సంస్కృతి గురించి ముఖ్యంగా తెలంగాణ కథాసాహిత్యంలో - బి.సి కుల వృత్తులతో పాటు బహుజన కులాల వృత్తులపై ఎన్నో కథలు వచ్చాయి. ఈ పరిశోధన ద్వారా కులవృత్తుల గొప్పతనాన్ని చెప్పుతూ వాటివల్ల సమాజానికి ఎంత ఉపయోగం ఉందో తెలుపుతూ వాటికి పునర్వైభవం తీసుకురావడానికి ప్రయత్నిం జరిగింది.

ప్రపంచీకరణ వల్ల కులవృత్తులు ప్రభావాన్ని కోల్పోవటం తెలంగాణ యువత కార్మికులుగా, కూలీలుగా, దుబాయి, కువైట్ వంటి దేశాలకు వలసపోవడం ఆర్థికంగా వెనుకబాటుతనం వీరిని మరింత కుంగ దీసాయి. ఈ అంశాలన్నింటిని తెలంగాణ బి.సి.వాద కథా సాహిత్యం రికార్డు చేసింది. ప్రపంచీకరణ భారతదేశ అస్థిత్వానికి పెద్ద పదాలుగా మారింది. దేశీయమైన జీవనంలో ప్రతి అంశాన్నీ విదేశీయం చేయడానికి ప్రపంచీ కరణ వాదులు ప్రయత్నిస్తున్నారు. ప్రతి వస్తువును అమ్మకం సరుకుగా చేస్తూ మనుషుల మధ్య ఎత్తైన డబ్బు గోడలు కడుతూ మానవత్వపు విలువల్ని ప్రపంచీకరణ ధ్వంసం చేస్తుంది. తెలుగు కథానిక ఆవిర్భవించిన నాటి నుండి సమకాలీన పరిస్థితుల్ని, సంఘటనల్ని, నూతన పోకడల్ని విమర్శిస్తూ ముందుకు సాగింది. తత్ఫలితంగా ఎన్నో కొత్త కథలు తెలుగు కథా ప్రపంచంలో అడుగు పెట్టాయి. చేతివృత్తులు నాశనమైపోయి వాటిని నమ్ముకొన్న వాళ్లు వీధినపడడం, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, వ్యవసాయదారుని నడ్డి విరిచే ప్రయత్నాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో యంత్రాల్ని ఉపయోగించడం, చదువంటే కంప్యూటర్ విద్యనుకోవడం, కంప్యూర్ ఉద్యోగాలు చేసేవారు జీవనశైలి తక్కిన ప్రపంచం నుండి వారు విడిపోయినట్లుండడం, ఇటీవల కాలంలో వచ్చిన సెజ్, కోస్టల్ కాండాలు, ప్రాజెక్టుల వల్ల రోడ్డున పడ్డ ప్రజలు, విద్యారంగంలో ధనస్వామ్య లక్షణాల ప్రవేశం మొదలైన అంశాలపై తెలుగులో ఎన్నో కథలు వచ్చాయి.

గ్లోబలైజేషన్ అనే పదానికి తెలుగులో ప్రపంచీకరణ అన్న పదాన్ని సమానార్థకంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ క్రమాభివృద్ధిని, సామాజిక జీవన పరిణామాల్ని, ప్రపంచ దేశాల్లోని సంబంధాల్ని, మార్పుల్ని ప్రస్ఫుటం చేసేదే ప్రపంచీకరణ. 1990వ సంవత్సరంలో భారత దేశంలో ఆర్థిక మాంద్యం ఏర్పడటంతో ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాలు అవలంభించడంతో ప్రపంచీకరణకు ద్వారం తెరచినట్లయింది. తద్వారా ఆర్థిక, సామాజిక, రాజకీయ,

సాంస్కృతిక రంగాలలో పెనుమార్పులు వచ్చాయి. అట్టి మార్పులు ప్రజాజీవనంపై ప్రభావాన్ని చూపాయి.

ప్రపంచీకరణ ఫలితంగా బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం, వ్యవసాయంలో సంక్షోభం, ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి వాణిజ్య పంటల విస్తృతి పెరగడం, రైతు ఆత్మహత్యలు, సహజ వనరులు తగ్గడం, ప్రకృతి వినాశం, జలకాలుష్యం, వాతావరణ కాలుష్యం పెరిగి అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావడం, కుటీర పరిశ్రమలు, చేతి కులవృత్తులు సమసిపోవడం, కూలీల వలసలు, మేధో వలసలు, సంపాదన పట్ల మోజు, కంప్యూటర్ తదితర విదేశి విద్యలు, విదేశీ ఉద్యోగాల పరంపర కొనసాగించడం, గ్రామీణ సామాజిక జీవన విచ్ఛిన్నకర పరిస్థితులు, మానవ సంబంధాల్లో మార్పులు మొదలగు క్రొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

ప్రపంచీకరణ వల్ల మేలు కంటే కీడును సామాన్య ప్రజానీకం, కార్మిక కర్షక శ్రామికవర్గాల వాళ్ళు ప్రత్యక్షంగా ఎదుర్కొవడంతో, ఆ వర్గాల నుండి రచయితలుగా ఎదిగిన వాళ్ళు సాహిత్యంలో ప్రపంచీకరణ పరిణామాల్ని చిత్రిస్తూ వచ్చారు. అట్లా తెలంగాణ గ్రామీణ జీవిత నేపథ్యం గల కాలువ మల్లయ్య ఎన్నో కథల్లో ప్రపంచీకరణ పర్యవసనాల్ని చిత్రిస్తూ వచ్చారు.

కులవృత్తుల కథల ద్వారా తమ జీవితాలను ఆవిష్కరిస్తూ, వాస్తవ పరిస్థితులను వివరిస్తూ సమాజంలోని మనుషుల ఆలోచనల్లో మార్పు రావాలని కోరుతున్నారు. 1991-2000 మధ్య కాలంలో తెలంగాణ నుంచి అనేక బి.సి.వాద కులవృత్తి కథలు వచ్చాయి. ఈ కథలు రావడానికి కారణాలు అనేకం. 1.చదువులు పరాయీకరణ చెందడం. 2. గ్లోబలైజేషన్ మాయలో వృత్తులన్నీ కొట్టుకుపోవడం. 3.ప్రత్యామ్నాయ వనరులు కరువై ప్రజలు తల్లడిల్లడం వల్ల తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని గుర్తించి కథలు రాశారు. 'అడవిగాచిన వెన్నెల', 'శనార్థి', 'సొతంత్రదినం', 'భూమి కోసం', పద్మశాలీల గురించి రాసిన 'నిరీక్షణ', 'ఎదురు చూపు', 'దొరసాని చీర',బెస్తవాళ్ల గురించి రాసిన 'ప్రయాణం', 'హస్తం', 'భూమి పుత్రుడు' తదితరాలన్నీ పని సంస్కృతిని తెలిపే కథలే.

## సముద్రం - కోట్ల వనజాత :

పారిశ్రామీకరణ వల్ల నేత కార్మిక కుటుంబాలు వీధిపాలు కావడాన్ని కోట్ల వనజాత 'సముద్రం' (2008) కథ సూచిస్తుంది. ఈ కథలో మహేష్ నేత కార్మికుడు. మర మగ్గాలు పడి చేనేతకు ఆదరణ తగ్గడంతో పాలమూరు నుండి బొంబాయికి వలస వెళ్లాడు. అక్కడికి వెళ్ళిన కొన్నాళ్ళకే అనారోగ్యంతో ఉన్న భార్యకు వైద్యం చేయించే స్తోమత లేకపోవడంతో ఆమె చనిపోతుంది. అంత్యక్రియలు జరిపంచలేని దుస్థితిలో భార్య మృతదేహాన్ని రహస్యంగా సముద్రంలో వదిలేస్తాడు. పాలమూరుకు తిరిగి వచ్చేటప్పుడు చిన్నకూతుర్ని పోగొట్టుకుంటాడు.

## పొద్దు పొడుపు-వెల్దండి శ్రీధర్ :

తెలంగాణ నేపథ్యంలో చేనేత కార్మికుల దుఃతిని చిత్రిస్తూ పేదరికం వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం 'పొద్దు పొడుపు' (2009) కథలో వెల్దండి శ్రీధర్ చిత్రించారు. బాల్రాజు చేనేత కార్మికుడు. తొమ్మిదో తరగతిలో చదువాపి భీవండి వెళ్ళి మరుమగ్గాలపై పని చేస్తాడు. ఈ లోగా భీవండిలో అల్లర్లు జరుగగా తిరిగి ఊరు చేరుతాడు. సిరిసిల్లలో సాంచెలు పడటంతో కుటుంబంతో వెళ్ళి స్థిరపడతాడు. భార్య బీడీలు చుట్టినా, తాను సాంచెలు నడిపినా పస్తుల బతుకే గడుపాల్సి వస్తుంది. కూళ్ళరేట్లు తగ్గడం, కరెంట్ పోవడం వల్ల కూలీ గిట్టుబాటులేక ఇబ్బందులు పడుతాడు. సేటు పగారా ఇవ్వకపోవడంతో మార్కెటంతా తిరిగి ఇంట్లోకి నూకలు కొనడానికి చిల్లిగవ్వలేక, అప్పుపుట్టక వట్టి చేతులతో రావడానికి ముఖం చెల్లక వాగొడ్డుకు వెళ్ళి గౌడును బతిమాలి ఒక సీసా కల్లుతాగి వచ్చి గండంచెలో పడుకుంటాడు. 'అయ్యవ్వకు, పెండ్లాం బిడ్డలకు బుక్కెడు కూడు కూడా పెట్టక చాతగానోన్ని అయిపోయిన. నాకంటే బిచ్చగాళ్ళు నయం. అడుక్కుతిన్నా యాళ్ళకైన తింటారు..'

అని చింతిస్తాడు. భార్య తన అసమర్థతను గురించి తిడుతుంటే మంచంలోంచి లేచి బయటపడి నాంపెల్లి గుట్ట వరకు నడుస్తాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని కాగితంపై రాసి ఒక చెట్టుకు తాడుకట్టి ఉరిపెట్టుకోబోతున్నంతలో తెలంగాణ తల్లి సాక్షాత్కరించి కర్తవ్యం ఉపదేశించినట్లు తోచి నిర్ణయాన్ని మార్చుకొని తెలంగాణ ఉద్యమంలో చావో రేవో తేల్చుకోవాలన్న ఆలోచనలో పడుతాడు.

ముసల్దాని ముల్లె-ఆడెపు లక్ష్మీపతి: ఆడెపు లక్ష్మీపతి రాసిన 'ముసల్దాని ముల్లె' కథలో ప్రజల్లో కనిపించకుండా పోతున్న ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను కాపాడే ప్రయత్నం చేశాడు కథకుడు. ముసల్దాని ముల్లెలో ఉన్నవి మాగిన అరటి పండ్లే కాని ఆ పండ్లను ఆరాటంగా తన మనవలకు ఇవ్వాలని దాచుకుంటుంది. మనుషుల మధ్య 'ప్రేమ' అనే బంధం శాశ్వతంగా కొనసాగాలని కోరుతూ అర్థాలు చెప్పలేని, మనసుకు సంబంధించిన భావాలకు ఉనికి లేకుండా చెయ్యొద్దని ఈ కథ ద్వారా కథకుడు కోరుతున్నాడు. ఈ కథల ద్వారా పద్మశాలీల జీవితాలను ఆవిష్కరిస్తూ, వాస్తవ పరిస్థితులను వివరిస్తూ సమాజంలోని మనుషుల ఆలోచనల్లో మార్పు రావాలని కోరుతున్నారు.

1990-2000 మధ్య కాలంలో తెలంగాణ నుంచి అనేక బి.సి.వాద కథలు వచ్చాయి. ఈ కథలు రావడానికి కారణాలు అనేకం. 1. చదువులు పరాయీకరణ చెందడం. 2. గ్లోబలైజేషన్ మాయలో వృత్తులన్నీ కొట్టుకుపోవడం. 3. ప్రత్యామ్నాయ వనరులు కరువై ప్రజలు తల్లడిల్లడం వల్ల తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని గుర్తించి కథలు రాశారు. 'అడవిగాచిన వెన్నెల', 'శనార్థి', 'సొతంత్రదినం', 'భూమి కోసం', పద్మశాలీల గురించి రాసిన 'నిరీక్షణ', 'ఎదురుచూపు', 'దొరసాని చీర',బెస్తవాళ్ల గురించి రాసిన 'ప్రయాణం', 'హస్తం', 'భూమి పుత్రుడు' తదితరాలన్నీ పని సంస్కృతిని తెలిపే కథలే. బి.సి.లు కుల వృత్తులకు బదులుగా చదువు ద్వారా జీవితాలు గెలుచుకోవాలని గతం కంటే వర్తమానం గొప్పదని చెప్తూ బి.యస్.రాములు 'స్మృతి' కథల సంపుటి వెలువరించారు.

## లాకౌటు - ల్లూరిపల్లి రంగారావు :

గ్రామీణ చేనేత కార్మికుల వలసలను చిత్రించిన కథ వల్లూరిపల్లి రంగారావు రచించిన 'లాకౌటు'. పల్లెసీమల లోను నాగరికతా పరిణామాలు తరతరాలుగా సాగివస్తున్న చేనేత వృత్తులను వదులుకునేలా చేశాయి. తెలంగాణా జిల్లాలోని ఓ మారుమూల కుగ్రామంలో చేనేత వృత్తిచే జీవించే వ్యక్తి యాదయ్య. పల్లె సీమలలో చేనేత వృత్తులు మూలపడడంతో బ్రతుకుదెరువునన్వేషిస్తూ యాదయ్య పట్టణం చేరి అక్కడొక నూలు మిల్లులో కూలీ అయ్యాడు- కానీ - అచిర కాలంలోనే యజమానుల స్వార్థ దృష్టి, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నూలు మిల్లును 'లాకౌటు' దశకు చేర్చాయి. ఆ మిల్లులో పని చేస్తున్న కూలీల బాధలు యాజమాన్యం ప్రకటించిన చట్టవిరుద్ధమైన లాకౌటుతో రెట్టింపయ్యాయి. పల్లెలలో కులవృత్తులకు ఆదరణ లేక కడుపు చేతపట్టుకొని, భార్యాబిడ్డలను వెంటబెట్టుకొని బ్రతుకు తెరువు కోసం నగరాలకు వలస వచ్చిన వృత్తి పనివాళ్ళ పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టయ్యింది - మిల్లు లాకౌట్‌తో. ఈ కథలో ప్రధానంగా కనబడేది యాదయ్య, చంద్రమ్మల కుటుంబం. భర్త యాదయ్య ఇరవై రోజుల క్రిందట సొంత ఊరు వెళ్లాడు. అక్కడున్న తమ పూరిపాక తాలూకు కాళీస్థలం అమ్ముకు రావడానికని. కానీ భర్త ఎంతకూ తిరిగి రాకపోవడంతో చంద్రమ్మ మనసులో అనుమానం బయలుదేరింది. బహుశా ఇక యాదయ్య తిరిగి రాడేమోనని. ఎందుకంటే ఎందరో భర్తలు తమ తమ కుటుంబాలను పోషించలేక అలా నిర్దయగా వదిలేసి తమ దారి తాము చూసు కున్నారు. కాబట్టి. చంద్రమ్మ కుటుంబ స్థితి దయ నీయంగా ఉంది. చిన్నపిల్లలు ఆకలితో నకనకలాడి పోతున్నారు. యాదయ్య తిరిగి వచ్చేటప్పటికి ఆకలి కోరలకు చిక్కిన చంద్రమ్మ కుటుంబం దారుణంగా బలైంది. చంద్రమ్మ చిన్నపిల్ల గొంతు పిసికి చంపి, తను

ఉరిపోసుకొని మరణించింది. యాదయ్య భార్యా పిల్లలను పోగొట్టుకొని పిచ్చివానిలా రోదించాడు. ఆ మరునాడు మిగిలిన ఈ వలసలలో బలౌతున్న బడుగు జీవితాలకు దర్పణం. ఇలా గ్రామీణ రైతులు, వృత్తిపనివారు, శ్రామికులు తమ జీవితాలలో అనివార్యంగా ఎదుర్కొం టున్న చేనేత కార్మికుల వలసలను ఇతివృత్తంగా తీసుకొని ఈ కథల్లో రచయితలు వలస సమస్యను వివిధ దృక్కోణాల నుం డీ విశ్లేషించారు వలస అనేది కేవలం వ్యక్తిగత సమస్యగా గాక ఒక సామాజిక సమస్యగా భావించి, ఆ సమస్య వెనుకనున్న సాంఘిక, ఆర్థిక శక్తుల్ని రచయితలు తమ కథల్లో చర్చించారు. ఈ కథలు పాఠకులలో అవగాహనను, రస స్పందనను కలిగిం చడంతో బాటూ-పాలక వర్గాలలో తగిన ఆలోచనకు కలిగించడానికి కూడా దోహదపడుతున్నాయి.

### పశాంతం బతుకు పయనం - బి.యస్.రాములు:

ప్రపంచీకరణ ప్రభావాలతో పాత వృత్తులు, కొత్త వృత్తులు రెండూ కోల్పోతున్న తీరును 'ప్రశాంతం' కథ తెలుపుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచీకరణలో సాఫ్ట్ వేర్ రంగంలో పెరిగిన ఉపాధి అవకాశాలను పేదలు కూడా అందిపుచ్చుకొని ఎదిగిన తీరు 'బతుకుపయనం' కథ తెలుపుతుంది. అందర్ని గొట్టి ఈ పరిశ్రమలు ఎవర్ని బతికిస్తున్నాయి మామా? బక్కోడు, కుంటోడు కార్ల పోయేటోనితోని పోటి పడతారా?... పని చేసే రెండు చేతులకు పని కల్పించని ప్రణాళిక లేందుకు? ప్రభూత్వాలేందుకు?''. (1. బతుకుపయనం-ప్రశాంతం, పుట. 43) అని కులవృత్తులపైన, గ్రామీణ వ్యవస్థపైన ఆధారపడిన నేటి రాజకీయ వ్యవస్థను ఈసడించుకునే పరిస్థితి దాపురించింది. ఇలా మారిపోతున్న సామాజిక నేపథ్యంలో దాదాపు అన్ని కులాల, వర్గాల ప్రజలు వెతలకు గురైనారు. దాదాపు అన్ని కులాల వృత్తులు దెబ్బతిన్నాయి. ఇలా ఆయా కులవృత్తులు విధ్వంసమై, వారి బతుకుల్లో ఎలాంటి కష్టాలు వచ్చాయో అనే విషయాన్ని అనేక మంది కథాకారులు తమ కథలలో ప్రతిఫలించారు.

పరిణామాలు సమాజంలో, సంస్కృతిలో, మానవ సంబంధాల్లో, చేనేత కార్మికుల జీవితాల్లో తెచ్చిన మంచి, చెడులను చాలా కథల్లో చిత్రిస్తూ, చర్చిస్తూ విశ్లేషించి చూపాను. 'ప్రశాంతం', 'రాత్రిపూలు' కథలు గ్లోబలైజేషన్ తెచ్చిన విషాదాలను విశ్లేషించాయి. చేనేత కార్మికుల ఆత్మహత్యలు, వాటి వెనుక గల సామాజిక పరిణామాలు, ఆడపిల్లలకు పెళ్ళి చేయలేని తల్లిదండ్రుల దురవస్థ, ఆడపిల్లలు లేచిపోవడాలు తదితరాలను 'నానమ్మ', 'ప్రేమధార' కథలు రికార్డు చేశాయి. 'అసందిగ్ధ కర్తవ్యం'లో కుల మతాల కారణంగా ప్రమోషన్ ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా అడ్డుకుంటూ అగ్రకులాల వాళ్లు, అధికారులు ఎలా వక్రమార్గాలు పడతారో, , తద్వారా బాధితుల మానసిక సంఘర్షణ ఎలా ఉంటుందో చిత్రించారు. 'విధ్వంస దృశ్యం' కథలో నూతన పారి శ్రామిక ఆర్థిక విధానాలు, గ్లోబలైజేషన్ పరిణామాల్లో విచ్ఛిన్నమవుతున్న చేనేత కుటుంబ విలువలు చిత్రించారు.

### న్యూ బాంబే టైలర్స్ - మహమ్మద్ ఖదీర్ బాబు:

స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రపంచీకరణ విధానంలో తొలిదెబ్బ దేశీయమైన చేతివృత్తుల పైన, పడింది. చిన్న చిన్న వృత్తులతో బ్రతుకుబండిని నడి పిస్తున్న ప్రజల నడ్డి విరగొట్టిన ప్రపంచీకరణ ప్రయత్నా లను తెలుగు కథా రచయితలు దుయ్యబట్టారు. తెలంగాణ ప్రతి ప్రాంతం నుండి కథలొచ్చాయి. ఒకనాడు పల్లె ప్రజలకు ముఖ్యమైన వ్యక్తి పాత్ర పోషించిన 'టైలర్' వృత్తి రెడీమేడ్ దుస్తుల రాకతో ఎలా, అయోమయంలో పడిందో మహమ్మద్ ఖదీర్ బాబు న్యూ బాంబే టైలర్స్' కథ వివరించింది.

### 'వైపని' - జూకంటి జగన్నాథం :

అందమైన వస్త్రాలు తయారు చేసే సమర్థత గల చేనేత పరిశ్రమ వారు పవర్‌లూమ్స్ వచ్చాక తాము నేస్తున్న బట్టలకు ప్రతిఫలం దొరక్క ఆత్మహత్యలకు పాల్పడు తున్న నిజాన్ని 'వైపని' కథలో జూకంటి జగన్నాథం

వివరించాడు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల చేనేత మొదలైన కులవృత్తుల జీవనచిత్రణ విధ్వంసం అయింది. యంత్రాలతో పోటీపడలేక చేనేత వృత్తివాళ్ళు తమ వృత్తులను వదిలి వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. చిరునామా- జాతశ్రీ-ఆర్తారావం కథాసంపుటి, 2008
2. కుంతనం- బి.వి.ఎన్.స్వామి-సాహిత్య ప్రస్థానం, 2005
3. చేనేత చిత్రం- మునిపల్లెరాజు- కొత్తకథ కథాసంకలనం- వేదగిరి రాంబాబు, 1994
4. నూలుపోగు- ఎన్నార్ ఒనోలా-సృజన, 1982
5. భగ్నప్రేమ- దామోర్ల రమాకాంతరావు, శ్రీపద్మశాలి పత్రిక, 1932
6. తెలంగాణ కథా- తెలుగు  కథ, డా॥కాలువ మల్లయ్య, జగన్నాథ పబ్లికేషన్స్, 2018

❖❖❖

# తెలంగాణ గేయ కవిత్వంలో ధూంధాం కళారూపం ప్రత్యేకత

- అంతడుపుల నాగరాజు, పరిశోధక విద్యార్థి.

బొగ్గు బాయిలో పుట్టి, బొంబాయి వరకు చేరి, దుబాయి దాకా గల్లి నుండి ఢిల్లీ గద్దెను గడగడలాడించిన తెలంగాణ ధూం... ధాం.... ఇది ఒక కళాప్రకియ మాత్రమే. అయితే సాంస్కృతిక విభాగం కిందికి వచ్చేది కాని ఇది ఒక కళారూపం కాకుండా మొత్తం తెలంగాణ సమాజాన్ని కదిలించిన ఒక సాంస్కృతిక ఆయుధంగా మారింది. మలిదశ తెలంగాణ ఉద్యమానికి పాట వెన్నుముక, కళాకారుడి కాలి గజ్జెల చప్పుడు ఉద్యమ జేగంట. కవులు, కళాకారులు, రచయితల మాటలు, పాటల తూటాలై సాంస్కృతిక యుద్ధ నౌకలుగా మారాయి. ఈ పాటలు ఆవేశపు జలపాతాల హెూరు సాంస్కృతిక నదులుగా మారడానికి ధూంధాం ప్రక్రియ ఒక ఆక్సిజన్‌గా మారి తెలంగాణ సంస్కృతికి ఆంకాంక్షకు ఊపిరి పోసింది. ధూం ధాం తెలంగాణ నేలంతా పరచబడి వుంది, ధూం ధాం అన్న పదం ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ నోట ఉచ్చరించ బడింది. అది ఒక గుంపు కావచ్చు, అది ఒక వాడకావచ్చు, అది ఒక ఊరు కావచ్చు, అడవి ముఖద్వారం బయ్యారం కావచ్చు, అది సింగరేణి బొగ్గు కావచ్చు, రామగుండం వెలుగు కావచ్చు, ఉస్మానియా యూనివర్సిటీ మైదానం కావచ్చు, పల్లె కావచ్చు, పట్నం కావచ్చు మొత్తంగా తెలంగాణ ధూం ధాం ... తెలంగాణ పేరు లేకుండా సభలు జరగలేదంటే ఆశ్చర్యం ఏమీకాదు, అతిశయోక్తి అంతకన్నా కాదు, నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ఒక ఉద్యమ వేదికగా మారింది. ఆ ధూం ధాం దమ్ములోంచి ఎగిసిన పాటలు రాజకీయ పార్టీలను కదిలించగలిగాయి. ఈ ధూం ధాం ఆధిపత్య రాజ్యం కంట్లో నలుసుగా మారింది. తెలంగాణ ప్రజల తల మానికంలో నాలుగగా మారింది. ఒక్కరా, ఇద్దరా ప్రతి ఊరిలో ఏదో - ఒక గడప నుంచి ధూం ధాం ధ్వనిస్తూనే ఉంటుంది.

వందల యేళ్ళ నుండి ఈ ప్రాంతంలోని అణగారిన కులాలలోని అనేక ఉప కులాలకు (ఉదా : బాల సంతోళ్ళు, బుడిగజంగాలు మందహెచ్చులోళ్ళు, ఒగ్గువారు) చెందిన జానపదకళారూపాలు ఇప్పటిదాకా కాపాడుతూ వచ్చిన తెలంగాణ ఉద్యమ అవసరాలకు తగినట్లుగా మలచుకొని ప్రజల వద్దకు ఆట-పాట ద్వారా తీసికెళ్ళారు.“ఈ కళాకారుల ధూం ధాం వంటి ప్రదర్శనలు, పాటలు ఈ తరం తెలంగాణ యువకులకు, విద్యార్థు లకు వెనుకటి తెలంగాణ పల్లెలు, జనజీవనం, కట్టుబాట్లు, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఏ విధంగా ఉండేవో తెలిపాయి. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమంలో భాగంగా రసమయి బాలకిషన్, అంతడు పుల నాగరాజుల ఆధ్వర్యంలో తెలంగాణ ధూం ధాం 2002లో ప్రారంభమైంది.

తెలంగాణ రాష్ట్ర సమితి సాంస్కృతిక విభాగం బాధ్యత లను పర్యవేక్షిస్తున్న జానపద గాయకుడు, ప్రజా కళాకారుడు రసమయి బాలకిషన్ 2001లో ఒకరోజు అంతడుపుల నాగరాజు ఆహ్వానంపై శ్రీరాంపూర్లో ఆయన నిర్వహిస్తున్న ‘జానపద జాతర’ సాంస్కృతిక ప్రదర్శనను చూసారు. బొడ్రాయి, బతుకమ్మ, పేరీలు, హరిదాసులు, పాములోళ్ళు మొదలైన తెలంగాణ కళారూపాలన్నీ ఒకటెనుక ఒకటి వేదిక మీదికి వచ్చి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతాయి. పల్లెకు దూరమైన పట్టణజనానికి పల్లె జీవితాన్ని కళ్ళెదుట నిలిపి, ఈ ప్రాంత సంస్కృతిపై ఒక అవగాహనను కల్పించే విధంగా ఈ కళారూపాలను అంతడుపుల నాగరాజు రూపొందించి, ఇతర కళాకారులతో కలిసి స్వయంగా అనేక ప్రదర్శన లిచ్చారు. మందమర్రి (ఆదిలాబాద్)లో మొదలై తెలం గాణ వ్యాప్తంగా అనేక ప్రదర్శనలిచ్చారు ఈ కళాకారులు.

రసమయి బాలకిషన్ దృష్టిని ‘జానపద జాతర’

ఆకర్షించడంతో తన ''నేలమ్మ'' పాటల క్యాసెట్ ఆవిష్కరణ సభ (రవీంద్రభారతిలో జరిగిన)కు అంతడు పుల నాగరాజు బృందాన్ని ఆహ్వానించి 'జానపద జాతర' ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్యం అతిథిగా టిఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ను ఆహ్వా నించడంతో 'జానపద జాతర' ఆయన దృష్టిలో పడింది. ఆ తర్వాత ఒకరోజు కేసీఆర్ రసమయిని, నాగరాజును పిలిచి తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం ఉపయోగపడ గల కళారూపాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ ముగ్గురి ఆలోచనల పర్యావసానంగా 'తెలంగాణ ధూం ధాం' రూపుదిద్దుకున్నది. అంతడుపుల నాగరాజు రూపొందించిన 'జానపద జాతర'లో అంతా సహజమైన జానపదమే ఉండేది. అయితే రసమయి బాలకిషన్ దాన్ని వివిధ ఉద్యమ పాటలతో, పాటగాళ్ళతో, కవులతో మిళితం చేసి జానపద జాతరను ఉద్యమ అవసరాలకు తగినట్లు అద్భుతమైన కార్యక్రమంగా రూపొందించి తెలంగాణ వ్యాప్తంగా అనేక ప్రదర్శనలు నిర్వహించారు. రసమయి బాలకిషన్ వ్యాఖ్యానం, పాటలతో నాగరాజు బృందం, ఇతర కళాకారుల ఆటలతో తెలంగాణలో లక్షలాది ప్రజలను 'ధూం ధాం' ఎంతో ఉత్తేజితులను చేసింది.

పారిశ్రామిక ప్రాంతమైన సింగరేణి గని కార్మికుల పిల్లలైన మంచిర్యాల, మందమర్రి, శ్రీరాంపూర్‌లకు చెందిన అంతడువుల నాగరాజు, తన స్నేహితులతో కలిసి జానపద నృత్య కార్యక్రమాలు చేస్తుండేవాళ్ళు.

జానపద నృత్యాగీతాలతో కూడిన ఈ స్వరమాధురి కళానిలయం బృంద కళాకారులు, జాతీయ యువజన వారోత్సవాల్లో ప్రదర్శన కోసం, పల్లె సంస్కృతిని సాంప్రదాయాల్ని ప్రతిబింబించే విధంగా పండుగలు, వాటి ప్రశాస్తిని చూపెట్టే నృత్యరూపాల్ని కరీంనగర్‌కు చెందిన నంచార్ల గోపి, నిస్సార్, గోరేటి వెంకన్న సుద్దాల అశోక్ తేజా మరియు పల్లె సేకరణలలో కూడిన కొనిన గీతాల్ని కలగలిపి ఒక బృంద నృత్యారూపకాన్ని తయారు చేసి.. దానికే ''జానపద-జాతర'' అనే పేరు నిర్ణయించి, పలు ప్రదర్శనలు చేస్తున్నారు.

ఒక దశలో మానసిక వికలాంగుల సహాయ నిధికోసం ఏర్పాటుచేసిన ''జానపద జాతర'' అనే కార్యక్రమాలలో అలాగే, వరంగల్‌కు చెందిన గాయకులు డికొండ సారంగపాణి స్మారకార్థం మందమర్రిలో ఏర్పాటు చేసిన ''మువ్వలసవ్వడి'' అనే కార్యక్రమానికి(19.10.03) తెలంగాణలో ఉన్న గూడ అంజయ్య, వరంగల్ శంకర్ అందేశ్రీ మొదలుకోని 20 మంది జానపద ప్రజాకవి గాయకులు హజరై అలరించారు. అట్టికార్యక్రమాన్ని అందరితో పాటు విచ్చేసిన పరుపుల(రసమయి) బాల కిషన్, తన స్వీయ నిర్మాణంలో రూపొందించిన ''సుద్దాల అశోక్‌తేజా'' ఆణిముత్యాలు. అనే ఆడియో ఆవిష్కరణను హైదరాబాద్ రవీంద్రభారతిలో తేది.08.07.2002లో విడుదల చేసే కార్యక్రమానికి నాగరాజు బృందాన్ని ఆహ్వానించి నృత్య ప్రదర్శన గావించారు.

జానపద గీతాల్లో శ్రామికులు గానం చేసుకునే, శ్రామికుల శ్రమల పై రాసే గీతాలను శ్రామిక గీతాలుగా వర్గీకరించవచ్చు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో శ్రమ దోపిడి, ఆంధ్ర పాలకుల ఉపేక్ష భావనలపై గీతాలు కనిపిస్తాయి. శ్రామిక కర్షక తెలంగాణములో శ్రమైక సౌందర్యాన్ని తెలియచేన్తూనే వారి బ్రతుకులు కళాకాంతులు లేక ఏలా మోడుపోయాయో చెప్పే గీతాలను చూడవచ్చు.

నాగేటి సాల్లల్ల నా తెలంగాణ
కళలకే పుట్టుక నా తెలంగాణ నా తెలంగాణ
పాట గాచిన పట్టు నా తెలంగాణ నా తెలంగాణ
తాడు పేనిన బతుకు తండ్లాట చూడు
మంటలేని కొలిమి బతుకుల్ల మంట
గోరుకొయ్యల పొద్దు నా తెలంగాణ నా తెలంగాణ
గోరింకలా సభలు నా తెలంగాణ నా తెలంగాణ

*-నందిని సిధారెడ్డి*

దానికి ఉదాహరణగా ''నాగేటి సాల్లల్ల''లో నందిని సిద్ధారెడ్డి వ్యక్త పరిచిన భావాలను మనం గ్రహించవచ్చు. 'తాడు పేనిన బతుకు తండ్లాట', 'మంటలేని కొలిమి బతకుల మంట' వంటి ప్రయోగాలు వలసపాలనలో శ్రామికుని పరిస్థితిని తెలియచేస్తున్నాయి.

పల్లె కన్నీరు పెడుతుందో
పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల
నా తల్లి బందీయై పోతుందో కనిపించని కుట్రల...
కుమ్మరి వాములు తుమ్మలు మొలిసెను
కమ్మరి కొలిమిల దుమ్ము బేరెను - గోరటి వెంకన్న,

గోరటి వెంకన్న ''పల్లె కన్నీరు పెడుతుందో''.. పాట గీతంలో కూలిపోయిన చేతివృత్తుల చిట్టా అంతా వుంది. సామ్రాజ్యవాద విషం'' గ్రామస్వరాజ్యాన్ని ఏలా నష్ట పరుస్తున్నయో చెప్పాడు కవి. చేతిలో పని లేని పల్లె వలసపోవలసిన పరిస్థితులను కళ్ళకు గట్టిండు కవి.

ఓ యం.ఏ. జేసే సమ్మన్న
ఓ యం.ఏ. జేసే సమ్మన్న ఓ యం. ఎస్సీ జేసె సదన్నా
మన బతుకులు బాజర్ల వడ్డయే బి.ఇడి జేసే బాలన్న
మన తెలంగాణ ఆగమాయేరో నౌకరి రాని ఎంకన్నా
- దరువు ఎల్లన్న

దరవు ఎల్లన్న వలస పోతున్న గ్రామ ప్రజలను, తిప్పలు పడుతున్న తల్లిదండ్రులు, అక్క చెల్లళ్ళ వైనం 'ఓయం. ఏ జేసే సమన్న' గీతంలో వ్యక్తపరిచాడు.

ఓ తెలంగాణ పత్తి రైతా !
పచ్చపచ్చని పత్తి చేను మచ్చుకైనా కానరాదు
ఆశలన్నీ మంటగలిసె ఆగమయ్యే రైతు బతుకు
పురుగు మందె పరమాన్నమయిందా
- వి.ప్రకాశ్

వరవరరావు 'రేలారే రేలారె...' గీతంలో సింగరేణి గనుల చిందిన చెమట ఉద్యమమై పెల్లుబికి తెలంగాణ కలను సాకారం చెయ్యాలని ఆకాంక్షించాడు. పత్తి రైతు జీవితం చిత్రిస్తూ కవి వి.ప్రకాశ్ '' ఓ తెలంగాణ పత్తి రైతా '' అనే గీతంలో సర్కారు చేసిన దోఖాను వివరించే ప్రయత్నం చేశాడు.

నా తల్లి తెలంగాణ
పెమట ఒడ్సె శ్రమ జీవులున్నరు అన్ని ఉన్న మన తెలంగాణలో
కంపినీలు ఎన్ని మాయన్నల్లారా పొద్దుగల్లెనె దర్శనమైతది
దిన పత్రిక మన ఇంటి ముంగట పత్రికలల్లో ఎవ్వరు రాస్తరో
- గద్దర్

కడకు పురుగుమందే మరమాన్నమైన విషయం, సోయి లేని సర్కారు తీరును ఎండగట్టాడు. ''నా తల్లి తెలంగాణ గీతంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ 'సెమట ఒడ్సె' శ్రమ జీవులునన్నా కంపెనీలు చేసే మాయ వివరించాడు.

## పల్లె గేయాలు :

భారత దేశానికి పల్లె సీమలే పట్టు కొమ్మలని అంటారు. గ్రామస్వరాజ్యం గాంధీజీ కన్నకల. అటువంటి పల్లెలు దగాపడ్డాయి. సర్కారు పట్టణాన్ని పట్టించుకున్న రీతిలో పల్లెను పల్లెను పట్టించుకోలేదు. తెలంగాణ ఉ ద్యమం నేపథ్యంలో పల్లె జీవితాన్ని, పల్లె వర్తమానంలో దగాపడ్డ వైనాన్ని చాలా గీతాల్లో చిత్రించారు కవులు.

రేలా దూల తాలెల్లాడె నేల
రేలా దూల తాలెల్లాడె నేలో నా తెలంగాణ
సుడిగాలికి సెదిరిన పక్షులు గూడోలాయె నా తెలంగాణ
కొట్టమెక్కి కోడిపుంజు కొక్కొరొకో అని కూతలు పెడ్తాది
కొమ్మలసివర కూసొని కోయిల కమ్మటి గాలిన్పిస్తుంటది
- గోరెటి వెంకటన్న

గోరేటి వెంకన్న ''రేలా దూల తాలెల్లాడ నేల'' గీతంలో పల్లె పకృతిని, పల్లె స్వభావాన్ని, పల్లె పల్లె సంస్కృతిని,

వల్లె వినోదాన్ని వర్ణిన్నూ, వర్తమానంలో అవి ఆవిరయ్యిపోయిన విషయాన్న గుర్తు చేసుకుంటాడు.

పల్లె కన్నీరు పెడుతుందో
పాత రేకు వలె మోతలు మ్రోగేటి ప్లాస్టిక్ డప్పులు
నా మ్యాతరి డప్పును పాతరేసె గదరా నా పల్లెల్లోనా
కుంకుమ దాసిన బుక్క మీద కూడ
కంపెనీ రక్కసి కన్ను పడ్డది

- గోరెటి వెంకటన్న

గోరటి వెంకన్న పల్లె కన్నీరు పెడుతుందో'' గీతం చాలా సుప్రసిద్ధ గీతం. సహస్ర వ్యక్తుల శ్రమైన సౌందర్యం తెలిపే గీతం. వృత్తులు కూలిపోయి ఉపాధి పోయిన వారికీ ప్రత్యామ్నాయం లేదు. బహుళ జాతి కంపెనీల మాయల్లో పల్లెలు నలసి పోయాయని సిద్ధాతీకరించాడు వెంకన్న.

పండు వెన్నెల
వాక్కనికే ఇచ్చిరి ఉయ్యాలో
వొక్కడే మాయన్న ఉయ్యాలో
వొచ్చన్న పోడాయే ఉయ్యాలో
సక్కని మాయన్న ఉయ్యాలో

- నిస్సార్

నిస్సార్ రాసిన “పండు వెన్నెల' గీతంలో పండు వెన్నల్లో ఆడి, పాడే ఆటలు ఏమయిపోయాయి, పల్లెటూరి వీధి బాగోతాలు ఏమయ్యాయి. స్టేజి, మైకు, కరెంటు వంటి ఆధునిక హంగులు లేకున్నా తెల్లవారే వరకు సాగిన వీధినాటకాలు పోయాయి. గ్రామీణులు ఆడే ఆటలు కనుమరుగై పోయాడు. పల్లె సంపదను టీవీలు, సినిమాలు మింగేసినాయని వాపోతాడు.

తెనుగోల్లా ఎల్లమ్మా ఏదీ...
ముంతా మామిడి పండ్ల ముచ్చట్లు లేనే లేవు
సిలకమ్మా కలికీ పండ్లా పలుకూలా జాడాలేవీ
కంట జూద్దామన్న జుంటి తేనే లేదు

- అందెశ్రీ

అందె శ్రీ, “తెనుగోల్లా ఎల్లమ్మా ఏదీ..'' గీతంలో పల్లెల చిరు తిండుల విషయం ప్రస్తావిస్తూ కాని కాలల నడుము కరువు రాకాసి దాడి చేస్తే పట్టణాలకు వలస పోయిన పల్లె బోసిపోయి, గోస వెల్ల బోస్తు వుంది అని వర్ణిస్తాడు.

## సాంస్కృతి గేయాలు :

ఏ ఉద్యమమైనా నిలదొక్కు కోవాలంటే దానికి ఆత్మాభిమానమనే పునాది కావాలి. ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం ఉద్యుక్తమైన తెలంగాణ తన సంస్క ృతి వలన పాలకుల నంన్కృతి కన్నా నుక్ష్మదృష్టితో పరిశీలించినపుడు ఏలా వేరుగా వున్నదో తెలిపే ప్రయత్నం చేసింది. ఆత్మగౌరవంకై తన ఇతిహాసపు సాంస్క ృతిక వైభవాన్ని నెమరేసుకుంది.

జయ జయహే తెలంగాణ...
కాళీదాస కావ్యాలకు భాష్యాలను రాసినట్టి
'మల్లినాథసూరి' మా మెతుకు సీమ కన్నబిడ్డ
ధూళికట్టనేలినట్టి బౌద్ధానికి బంధువతడు
'ధిజ్ఞాగుని' గన్న నేల ధిక్కారమే జన్మహక్కు

- అందెశ్రీ

రాష్ట్రగీతంగా బహుళ ప్రచారాన్ని పొందిన అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'' గీతంలో కవులను, కావ్యాలను, కాకతీయలను, సబ్బండవర్గాల సాహసాలను, స్థానిక సంగీత పరిక రాలను, సహజవనరులను, యద పొంగి పాడేలా నినదించింది.

పొద్దుగాల్లనే
పొద్దుగాల్లనే నిద్దుర లేపే బాలసంతుల శంఖం చూడు
తాంబుర్ర బుర్రల తందాన తాననే బల్బారి కొండయ్య బుర్రకథను
దే అల్లాకే నామ్ అంటూ ఫఖీర్ సాహెబ్ దీవెన దేఖో
వంగీ వంగీ దండం బెట్టే గంగిరెద్దులా రంగులు సూడు

- గద్దర్

'నిప్పులవాగు'' పుస్తక సంకలనంలోని గద్దర్‌పాట “ అమ్మా తెలంగాణమా'' బాల సంతుల శంఖం, బుర్ర కథలు, పఖీర్ సావెబ్ దీవెన్, గంగిరెద్దుల విన్యాసం, గొల్ల

కుర్మల ఒగ్గుకథలు, బయిండ్లోళ్ళ ఎల్లమ్మ కథలు, చిరుతల భజన, తీన్మార్ గురించి ప్రస్తావిస్తూ వివిధ నదులు తెలంగాణ నైసర్గిక సౌందర్యాన్ని ఎలా పెంచాయో చెపుతాడు.

రేలా దూల తాలెల్లాడె నేల
సారంగధరు సెంచులక్ష్మి వాలీ, అల్లీరాణి ఆటలకు
రాత్రిపూట రచ్చబండ యక్షగానం వేదికయితే
భుజకిరీటాలు దగ దగ మెరియగ గజవదనుని తెర కదిలి ఆడగ
తాళం మద్దెల నాదం మోతకు కాళ్ళు గాలిలో తేలాడుతవి

- గోరెటివెంకటన్న

'రేలా దూల తాలెల్లాడెనేల'' గీతంలో గోరటి వెంకన్న ప్రతి చరణంలో తెలంగాణ పల్లె సంస్కృతిని నిశదంగా వర్ణిస్తాడు . వర్తమానంలో ఆ పండుగ పబ్బం సందడి పోయి, పదిమంది కూచుండె భాగ్యమైపోయిందని చివరి రెండు పాటల్లో చెప్పి సాంసృతిక వైభవం యాదికి తెచ్చే ప్రయత్నం చేసాడు.

తల్లి తెలంగాణమా
మట్టి మనిషి ఆ వట్టికోట లెతుకు
పద్యకావ్య కల్పం వానమాములయె శిల్పం
శాసనాల దారం జగమెరిగిన గడియారం
కాళోజీ దాశరథులు ఈ ధరణి కావ్యఋషులు

- సి.కాశీం,

వెంకన్న ''తల్లి తెలంగాణమా అనే మరో గీతంలో తెలంగాణ సహజ వనరులు. వైతాళికులు, త్యాగధనుల ప్రస్తావన చేస్తు ముఖ్యంగా మూడవ చరణంలో తెలంగాణ సాహిత్య సంస్కృతి మార్గదర్శకులను స్మరిస్తాడు.

పండు వెన్నెల
నన్నారే.. నన్నారే.. నన్నారె.. నన్నారె
నన్నారే నన్నారె నారే...
నారె నన్న నార.. నారె నన్నారే నానా నారే...

- నిస్సార్

నిస్సార్ రాసిన 'పండు వెన్నల' గీతం సైతం తెలంగాణ సాంస్కృతిక చైతన్యాన్ని, గత వైభవాన్ని వర్ణిస్తుంది.

### ఉద్యమ గేయాలు :

ప్రత్యక్షంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొనమనే ప్రబోధం, ఉద్యమ లక్షణాలు వర్ణన, ఉద్యమ వైశిష్ట్యాన్ని తెలియజేసే గేయాలను స్థూలంగా ఉద్యమ గేయాలుగా మనం వర్గీకరించవచ్చు.

కోటి, వి.కె.ఎం రాసిన ''త్యాగాల వనమా.. తెలంగాణమా'' మా భూములు, నీళ్ళు, కొలువులు మరియు పాలన మాకంటు పోరుకు దండెత్తారు అని ఉద్యమకాల నేపథ్యాన్ని వర్ణించాడు.

'తెలంగాణ మర్చి సాంగ్ ' రాసిన సురా ఢిల్లి ఖిల్లలో బిల్లు పెట్టాలని సబ్బంబవర్గాలు పరేడ్‌చేద్దాం ఇంటికో మనిషి చేతిలో జెండా, అరె రానున్న రోజుల్లో ఏలు కుందాం, ఆంధ్రా పార్టీలకు కొక నమస్కారం పెడదాం అని నినదించాడు. పెద్దింటి మల్లేశ్ తెలంగాణ ఇస్తానని ప్రకటన చేసి కోస్తాంధ్ర వత్తిళ్ళకు లొంగి తగిన సమయంలో తగిన సమయంలో ప్రకటిస్తామని మాట మార్చిన నేపథ్యాన్ని ప్రధానంగా తీసుకొని, ఐక్యతతో తెలంగాణ సాధనకై పోరుచేద్దాం అని ప్రబోధిస్తూ రాసిన గీతం ''ఇగో- ఇగో- అనుడేంది. నా తెలంగాణ తల్లి తిరగబడ్డ వీణరా అని అంటూ ప్రపంచీకరణ పాలనలో తెలంగాణను తాకట్టు పెట్టినారు, అందుకే ప్రజలంతా ముందుకు కదిలిస్తున్నం ఉద్యమాన్ని బలోపేతం చేస్తున్నాం అని కవులు గాయకులు పాత్ర నేపథ్యాన్ని విరించాడు.

ఎస్వీ సత్యనారాయణ ''సమరగీతం '' గేయంలో ఉస్మానియా క్యాంపస్సులో అగ్గి రగిలింది. కాకతీయ క్యాంపస్ కథనభేరి మ్రోగింది, తుది సమరంలో విద్యాసంస్థలన్నీ పాల్గొంటున్న వైనాన్ని వివరిస్తూ, జన్మ హక్కుగా తెలంగాణ సాధిద్దాం అని ప్రబోధాన్ని చేస్తారు.

''అన్నలారా'' అనే గేయంలో సుద్దాల అశోక్‌తేజ

తెలంగాణ సహజ వైభవం, నేటి దోపిడి వైనం చెపుతారా ఊడ్పుడు, మోసుడు మాత్రమే మన సొత్తు అయ్యిందని, నిరసిస్తూ తెలంగాణ పులిబిడ్డల్లారా, దగాపడిన నవ యువకుల్లారా ఆంధ్రపాలకుల భాగోతం అంతం కావాలంటే ఉద్యమించాలని ప్రబోధించాడు.

తెలంగాణ ఉద్యమ గీతాల్లో సీహెచ్.కాశీం రాసిన గీతం 'నా తెలంగాణలో చదువులు' ఒక ప్రత్యేక పంథాలో సాగింది. మాతృభాష మాధ్యమంలో బోధన జరిగితే విద్యావగాహన, వికాసం అధికంగా వుంటాయనది విద్యా మనో వైజ్ఞానిక శాస్త్రం తెలిసిన నిపుణులు అంచనా ! నిజాం కాలంలో ఉర్దూ, పెట్టుబడిదారీ ఆంధ్ర పాలనలో ఆంగ్లం రాజ్యము ఏలి బడుగుల బలహీనులకు నిఖార్సయిన విద్యను అందించడం విఫలమయ్యాయని, పది జిల్లాల విద్యార్థులు దగాపడ్డారని, ఆంగ్ల మాధ్యమ విద్యలో ముందున్న ఆంధ్రప్రాంత విద్యార్థులకు తెలంగాణలో అప్పనంగా లక్షల ఉద్యోగాలు ఆంధ్ర పాలకులు దోచిపెట్టారని, పెద్ద మనుషుల ఒప్పందానికే నీళ్ళు వదిలారని ఆవేదన చెందారు కవి. సచివాలయంలో దామాషా పద్ధతిలో రావలసిన నౌకరీలు రాకపోగా, హైదరాబాదు ఆఫీసులోనే ఆంధ్ర ఉద్యోగాలతో నింపివేసారని అనేక కీలక ప్రాంతాల్లో ఆంధ్రులు స్థిరపడిపోయి, హైదరాబాదు, ఆంధ్రాబాదుగా మార్చివేసారని వాపోతారు.

తెలంగాణ చదువులో వెనుకబడిందని పటిష్టంగా సర్కారుబడులను స్థాపించి అభివృద్ధి తెస్తామని ఆంధ్ర ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి ముఖాముఖీలో చెప్పిన మాట, వట్టి 'మస్కా' కొట్టుడేనని తేటతెల్లం చేసారు కవి. ఉన్న బడులను 'రేషలనైషన్' అంటూ ఊడ బెరికారని ఎండగడతాడు కవి. ఆంధ్రభాష అసలైన భాషయని, తెలంగాణ యాసని అవమాన పరిచే విధానం వివక్షలను బట్టయలు చేస్తూ, అణచివేతతో ఆగమయిన తెలంగాణ సోదర సోదరీమణులు అంతా ఏకమై ఆంధ్రపాలకులను తరముదాం, ఈ పోలిమేర నుండి అని ప్రబోధిస్తూ ముగిస్తారు. మనం చెప్పుకున్న వివిధ విషయ వర్గీకరణలో ఈ గీతాన్ని ఉటంకించవచ్చు. కానీ ప్రత్యేకంగా విద్యా విషయంగా పెట్టుబడీదారి కుట్రలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్య ఎలా దోచబడింది, తెలంగాణ ప్రాంతం ఎలా నష్టపోయింది చెప్పే ప్రయత్నం ఒక ఆచార్యునిగా కాశీం చేసినది ఈ గీతం. ఉద్యమం రగిల్చే స్ఫూర్తిదాయ గీతం.

**ఆధార గ్రంథాలు :**

1. నిప్పులవాగు, తెలంగాణ ఉద్యమ పాట, (సం). అందెశ్రీ, వాక్కులమ్మ ప్రచురణ, 2023
2. జాగో జాగావో (తెలంగాణ ఉద్యమ కవిత్వం సంపా) స్కై బాబా
3. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర, శోభ గాంధీ. హైదరాబాద్ 2010
4. నారాయణ సుంకిరెడ్డి, దాలి, తెలంగాణ సాంస్కృతిక వేదిక ప్రచురణ, 2001.
5. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర, శోభ గాంధీ. హైదరాబాద్ 2010

❖❖❖

# తెలంగాణ సాహిత్యంలో జాతశ్రీ జీవితము రచనలు

- కె. నాగేశ్వరి, పరిశోధక విద్యార్థిని

ఏ కవి రచనలోనైనా ఆ కవి సమకాలీన సమాజం ప్రతిబింబించడం అనివార్యం. సమాజం అంటే సంస్కృతితో, జీవనరీతితో తొణికిసలాడే నిండైన ప్రవాహం. 'హితేనం సహితం సాహిత్యం' కాబట్టి సాహిత్యం సరళంగా ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉండాలి. అలా అర్థవంత మైన భావాన్ని ఆవిష్కరింప చేసేది ఉదాత్తమైన కవిత్వం, రచనలు సమాజ వికాసానికి మరియు మనుషుల్లో మార్పు తీసుకురావడానికి ప్రయత్నం చేయాలి. బతుకు చూచిన కవి అక్షరానికి ఒక స్పష్టమైన గమ్యం ఉంటుంది. ఆ అక్షరం అసమానతలపై ఉక్కుపాదం మోపి సమాజంలో ఒక వెలుగు రేఖల్ని ప్రసరింప చేయాలి. దీనికి అక్షర రూపమే జాతశ్రీ గ్రామీణ వృత్తి జీవన కథలు. వీటిని వివరించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

సాహిత్యమనగా సహృదయమునకు హితవు గొల్పునది. సమాజానికి మేలు చేకూర్చేది సాహిత్యం అవుతుంది. సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం ఉంది. సమాజంలోంచి సాహిత్యం ఉద్భవిస్తుంది. సాహత్యం సమాజం కోసమే సాహిత్య రచనని అంచనా వెయ్యటానికి ఆనాటి సామాజిక స్థితిగతులు ఉపయోగపడుతాయి. అ విధంగా చూసినట్లయితే సామాజిక స్థితిగతులు తెలుసుకోవడానికి సాహిత్యం ఎంతో ఉపయోగపడుతుంది. లిఖిత సాహిత్య చరిత్రను యుగాలుగా విభజించారు. 1875 నుంచి ఆధునిక యుగం ప్రారంభమైంది. ఆనాటి నుండి వెలువడిన సాహిత్యాన్ని ఆధునిక సాహిత్యం అంటున్నాం. ఆధునిక సాహిత్యాన్ని నవ్య సాహిత్యం, అభినవ సాహిత్యం అని కూడా అంటారు. కవి మనసులో ఎప్పుడో ఒకప్పుడు సంఘర్షణలకు గురి అవుతాడు. అట్టి సందర్భాలలో తిరుగుబాటు మనస్తత్వంతో ఉండటం జరుగుతుంది. కొందరు తమకు తము కొత్త పోడకలు పోతూ వాటికి మెరుగులు దిద్దుకుంటూ రోమాంటిక్ కవులుగా స్థిరపడతారు. అయితే ప్రతిభావంతుడైన కవి ఆ భాణీ నుండి నెమ్మదిగా బయటపడి క్లాసికల్ కవిగా రూపొందవచ్చు. మరికొందరు సంప్రదాయకవిగా ప్రారంభమై అంతటితోనే ఆగిపోతారు. ఒకసారి పరిశీలించి చూసినట్లయితే ప్రతి కవిలోను రెండు అంశాలు గోచరించవచ్చు. అయితే దేని ప్రభావం ఎక్కువగా ఉంటే ఆ కవిగా పలువబడుతాడు. జాతశ్రీ జీవితాన్ని రచనలను పరిశీలించినట్లయితే ఆనాటి తెలంగాణ సాంఘిక వ్యవస్థలో ఉన్న స్థితిగతులను సమాజ సమగ్ర స్వరూపాన్ని ఫోటోగ్రఫీ తీసి పాఠకుల ముందు పెట్టారు.

ప్రపంచ సాహిత్యంలో తెలుగు కథాసాహిత్యానికి ఒక విశిష్టమైన స్థానముంది. తెలుగు సాహిత్య ప్రారంభమైనప్పటి నుండి అధ్యయన సౌలభ్యం కోసం సాహిత్య చరిత్రకారులు ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం అని రెండు విభాగాలుగా వింగడించారు. అందులోనూ ఆధునిక సాహిత్యాన్ని ప్రక్రియల పరంగా కవిత్వ, నవల, కథా తదితర సాహిత్యాలుగా విభజించారు. అయితే కథాసాహిత్యం ఆధునిక సాహిత్య ప్రక్రియ అయినప్పటికీ దీని దాఖలాలు ప్రాచీనకాలం నుండి మనకు కనిపిస్తున్నాయి. కథాసాహిత్యానికి కొన్ని లక్షణాలు ఉండాలనే నియమంతో ఆ నియమాలను అన్ని నింపుకున్నదే కథా సాహిత్యం అవుతుందని సాహిత్య చరిత్రకారులు నిర్ధారించారు. అలా నిర్ధారణలో తెలిన మొదటి కథలుగా బండారు అచ్చమాంబ, కథను గురజాడ దిద్దుబాటు కథను తొలి తెలుగుకథలుగా చెప్పవచ్చు. తర్వాత సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్క ృతి, భావ, అభ్యుదయ, విప్లవ, దిగంబర, దళిత, స్త్రీవాద, మైనార్టీ, ప్రాంతీయ అంశాలకు సంబంధించి ఎన్నో కథలు వచ్చాయి. అందులో భాగంగానే కులవృత్తి జీవిత చిత్రణ గురించి చాలా కథలు వచ్చాయి. నేటికి వస్తున్నాయి. వాటిలో చెప్పుకోదగ్గ కథలు జాతశ్రీ కథలు.

జాతశ్రీ కథలకు అంత సహజత్వం , స్వీయత్వం . జాతశ్రీ కథల్లో ప్రతి కథ ఏదో ఒక సామాజికాంశాన్ని ప్రతిబింబించిన, మరెన్నో వైవిధ్యభరిత అంశాలు చోటు చేసుకున్నప్పటికి ప్రధానంగా జాతశ్రీ కథల్లో వృత్తికులాల వారి, జీవనవిధనం, వారి సమస్యలు ఆ కథలు చదివిన పాఠకులకు కళ్ళముందు ప్రత్యక్ష్యమవుతాయి. మానవ జీవితంలో కులం, మతం, జాతి, వర్ణం, ప్రాంతం ఎంత ప్రభావాన్ని చూపుతాయో అంతే ప్రభావాన్ని వారి ఆచార సంప్రదాయాలు, కట్టుబాట్లు కూడా చూపుతాయని జాతశ్రీ కథల్లో స్పష్టంగా అర్థమవుతాయి.

జాతశ్రీ పూర్తి పేరు జంగం అగస్టన్ చార్లెస్. ఇతడు 1943 ఆగస్టు 4 వతేదిన నల్గొండ జిల్లా మఠంపల్లి మండలం, గొళ్ళపల్లి అనే గ్రామంలో శామ్యుల్, నీలమ్మ దంపతులకు మొదటి సంతానంగా జన్మించిన బిడ్డ జాతశ్రీ. శామ్యుల్, నీలమ్మలకు నలుగురు కుమారులు. ఇద్దరు చెల్లెలు. అందరూ ఖమ్మంలో ఉంటారు. వీరిలో ఇద్దరు అన్నదమ్ములు చనిపోయారు. అందరికంటే జాతశ్రీ పెద్ద. జాతశ్రీ నాన్నగారు 1980 లో చనిపోయాడు. అమ్మ 2009 లో చనిపోయింది. జాతశ్రీ భార్య రైలు ప్రమాదంలో చనిపోయింది. జాతశ్రీకి ఇద్దరు కుమారులు. వీరిద్దరూ అమెరికాలో నివాసం ఉంటారు. జాతశ్రీ తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం చేత చిన్నప్పటి నుండి చదువుపై మక్కువ కలిగి ఉండేవాడు. తండ్రి పాఠశాల నుండి రాగానే జాతశ్రీకి చదువు పట్ల అభిమానం కలిగేట్లు కథలు చెప్పటం, పలక మీద వర్ణమాలు రాయించి బట్టి పట్టించటం అతడి పని. తండ్రిని ప్రేరణగా తీసుకోవాలని చిన్నప్పటి నుంచే బలమైన కాంక్ష జాతశ్రీలో నాటుకు పోయింది. 1940 సంవత్సర కాలంలో ప్రభుత్వ పాఠశాలలు.. తక్కువగా ఉండేవి. తండ్రి ఉపాధ్యాయుడు కావటం చేత జాతశ్రీని ప్రాథమిక విద్యాభ్యాసం కొరకు మఠంపల్లిలో ఉన్న వివేకవర్థిని అనే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు. జాతశ్రీ తల్లి కూడా కొడుకు చదువుకొని గొప్పవాడు కావాలని అభిలాషించేది. హైస్కూల్ వరకు చురుకైన విద్యార్థిగా ఉపాధ్యాయులందరి ప్రేమను పొందాడు. మంచి ఫలితాలొచ్చాక తండ్రి శామ్యుల్ తనకు చదువు చెప్పిన ఉపాధ్యాయుల సలహాల మేరకు నల్గొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి మంచి ప్రతిభ కనబర్చాడు. అంతటితో ఆగకుండా డిగ్రీ కూడా అదే కళాశాలలో చేరి విద్యార్థులతో చర్చాగోష్టిలు నిర్వహించేవాడు. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ విషయాలపై స్నేహితులతో మాట్లాడి తనకు తెలిసిన తగుసలహాలు ఇచ్చేవాడు. నల్గొండజిల్లాలో ఫ్లోరోసిస్ బాధితులను చూసి జాతశ్రీ బాధపడేవాడు. వారి కోసం ఏదో రాయాలి, ఏదో చేయాలని స్నేహితులతో ముచ్చటించేవాడు. అదేవిధంగా నల్గొండ జిల్లాలో గౌడ వృత్తిని, కుమ్మరి వృత్తిని నమ్ముకుని జీవించేవారి సంఖ్య ఎక్కువగా ఉండేది. వారి జీవన స్థితిగతుల మీద ఖచ్చితంగా రాయాలని మనసులో అనుకునేవాడు. కులవృత్తుల్ని నమ్ముకుని బతికేవారిపై యజమానులు, పోలీసులు చూపే దౌర్జన్యాన్ని ఎండగట్టాలని ధృడమైన ఆలోచనల్లో ముందుకు సాగేవాడు.

కథారచయితలైన శీలా వీర్రాజు, మజుందార్, గుమ్మ ప్రసన్నకుమార్, శ్రీపతి తదితరులు నా తరం రచయితలు. వీరితో నేను స్నేహం చేశాను. వీరి స్నేహంతోటి నవలలు రాయడం మానేశాను. అప్పటికే మూడు రాశాను. నా నవలకు విశాలాంధ్ర వారు ఉత్తమ నవల బహుమతి ఇచ్చారు. ఉత్తమ బహుమతి ఇచ్చిన సమయంలో ఆంధ్రజ్యోతిలో పనిచేసి సబ్ ఎడిటరైన రామకృష్ణారెడ్డి గారు విమర్శించారు. దానితో కూడా నేను కథలు రాయడం ఎంచుకున్నాను. ఇది కూడా ఒక కారణం. 20 సంవత్సరాల వయస్సు నుండే రాయడం మొదలుపెట్టానని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు.

బుచ్చిబాబు గారి కథలంటే ఎక్కువ ఇష్టం. ఆయన కథలు నన్ను బాగా ప్రేరేపించాయి. ఎందుకంటే ఆయన శిల్పం గానీ, రచనా శైలిగానీ, నాకెక్కువ ఇష్టం. నాపై ఎవరి ప్రభావముందంటే రావిశాస్త్రి, బుచ్చిబాబు,

చలంలది. మొత్తం తెలుగుకథా సాహిత్యంలో నాకు నచ్చిన కథ 'బంగారు మురుగు'. దీన్ని శ్రీరమణగారు రాశారు. ఈ కథ అంటే బాగా ఇష్టం. పాతతరం కథైతే బుచ్చిబాబు రాసిన నిరంతర త్రయం కూడా చాలా ఇష్టమే. అయితే మురుగు కథలో బామ్మ, మనువడికి మధ్యన ఉన్న అనుబంధం ఎట్లా ఉంటదో తెలుస్తుంది. నిరంతరత్రయంలో ప్రేమ కథ గురించి ఉంది. నా కథలపై బుచ్చబాబు ప్రభావంఉందని చెప్పుకున్నారు.

**నవలలు :**

**బలిపశువు :**

తెలంగాణ వలస కార్మికులపై వచ్చిన మొదటి నవల ఇది. ఈ నవలను 1982 లో రచించారు. దొరల చేతుల్లో జీతగాళ్ళు ఎట్లా చాకిరి చేస్తారో వారి కష్టాలను, కడగండ్లను ఈ నవలలో ప్రస్తావించారు. జీతగాడి పెళ్ళాన్ని దొర దగ్గరికి పంపిస్తే బాకీ మాఫీ చేస్తాననే దొరల ఆధిపత్య భావ జాలాన్ని, వారి అహంకార భావాలను ఎలా కార్మికులపై రుద్ది దొరలు పెత్తనం చెలాయిస్తారో జాతశ్రీ ఈ నవలలో పేర్కొన్నారు. జీతగాడి భార్యకి దొర వల్ల కల్గిన సంతానం నక్సలైటుగా మారతాడనేదే ఈ నవల ఇతివృత్తం. ఈ నవలలో జీతగాడి భార్య గత్యంతరం లేక బతుకుదెరువు కోసం బిక్షగత్తెగా ఎలా మారుందనేదే విషయాన్ని రచయిత చెబుతూ, ఈ పాత్ర లాంటి స్త్రీలు, పురుషులు ఈ అమానవీయ సమాజంలో ఎంతో మంది ఉన్నారని చెప్పటమే రచయిత ఉద్దేశ్యం.

**వెదురుపొదలు :**

ఈ నవల గిరిజనుల జీవనవిధానాలను ప్రతిబింబించే నవల. ఇందులో రచయిత గిరిజనుల ఐక్యమత్యాన్ని చెబుతూ, వారి ఐకమత్యానికి వెదురు పొదలను ప్రతీక లుగా తీసుకొని అవి ఎలా అయితే ఒకటిగా విడిపోవో గిరిజనులు కూడా అలా కలిసి మెలిసి ఉండాలని ప్రభోధించాడు. ఈ నవలను తాను ఎల్లందు అనే ప్రాంతంలో పనిచేసినప్పుడు వారి నివాసం అడవి పక్కన గిరిజనులకు దగ్గరగా ఉండటం వలన అవి గమనించిన జాతశ్రీ స్వీయానుభావాలతో ఈ నవల పాత్రోచితంగా సృజించాడు.

**సింగరేణి మండుతోంది :**

గోదావరిఖని పరిసర ప్రాంతాల్లో సింగరేణి బొగ్గుగనిలో అకస్మాత్తుగా మంటలు రావటం అది చూసిన రచయిత ఈ కార్మికుల కష్టాలను ఇతివృత్తంగా తీసుకొని నవల రాశారు. ఈ నవలలో సింగరేణి కార్మికుల యొక్క సాధక బాధలను, వారి యూనియన్ల మోసాలను, సమ్మెల రూపంలో జరిగే రాజకీయ ఎత్తుగడలను, మధ్యలో అటు బడాబాబులకు ఇటూ లీడర్లకు బలవుతున్న సామాన్య కార్మికుల జీవితాల గురించి స్పందించి రాసిన నవలే ఈ సింగరేణి మండుతోంది. వాస్తవానికి ఇక్కడ మండుతుంది కార్మికుల కాలే కడుపులు ఇదే రచయిత చెప్పదలచుకున్న వాస్తవ చిత్రీకరణ దృశ్యాలు.

**కపోతం :**

ఇది మొట్టమొదటి కథాసంపుటి. దీనిలో 11 కథలున్నాయి. 'బీబీ' అనే కథలో విరుద్ధమైన శైలిని ప్రదర్శించాడు. రావిశాస్త్రి,చలం,బుచ్చిబాబు తదితర రచయితలశైలీలను ఈ కథలో ప్రవేశపెట్టాడు

**ప్రభంజనం :**

జాతశ్రీ రాసిన ప్రచురించిన రెండవ కథల సంపుటి ఇది. దీనిలో 10 కథలున్నాయి. నెత్తురుకూడు, స్పృహ, పంచరైనబతుకులు, మైకం, ప్రభంజనం తదితర కథలున్నాయి. ఈ కథల్లో ప్రధానాంగ ప్రజల కష్టాలు, కార్మిక జీవీతలున్నాయి. 'పంచరైన బతుకులు' కథలో పంచర్లేసే మనిషుల కష్టాల్నీ చిత్రీకరించాడు. 'నెత్తురు కూడు' కథలో కోయవారు తిండి కోసం ఎలా తిప్పలు పడమరో ప్రసవించారు. 'ప్రభంజనం' కథలో సింగరేణి కార్మికుల కష్టాలను చెప్పాడు.

**చలివేంద్రం :**

జాతశ్రీ రచించిన బలమైన కథల సంపుటి చలి వేంద్రం. ఇందులో పదిహేను కథలున్నాయి. మొదటి కథ పేరే చలివేంద్రం. వృత్తిని నమ్ముకుని ఎంతగానో

శ్రమించే ఒక కుమ్మరి కులానికి చెందిన ముసలాయనకు ఎదురయ్యే కష్టాల్ని ఈ కథలో చిత్రీకరించాడు. అదేవిధంగా వృత్తిని నమ్ముకున్న వారి జీవితం ఎలా ఛిద్రంమవుతుందో , పోలీసులు అమాయక జనాల్ని ఎలా దౌర్జన్యం చేసి దోచుకుంటున్నారో ఈ కథలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కథా సంపుటి జాతశ్రీకి గొప్ప పేరు తెచ్చిపెట్టింది. 'జిబ్రా' కథలో ఉపాధ్యాయులు పాఠం చెప్పకుండా విద్యార్థుల్ని ఎలా మోసగిస్తారో స్పష్టంగా చెప్పాడు. 'కొలమానం' కథలో ఆడపిల్లని ఎలా లోబర్చుకోవాలని మగవారు ప్రయత్నం చేస్తారో చిత్రీకరించాడు. ప్రస్తుతం జరుగుతున్న లైంగిక దాడుల్ని ముందే ఊహించి రాశాడేమోనని కొలమానం కథ చదివితే అర్థమవుతుంది. 'నిప్పులనీడ' కథలో పేదరికంలో ఒక బిచ్చగాడు ఆకలి కోసం ఎలా అలమటిస్తాడో చూపించాడు. అదేవిధంగా 'రాజాయిజం' కథలో అమ్మనాన్నలేని బాలుడ్ని చదివించి గ్రూప్స్ ఆఫీసర్ చేస్తారు వారి బంధువులు. ఆఫీసరయ్యాక కృతజ్ఞతాభావం లేని వారు ఎలా ఉంటారో ప్రస్తావించాడు.

**కుట్ర :**

ఇది కూడా కథా సంపుటి. 'కుట్ర' కథ సంపుటిలో 11 కథలున్నాయి. వృద్ధుల జీవితాలు ఎలా ఉండాలో 'ఒంటరి' కథలో రాశాడు. 'అమ్మ నీకు దండం'లో వడ్డెర జీవిత కష్టాల్నీ రాశాడు.

**ఆర్తారావం :**

జాతశ్రీ రాసిన 'ఆర్తారావం' అనే కథాసంపుటిలో 11 బలమైన కథలున్నాయి. ఈ పుస్తకానికి పాఠక ఆదరణ చాలానే ఉంది. దీన్ని 2009లో ప్రచురించాడు. 'అగ్నితుఫాను' కథలో బెస్తవారిపై యజమానుల దౌర్జన్యం కనబడుతుంది. గంటల తరబడి నీళ్ళలో చేపలు పడితే శ్రమను ఎలా దోచుకుంటారో ఈ కథలో బలంగా చిత్రీకరించాడు. 'సాబ్ తీక్ నహీహై' లో సెక్యూరిటీ గార్డు వృత్తిని నమ్ముకుని నేపాల్ నుండి ఆంధ్రదేశానికి వచ్చి దొంగల చేతిలో హతమవ్వడం కనిపిస్తుంది. 'విధ్వంసం' కథలో దొమ్మరాటలు, 'చిరునామా'లో నేత పనివాళ్ళ జీవితాన్ని చిత్రీకరించాడు.

**పైరగాలి :**

'పైరగాలి' కథల సంపుటిలో మొత్తం 16 కథలున్నాయి. ఇందులో పేదవారి బాధలు, సాంఘిక సమస్యలు, వృత్తి జీవితచిత్రణ , నిరుద్యోగ సమస్య, గంగిరెద్దు ఆటగాడు తదితర భిన్నమైన అంశాలు కనిపిస్తాయి. జాతశ్రీ రచలన్నింటిని పరిశీలించినట్లయితే నేడు సమాజంలో జరుగుతున్న శ్రమదోపిడి, పెత్తనం, యజమానులు పోలీసుల దౌర్జన్యాలు వృత్తిని నమ్ముకున్న జీవితాలు, పడుపువృత్తి మొదలగు అంశాలు దర్శనమిస్తాయి. ఈయన రాసిన కథలను నా పరిశోధనలో భాగంగా తర్వాతి అధ్యాయాల్లో పరిచయం చేస్తూ విశ్లేషణ కొనసాగుతుంది.

**స్పందిస్తున్న హృదయం :**

రచయిత వ్యక్తిగతమైన జీవితం గురించి, ఆయన చవిచూసిన సంఘటనల గురించి దాదాపు 30 కవితల వరకు రాశాడు. ఈ కవితల్లో రచయిత వ్యక్తిగతంగా స్పందించినవే ఎక్కువగా ఉన్నాయి.

**నాటికలు :**

మరో క్రిస్మస్ రావాలి:క్రైస్తవ మత ప్రజలను దృష్టిలో ఉంచుకుని వారు ఏవిధంగా రాజకీయ నాయకుల అగడడాలకు బలవుతున్నారో తెలియజెప్తూ వారిని చైతన్యపరచే దిశగా ఈ రచన కొనసాగింది.

**ప్రగతి పథంలో పాకుడురాళ్ళు :**

ఆంధ్రజ్యోతి దిన పత్రిక నిర్వహించిన రంగా దీపికల నాటికల పోటీలో ఈ నాటికకు ఉత్తమ బహుమతి లభించింది. ఇది పూర్తిగా తెలంగాణ యాసలో రాయబడింది. రచయిత వచ్చిన జీవిత నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ తరాలకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ చదువే అన్నింటికి మూల కారణం, చదువును జయిస్తే ప్రపంచాన్ని జయించనవారు అవుతారని దళిత, పేద ప్రజల్లో నూతన ఉత్తేజాన్ని నింపే నాటిక ఇది.

**మరో దీపం వెలిగించు :**

దీపం తాను ఆరిపోతూ ఇతరులకు ఎలాగైతే వెలుగును ఇస్తుందో మనుషులు కూడా తను కష్టాల్లో ఉన్నప్పటికీ ఇతరులకు సాయం చేయాలనే గుణాన్ని అలవాటు చేసుకోవాలనే తత్వం ఇందులో ఉంది. ఈ నాటికను రైట్.రెవ.పి.సాల్మాన్ బిషప్ కి అంకితం ఇవ్వటం జరిగింది.

**నాయకులున్నారు జాగ్రత్త :**

ఈ నాటికను అంబేద్కర్ యువజన సంఘం వారు ప్రదర్శించారు. ఇందులో రాజకీయ నాయకుల బారి నుండి ప్రజలను చైతన్యపరచటం రచయిత ప్రధాన ఉద్దేశ్యం.

జాతశ్రీ రచనలు అన్నింటిని పరిశీలించినట్లయితే నేడు సమాజంలో జరుగుతున్న శ్రమదోపిడి, పెత్తనం, యజ మానులు పోలీసుల దౌర్జన్యాలు వృత్తిని నమ్ముకున్న జీవితాలు, పడుపువృత్తి మొదలగు అంశాలు దర్శన మిస్తాయి.పెత్తనం, యజమానులు పోలీసుల దౌర్జన్యాలు వృత్తిని నమ్ముకున్న జీవితాలు, పడుపువృత్తి మొదలగు అంశాలు దర్శనమిస్తాయి. రచయిత ఎంచుకున్న కథావస్తువులన్నీ దాదాపుగా ఒకే అంశానికి చెందినవి అయినప్పటికీ, రచయిత కథను నడిపించిన తీరులో ఉన్న వైవిధ్యాన్ని పరిశీలిస్తే అవి భిన్నమైనవి కనిపిస్తాయి. ఇలాంటి రచన చేయాలంటే అది రచయితకున్నం కథారచన నైపుణ్యం మీద ఆధారపడి ఉంటుంది.

ఈ వ్యాసం అంతా దాదాపు కులవృత్తులు మీద ఆధారపడే ప్రజల జీవన స్థితిగతుల మీద ఆధారపడి సాగింది. ఇందులో ప్రతి పాత్ర విలక్షణమైంది. ప్రతి పాత్రకు న్యాయం చేస్తూ మానవీయ విలువలకు తెలియ జెప్పడంలో రచయిత సఫలీకృతడయ్యాడనే చెప్పాలి. ఈ వ్యాసం కొత్త దృష్టికి నాంది పలికిందని నేను భావిస్తున్నాను. ఇన్నాళ్ళు సామాజిక, ఆర్థిక కోణాలకు పరిమితమైన పరిశోధన ఇప్పుడుమానవీయ విలువలు వైపు పయ నించడం గమనించదగ్గ విషయం.

**ఆధార గ్రంథాలు :**

1. జాతశ్రీ, పైరగాలి, సృజనాలయ ప్రచురణలు, కొత్తగూడెం, ఖమ్మం , ఏప్రిల్ 2012.
2. చలివేంద్రం (కథాసంపుటి) సృజనాలయ ప్రచురణలు, విద్యానగర్, కొత్తగూడెం, ఖమ్మంజిల్లా
3. కుట్ర (కథల సంపుటి) జాతశ్రీ, సాహితీ స్రవంతి ఖమ్మంజిల్లా శాఖ,
4. దక్షిణామూర్తి, పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు, నవోదయ బుక్ హౌస్, హైదరాబాదు, 1988.
5. సుజాతారెడ్డి, ముదిగంటి. 2014. అద్యతన దృష్టి(సాహిత్య విమర్శ వ్యాసాలు), రోహణమ్ ప్రచురణలు. హైదరాబాద్.
6. ప్రాంతీయ చైతన్యం-తెలంగాణ సాహిత్యం-కాత్యాయనీ విద్మహే, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్ ప్ర.ము. 2000
7. తెలుగు మాండలిక కథా సాహిత్యం ఎ.కె. ప్రభాకర్ సాహితీ సర్కిల్, హైదరాబాదు 2002

❖❖❖

# నీలా జంగయ్య కవిత్వంలో వివిధ అంశాలు

- చాముండ్ల రాజు, పరిశోధక విద్యార్థి

ఆధునిక సాహిత్య ప్రక్రియలో కవిత్వం ఒకటి. లలితకళలలో కూడా ప్రధానమైనది కవిత్వం. వ్యక్తి తన అనుభూతులను తాను చూసిన సంఘటనలను ఆధారంగా చేసుకొని తనకు అనువైన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. నేడు ఎన్ని ప్రక్రియలు వెలువడిన అందులో కవిత్వానికి ఎంతో ఆధునికతతో మార్పులు చేస్తుంది. కవిత్వం ఎప్పటికప్పుడు నిత్య నూతనత్వంతో ప్రకాశింపజేస్తుంది. కవిత్వమెంత పురాతనమైనదో అంత అదునాతన మైనది. సాంకేతికముగా వైజ్ఞానికముగా పురోభివృద్ధినందుచున్న యుగంలో ఊహలతో జీవించు కవిత్వము బ్రతకగల్గునాయను సందేహమును కొందరు ప్రకటించిరి. కవిత్వం ప్రధానముగా మానవుని అనుభూతులపై ఆధారపడి ఉన్న కళ. అందుచేత మానవుడున్నంత కాలం కవిత్వమునకు క్షితి లేదు. రచయిత ఈ కవితలో పేద ప్రజలపై జరుగుతున్న అన్యాయాలను వెల్లడిస్తున్నాడు. మానవజాతిని సరైన మార్గంలో నడిపించాలి అంటూ కవి ఎంతో తాపత్రయ పడుతున్నారని అర్థమౌతుంది. ఈ విధంగా రచయిత నీలాజంగయ్య సమాజంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా చూసిన వాస్తవిక సంఘటనలను ఆధారంగా చేసుకుని మానవత్వంతో, సహృదయతతో ప్రతి విషయాన్ని లోతుగా అధ్యయనం చేసి సమాజానికి ఉపయోగపడేలా కవిత్వాన్ని వెలుగులోకి తెచ్చారు. రచయిత మానవీయ విలువలను, సామాజికతను విస్తృతమైన విషయాలను గురించి చర్చించారు. ఈ సమకాలీన సమాజంలో జరిగే సంఘటనలను దృష్టిలో పెట్టుకొని మనిషికి మనిషికి మధ్య స్నేహ భావం, మానవత విలువలు, ప్రస్తుత సమాజంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కవిత్వాలు రాయడం జరిగింది. సమకాలీన సమాజంలో కవి రచయిత ప్రతి విషయాన్ని అధ్యయనం చేసి, విశ్లేషణ చేస్తూ ప్రజలను సరైన నడవడిక వైపు పయనించేటట్లు చేయాలని రచయిత ఉద్దేశ్యం.

నీలా జంగయ్య మానవతను ప్రధాన వస్తువుగా స్వీకరించి అభ్యుదయభావాలతో విరివిగా రచనలు చేశారు. మనిషి అన్ని కోణాలను దర్శించి అతని సంస్కార భావాలను ప్రతిష్టించాలని ఆరాటపడినారు. తాను చేపట్టిన పద్యం, వచన పద్యం, గేయం వంటి ప్రక్రియల్లో రచనలు వెలియించి వాటిలో మనిషి ఆచరించవలసిన అనుసరించ వలసిన ధర్మాలను హృద్యంగా వివరించారు. మనిషికోసం 'ఒకింత మానవతకోసం', 'మనిషినాపద్యం' వంటి శీర్షికలతో ప్రత్యేక కవితా సంపుటాలు ప్రచురించారు. ప్రస్తుతం ముద్రిస్తున్నారు కూడా. నీలా జంగయ్య కవితాత్మకు అధిక ప్రాధాన్యం ఇచ్చె రమణీయ భావకుడు అనటం వల్ల ఆయన చిత్రించిన మానవతా ధోరణులు ఆత్మీయంగా, అద్భుతంగా ఉన్నాయి. మానవత మలిన పడితే ఇక దారి ఏముంటుంది మానవ జాతి వికాసానికి.

మనిషి మాదవుడుగా ఎదిగినప్పుడే మనిషి జీవితంతో పాటు సమాజ జీవితం కూడా సతత హరితంగా కళకళలాడుతుంది. కవిగా మహోన్నత మానవుడుగా జంగయ్య అనుక్షణం మనిషి వెంటే ఉన్నారు. ప్రపంచంలో ఏమూలలో అయినా మనిషి పశువుగా ప్రవర్తిస్తే చాలు కవి విపరీతంగా బాధపడడం కన్పిస్తుంది. ప్రపంచం సిగ్గుపడుతుందని తలదించుకుంటుందని చెప్పారు. నీలా జంగయ్య మానవతా వాద కవిత్వం వైవిధ్యంతో ఉంటుంది. అందకే ప్రతి కవితలో నవ్యత్వం తొణుకుతుంది. నాణ్యత కన్పిస్తుంది.

కవి హృదయం మానవత కోసమే ఉంది. పెల్లుబుకుతున్న ద్వేషాన్ని, వ్యాపిస్తున్న తిమిరాన్ని చూసి కవి మనస్సు ద్రవీభూతమైంది. పెట్రేగిపోతున్న హింసను చూసి కవి హృదయం ఘోషిస్తుంది. మనిషి అహంకారంతో సృష్టించు

కున్న దానవత్వం ఆగిపోతేనే కవి మనస్సు ప్రశాంతతను భజిస్తుంది. సమాజంలో మనుగడ సాగిస్తున్న అనాథల దైన్యం చూచిచలించారు. వాళ్ళ సౌఖ్యవంతమైన జీవితం కోసం ఆరాటపడినారు. జనులంతా సౌఖ్యంగా మానవత్వంగా ఉన్నప్పుడే సమాజం నిండు పున్నమిలా కళకళలాడుతుంది ఇక అమానుషం అనేది ఎక్కడ కూడా ప్రజ్వరిల్లదు. అతడు ఎల్లప్పుడూ కాంతిమూర్తిలా భాసిస్తాడు. అమృతమూర్తిలా అందరినీ తన గుండెల్లో పొదిలి పట్టుకుంటాడు. తన వ్యక్తిత్వాన్ని దుర్భేద్య రక్షణ కవచంలా అమరిస్తాడు. అనంత పోరాటంలో అజేయంగా నిలుస్తాడు. దాన్ని కీర్తికాయంలా భవిష్యత్తును ఉద్దీపిస్తాడు. ఎన్నీ ఉన్నా మానవత్వ మహవనస్పతి లేకపోతే అంతా శూన్యమే. అని మానవత్వాన్ని నిర్వచించారు.

ఈ క్రిందివి జంగయ్య మానవతావాదానికి ప్రతీకలు.

కర్మఫలమునకు పోలిక లేదనుటకు -
తల్లిదండ్రి పోల్కి తనయులుండగ వచ్చు
తెలివి తేటలట్లు కలుగవచ్చు
కర్మఫలమొకండె కనమట్లు కాలాన

కవిని గన్నదెవరు కావ్యాన దాగిన
కవిత రూపుగన్న మనుడెవండు ?

వ్రాస్తే మంచి కవితే వ్రాయాలి. అట్టి మంచి కవన దక్షులైన కవులున్నప్పుడే లోకం భాసిస్తుందనీ కవిత శూన్యమైతే కాలమే చీకటియగుననీ ఘోషించాడు. తనలాగే దేశంలోని అందరి భావాలుండాలన్న ఆశతో భాషలు వేరైన భావాలు ఒకటే అంటాడు. ప్రక్రియలు వేరై ఉండవచ్చు కానీ తను భావించటంలో భేదంఉండదంటూ చెప్పిన ఉపమానం

బంగారు ఒకటి ఆభరణాలు వేరు
కుండలు వేర్వేరుఉండు మన్నొకటే
(జ్ఞానమందిరం, పుట.9)

అని అందంగా చెప్పాడు. ఇదే భావాన్ని ఒక పేజి తిరగ్గానే

భాషలే వేరు : పరమార్థమొకటె

మళ్ళీ అన్నారు. ఇలాంటి పునరుక్తులు పరిహరించి ఉంటె బావుండేది.

తన కలానికి మతాల సంకెళ్ళు లేవన్న భావన ఉదాత్తంగా ఉంది. కలాని కుండాల్సింది మానవత్వం తప్ప మత తత్వం కాదు. అలాంటి కలం ఏంచెయ్యాలని వీరి భావన అంటే కష్టాల తైలం పోసి బ్రతుకును ఆఖండం చేద్దాము (సంస్కార భూషణం) అంటూ ఆశా జీవిగా కనిపిస్తాడు. మన దేశం ఎందుకుఅధోగతి పడుతుందో చెప్పే సందర్భంలో

జాతి సంపద ఏ కొందరి ఖజానాలకు
అది పోరాదు'
జరిగే చరిత్ర చెప్తాడు.
నల్ల ధనం సామాన్యుల
గుల్ల చేయుచున్న దిపుడు
సారస్వత వీధులన్ని
చచ్చుపీస్లులై యున్నవి (సంస్కార భూషణం, పుట.9)

ఈరకంగా లోకం భాధను తన బాధగా వ్యక్తికరిస్తాడు.

సమాజాన్ని అనునిత్యం పరిశీలిస్తూ చైతన్యంతో ప్రగతిశీల భావజాలంతో అక్షరాలను దివ్వెలుగా వెలిగించే కవులెపుడూ కాలం కెరటాలై ప్రజల జీవన తీరాన్ని చేరగల్గుతారు. సమకాలీన సమాజం కవిత్వ దర్పణంలో రూపమై కదలాలి. సమాజ సమగ్ర రూపాన్ని భావితరాలకు దృశ్యమై చూపించే కవిత్వం రావాలి. సమాజం, సాహిత్యం రెండూ ఒక చెట్టుకి పూచే పూవుల్లాంటివి. ఈ మార్గంలో నీలా జంగయ్య కూడ తన కవిత్వ రచనలతో సమాజంలో ఉన్న మూఢ విశ్వాసాలు, రేరాచాలను తన కలంతో ప్రక్షాళన చేశారు.

దేశదేశాలు సహకార లక్ష్యంగా
దరిద్రాన్ని దాస్యాన్ని రూపుమాపే బుద్ధితో
మనిషి మనిషిని ప్రేమించే ప్రభుత్వం - సంఘం
విశ్వదీప్తం కావాలని

శశ్వదానంద సారస్వత కాంతులతో నిండాలని
ఆశించేదెప్పుడో ఈ భూమి
నా జీవితం ధన్యమయ్యేదప్పుడు
(బ్రతుకుబాటలో పాటల మూట, పుట.11)

అని మనసా వాచా కోరుకుంటాడు కవిగాను, వ్యక్తిగాను.

"ఆంధ్య సౌందర్యము"లో నానాటికీ ఉన్నవాడు ఇంకా ధనవంతుడవుతున్నాడనీ, లేనివాడు లేమివాడవుతున్నాడనీ, ఈ అసమానతను గని కవి అంగలార్చారు.

ఉన్న ప్రకృతినిధులు కొన్న వానివియయ్యె
లేని వాని కలిమిలేమియయ్యె
ఓటు పేదదయ్యె సీటు ధనికునిదయ్యె
కలిమి సీటు మెచ్చు మనునిదయ్యె
(దర్శనం, పుట.12)

విషయ వాసనాసక్తి గల ఉన్మత్తులను, మోహాంధ చిత్తులకు జగదాధారు డైన ఆ ఈశ్వరుడు ఎట్లా అగుపిస్తాడని కవి ప్రశ్నిస్తారు "ముకుర ముఖీ!" అనే శీర్షికలో..

జగమున తమ్ముచాము గనజాలని చందల చిత్తులై భ్రమన్
దగిలి నిరంతరాత్మ సుఖ దర్పణమందె వళుండు నౌటనే
మగుపడు సత్యజీవన మహాత్మ్యము రమ్యవసంత భామినీ
దృగమల హాసచంద్రికలు ఈరని మోహషభావ సంపదల్
(దర్శనం, పుట.13)

కాశీనాథుడు దప్ప వి
నాళమె కాంక్షింత్రు మనుజనాథులు భూమిన్

శరణుజొచ్చిన శత్రువునైనా రక్షించే దొడ్డగుణం ఆ ఈశ్వరునికే కలదనీ, కుటిల వర్తనులయిన ఈ రాజులు, నాయుకులు సదా సాటిమనిషి వినాశమే కాంక్షిస్తుంటారనే మానవ నీచ స్వభావాన్ని బహిర్గతం చేశారు.

జీవితం తొలిదశలో రాజకీయు ఉద్యమాలతో సంబంధం కలిగిన జంగయ్యగారు క్రమక్రమంగా రాజకీయాలకు దూరమై సాహిత్యంలో మునిగి తేలుతున్నారు. సాంఘిక, రాజకీయ సమస్యల పట్ల వారికి అభ్యుదయ కరమైన భావాలున్నవి. ఆ భావాలు కవితలలో ప్రతిబింబించినవి. అందుకే వారి కవిత జనాదరణ పొందినది. వారి రచనలు ఈ సత్యాన్ని వేన్నోళ్ళ చాటి చెప్పుచున్నవి.

ఒక్కొక్కసారి క్రిక్కిరిసిపోయే సాంఘిక సమస్యల్లో సతమతమౌతూ ఇదమిత్థమని తేల్చలేక హతాశులై జంగయ్యకవి. ఎదురు ప్రశ్నలు వేస్తారు చూడండి......

ఎండమావులలోని నీడలను నీళ్ళుగా భావించిన
దాహము గొన్నవాని గతి యేం కావాలి?
తిరుగుబాటు చెయ్యాలా? చావాలా?'

సాంఘిక జీవితంలో మోసం సర్వత్ర వ్యాపించిందనీ, అది ఎండ మావుల్లాంటిదనీ అక్కడ ఏదో లభిస్తుందని ఆశగొన్న పిపాసార్తునికి శూన్యమే ఎదురౌతుందనీ అలాంటి సమయంలో 'తిరుగుబాటు చెయ్యాలా? చావాలా అని సంవరణాత్మకంగా ప్రశ్నించారు. జంగయ్యకవి: దీనికి సమాధానం 'అమ్ము లాగు ఒక నిజమ్ము లాగు' అన వాక్యంలోని కన్పిస్తుంది. ఒక నిజాన్ని లాగటానికి. అవసరమైతే ఆయుధాన్ని పూనాలని జంగయ్యకవి ఉద్బోధిస్తున్నారు. ఇలాంటి భావాలను పరిశీలించినప్పుడు 'కవిరత్న ' విప్లవసీమకు సమీపంలో ఉన్నట్లు కన్పిస్తారు.

మానవులలోని బలహీనతలు అనేక విధాలు. అందులో కొన్ని చాలా వికృతంగా ఉంటాయి. వెర్రి తలలు వేసే. ఆ బలహీనతలకు సమాజం దూరంగా ఉండాలనే తపనతో-.

ఎంగిలైన దాని మంగళంబని మెచ్చె
పరుడు పొందు వనిత భార్య యౌన
పులుసు గరిట పానమునబెట్టె దుర్బుద్ధి

అంటూ ఇలాంటి రుగ్మతలకు సమాజం దూరంగా ఉండాలని సూచించారు.

ఇప్పటికీ ఇంకా పల్లెలలో పలుచోట్ల అవ్యాహతంగా సాగుతున్న వెట్టిని నిరసించి ఈ విధంగా వీరు తమ మానవతను ప్రకటించుకొన్నారు చూడండి.

మాయ గౌరవాల బాయనిదై పేద
అన్నము మద్ధరింప గలుగుటయె
మాయ ఊడిగాన మటుమాయమై సాగే

ఈ మాటలవల్ల పేద పట్లవారి కెంత సానుభూతి ఉందో విశదమౌతూనే ఉన్నది.

జంగయ్యగారిలో తాత్విక జిజ్ఞాస కూడా అధికంగానే కనిపిస్తూ ఉంటుంది. అందుకే అవకాశం చిక్కినప్పుడల్లా భద్రాది మకుట నిర్వచనాలలో తాత్విక రహస్యాలను వివరించటానికి వారు బహుధా ప్రయత్నించారు.

పోతు పెంటి రెండు జాతులు ప్రకృతిలో
భిన్నమగుచు పుట్టి పెరిగికూడి
తల్లితండ్రులయిరి తనయులు పెక్కైరి
(భద్రాది మకుట పద్యాలు, పుట.13)

అంటూ జాతులన్నీ మానవ కల్పితాలనీ జాతి విద్వేష మానవత్వానికి తగదని సూచించారు.

ఈ విధంగా విశ్లేషించుకుంటూపోతే ప్రతి పద్యం లోనూ ఏదో ఒక ప్రత్యేకత కనిపించక మానదు. ప్రతి పద్యంలోనూ ఏదో ఒక సందేశం వినిపించక మానదు. శ్రీ నీలా జంగయ్య వేమన్న ననుసరించినా తన వ్యక్తిత్వాన్ని రక్షించుకొన్నవాడు.

కుల, మత, జాతి, వర్గ వైషమ్యాలను తూర్పారబట్టిన కవి. విశ్వమానవ సౌజన్యాన్ని ప్రతిబింబింపజేసిన కవి. సర్వోత్కృష్ట మానవతా వైభవాన్ని ప్రసాదించినాయి. భారత జాతి దుర్భర దారిద్ర్యాన్ని, అంటరానితనాన్ని ఎత్తి చూపి, వాటి నిర్మూలనమే దేశ శ్రేయస్సు అనే నగ్నసత్యాన్ని ప్రకటింపజేసినాయి. ఈ 20వ శతాబ్దంలో తెలుగు పద్యకావ్యాలకు తలమానికాలై ఈ కవికృతులు జాతి సహజీవనత్వాన్ని చాటి చెప్పుతున్నాయి. నీలా జంగయ్య మొదటి నుండి సంప్రదాయవాదిగా కనబడతారు. జాతీయ భవాలతో పాటు దేశభక్తి మెండుగా కలవారు మూఢవిశ్వాసాలకు దూరంగా ఉంటారు. కమ్యూనిస్టులతో కాంగ్రెసువారితోనూ కలిసి మెలిసి తిరిగినను అభ్యుదయ భావాలు ఆయనలో కనిపిస్తాయి. సమాజంలో పేదవారు వారి జీవితాలు బాగుపడాలని అంటరానితనం అసలు ఉండరాదని తన రచనల ద్వారా వెల్లడించారు.

ఈ విధంగా ఆధునిక కవుల్లో గొప్ప ప్రతిభావంతుడిగా తన గుండెనిండా బతికినాడు. సుమతీశతకం, పోతన భాగవతం, నృసింహ శతకం, బసవపురాణం ఈ రచనల ప్రభావం వేమన పద్యాలపై విశ్లేషణ చేసి విమర్శకుడిగా కూడా గుర్తింపు పొందారు. నీలాజంగయ్య రచనల్లో సామెతలు, లోలోక్తులు, జానపద బాణీలు, తెలుగువారి ఆటపాటలు, పద్యరూపాలు తత్త్వ చింతనాధోరణలు, పల్లెపదాలు వంటివెన్నో విమర్శనా దృష్టితో పరిశీలించబడ్డాయి. నీలా జంగయ్య తన రచనల్లో అభ్యుదయ భావాలతో పాటు తాత్త్వికచింతనను ఆవిష్కరిస్తూ ప్రపంచ పరిస్థితులను సమీక్షించారు.

**ఆధార గ్రంథాలు :**

1. ఆణిముత్యాలు, నీలాజంగయ్య, శ్రీదేవి పబ్లికేషన్స్, నల్లకుంట, హైదరాబాద్, 1983.
2. ఆవేదన, నీలాజంగయ్య, నాగేంద్రప్రింటింగ్ ప్రెస్, సికింద్రాబాద్, 1956.
3. కన్యకాపరమేశ్వరి చరిత్ర, నీలా జంగయ్య, బిందు ప్రెస్, హైదరాబాద్, 1980.
4. కలంకల, నీలాజంగయ్య, శ్రీదేవి పబ్లికేషన్స్, నల్లకుంట, హైదరాబాద్, 1984.
5. కవితాచంద్రిక, బిందు ప్రింటర్స్, హైదరాబాద్, 1980.
6. కవితారసోదయం, నీలాజంగయ్య, శ్రీదేవి పబ్లికేషన్స్, నల్లకుంట, హైదరాబాద్,1983

# రహస్య చిత్రం కవితా సంపుటి - ఒక పరిశీలన

- బుర్క ప్రియాంక, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

అధ్యాపకుడిగా, కవిగా, రచయితగా, విమర్శకునిగా, పర్యవేక్షకుణిగా విశిష్ట సాహిత్య కళాజీవిగా ప్రసిద్ధి చెందిన ఆచార్య బన్న అయిలయ్య తన బోధనా వృత్తిని, పరిశోధనా జిజ్ఞాసను బలోపేతం చేసుకోవడానికి వారు నిరంతరం సాహిత్య అధ్యయనం చేస్తూ ఉన్నారు. ఎన్నో సాహిత్య సదస్సుల్లో పాల్గొంటూ, మరెన్నో సాహితీ వ్యాసాలను రాస్తూ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నారు. విమర్శకులుగా, పాఠ్యపుస్తకాల రూపకర్తగా వారి కృషి స్ఫూర్తిదాయకం. వర్తమాన సాహిత్యంపై, వర్తమాన కవులు, రచయితలపై పరిశోధనలు చేయడానికి ప్రోత్స హించి, నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతన, రచనా కౌశలాన్ని పెంపొందించుకునేలా అనునిత్యం ప్రోత్సహించే ఉత్తమ అధ్యాపకులు.

'రహస్య చిత్రం' బన్న అయిలయ్య గారు రచించిన మొదటి కవితా సంపుటి. కవి తన చుట్టూ ఉన్న సమాజం లోని అనేక సంఘటనలను చూసి రాత్రి వేళల్లో నిద్రిస్తూ వాటిని నెమరు వేసుకుంటూ రాసిన కవితలే 1989లో రహస్య చిత్రం కవితా సంపుటిగా వెలువడింది. దీనిలో 20 కవితలు ఉన్నాయి.

"Poetry comes from the highest heppiness or the deepest sorrow" అని ఎ.పి.జె. అబ్దుల్ కలాం అన్నట్లు, కవి బన్న అయిలయ్య గారి అంతులేని వేదన లోంచి ఆయన హృదయాన్ని చీలుకొని వెలువడిండి ఈ కవిత్వం. కవి సమకాలీన సమస్యలను వస్తువుగా తీసుకొని, అభ్యుదయ దృక్పథంతో ఆలోచనాత్మకంగా మలిచారు.

మానవుడు అన్నాక మానవ సంబంధాల పట్ల గౌరవం వుండాలి. సాటి మనుషుల పట్ల దయతో, ప్రేమతో, మానవత్వంతో వ్యవహరించాలి అనే సందేశాన్నిస్తుంది "నేను క్షేమం" అనే కవిత.

"ఇప్పుడు మీరేడ్చినా నేను బతకను
నేను బ్రతికినన్నాళ్ళూ నవ్వారే
చచ్చిన తరువాత నేను
వికట్టహాసం చేస్తున్న మీ దుఃఖాన్ని చూసి"

మనిషి బ్రతికినంత కాలం అవహేళన చేసి, చని పోయిన తర్వాత ఏడిస్తే తిరిగి రాడు. అసహజమైన ప్రేమను చూసి శవాలు కూడా వికటాట్టహాసం చేస్తాయి. జీవితం ఎంతో విలువైనది. సాటి మనిషి బ్రతికి ఉన్నప్పుడే ప్రేమను చూపించాలి. చనిపోయాక చూపించే ప్రేమను ఆ మనిషి చూడలేడు, అనుభూతి చెందలేడు అని కవి భావన.

అభ్యుదయాన్ని కాంక్షిస్తూ రాసిన కవిత 'బీజం'

"వెదురు పొదల మాటున
తెగిపడ్డ పిడికిళ్ళు వేళ్ళూనుకొని
తుపాకులై మొలవాలి
కొత్తగా తూటాలు చిగురించాలి"

ఉద్యమం ఉధృతంగా ముందుకు సాగాలని, సమ సమాజ స్థాపనకై ఎవరో ఒకరు బీజం వేసి, పోరు సలిపితే బానిస సంకెళ్ళ నుండి విముక్తి లభిస్తుందని కవి ఆకాంక్ష. సమకాలీన సమాజ సంఘర్షణలను ప్రతిఫలించిన కవిత.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న భిన్న పరిస్థితు లకు అద్దం పడుతుంది ఈ "రహస్య చిత్రం" కవిత. దేశంలో జరిగే హింసను, అరాచకత్వాన్ని, అన్యాయాన్ని వ్యతిరేకిస్తూనే, నోరు మెదిపితే ప్రాణాలు పోయే పరిస్థితిని హెచ్చరిస్తున్నాడు కవి.

"కలాల నాలుకలను తెగ్గోసి జైలు
ద్వారాలకు తోరణాలుగా వేలాడదీస్తారు
న్యూస్ ప్రింట్ రోజే పత్రికల
అసలైన కంఠాన్ని తెగనరుకుతుంది"

ప్రశ్నించే వాడే కవి. అన్యాయాన్ని ధిక్కరించి, అచారక పాలనకు వ్యతిరేకంగా కవి తన కలం ఝుళిపిస్తాడు. అలాంటి కవులు, రచియతల నోళ్ళు నొక్కి జైళ్ళల్లో బంధించుటను ఆక్షేపించి, వ్యవస్థ పట్ల తన నిరసనను వ్యక్తపరిచాడు కవి.

పత్రికా స్వేచ్ఛ అనేది అన్ని పౌర, రాజకీయ మరియు మతపరమైన హక్కుల భావన అని చెప్పవచ్చు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలు ప్రభుత్వానికి మరియు ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తాయి. ప్రభుత్వ ఏర్పాటు దశలో ఈ హక్కు చాలా ముఖ్యమైనది. ఈ హక్కు లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ సాగించదు. పత్రికా రంగం ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభం, ఇది వాక్ మరియు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించు కుంటుంది. పత్రికా స్వేచ్ఛ అన్ని ప్రజాస్వామ్య దేశాల్లో శాశ్వతంగా ప్రతిష్ఠాత్మకమైన హక్కు సామాజిక దురాచారం, అవినీతి, అణచివేత ఏది జరిగినా మొదట గొంతు ఎత్తేది పత్రికలే. అలాంటి పత్రికల కంఠాన్ని తెగ నరుకుటను నిరసించాడు కవి.

ప్రపంచంలో అన్ని దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నిరుద్యోగం ఒకటి. నిరుద్యోగం ఒక దేశ ప్రగతిని అవరోధంగా నిలుస్తుంది. చేయడానికి పని లేక... ఉపాధి లేక.. అర్హతలుండి కొందరు, అర్హతల్లేక మరి కొందరు నిరుద్యోగితను ఎదుర్కొంటున్నారు. వస్తుసేవల ఉత్పత్తికి ఇతర వనరులతోపాటు మానవ వనరుల అవసరం కూడా ఉంది. వీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోయినప్పుడు అంటే నిరుద్యోగిత ఉన్నప్పుడు ఆర్థిక వ్యవస్థలో ఆర్థికపరమైన సమస్యలే కాకుండా, కొన్ని సాంఘిక, రాజకీయపరమైన సమస్యలు కూడా తలెత్తు తాయి. నిరుద్యోగులు తమ జీవితాలను ఇబ్బందులతో.. అతి కనీస స్థాయిలో గడపాల్సి ఉంటుంది. అందువల్లే ప్రజల శ్రేయస్సు కోరే ఏ రాజ్యంలోనైనా నిరుద్యోగ నిర్మూలన అంశాన్ని ప్రధాన లక్ష్యంగా, తక్షణ కర్తవ్యంగా భావించాల్సి ఉంటుంది. "మృత్యువు బూటులో నా కలు" అనే కవితలో నిరుద్యోగ జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో చిత్రించారు కవి.

"దిన పత్రికలో ఉద్యోగ వార్తకి
ఆగిపోయి కొట్టుకుంటున్న గుండె దడ దడ"
"కలేజ్ టెక్నిక్‌లో
ఎంత నరకమో ఈ నిరుద్యోగ వృత్తి
చావటానిక్కూడా సమయమివ్వదు
ఒక కంటి చెలియలి కట్ట తెగ్గి
సముద్రం కంట్లోంచి పారిపోయింది
నా బాధల్లా అది ఏ ఉద్యోగి
లంచపు కాళ్ళ క్రింద కొన ఊపిరిలో
కొట్టుకుంటుందోనని"

నిరుద్యోగ వృత్తి నరకప్రాయమైనదని,

నిరుద్యోగ యువతకు వారి అర్హతను బట్టి కాకుండా లంచం ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చే ఉద్యోగుల అవినీతిని కవి ఎండగట్టారు.

"చావును రిలే చేస్తూ..." అనే కవితలో

"రెప్పపాటుకన్నా వేగంగా
లోకం పోకడను గ్రహించి
అడవి ప్రమానులకు కొత్త గొంతుకలిచ్చావు
అక్షరాల అర్థాలలో
ఇమడలేని గాథల్తో
క్షణం క్షణం రణం జరిపి
కర్పూరంలా కరిగిపోయావు"

అడవి అంటే చెట్లు, పచ్చదనం, ఎరుపు, విప్లవం, అభ్యుదయం. ఒక ఉద్యమకారుడు కొత్త సిద్ధాంతాలను రూపొందించి, తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేసి, ఈ లోకం నుండి నిష్క్రమించిన వైనాన్ని అద్భుతంగా చిత్రించారు బన్న అయిలయ్య గారు.

"నీవు విడిచి వెళ్ళిన ఆయుధం
ప్రక్కవాడి చేతిలో కొచ్చింది
నీ వెత్తిన జండా కర్మాగారపు

గొట్టాలపై ఎగురుతుంది
నీ అడుగుల్లో
పసివాడికి అడుగులు నేర్పుతుంది మరో అమ్మ"

ఒక నాయకుడు మరణిస్తే, ఇంకొకరు ఆ నాయకత్వ బాధ్యతలను స్వీకరిస్తారు. అమరుడైన అతడిని ఆదర్శంగా తీసుకొని, పసివాడు అతడి అడుగుజాడల్లో నడిచేలా ఓ అమ్మ నేర్పిస్తుంది. అంటే కవి తను స్వప్నించిన మరో కొత్త తరాన్ని కాంక్షిస్తున్నారు.

చీకట్లో జరిగిన ఎన్నో కార్యకలాపాల గూర్చి చెప్తూ "చీకటి ఒంటరిది కాదు" అంటున్నారు కవి.

"దిక్కులేక దీనంగా రోడ్డు శిలువకు
బిగించిన బాల క్రీస్తులు
చీకటి దుప్పటిని కప్పుకొని ఉన్నారు"

రాత్రిపూట జరిగే స్మగ్లింగ్, స్త్రీల మేనుతో వ్యాపారాలు, ఫ్యాక్టరీలలో కార్మికులు ఉత్పత్తి చేసే వస్తువులు, రోడ్డుపై పడుకున్న అనాథ బాలలు మొదలైన దృశ్యాలన్నీ సాక్షీభూతాలుగా నిలుస్తున్నందున చీకటి ఒంటరిది కాదు అని అంటున్నారు కవి బన్న అయిలయ్య గారు.

"చీకటి చిత్రపటం వెనుక" కవిత కవి విషాదానికి ప్రతీక తండ్రి, సోదరుడు ఈ లోకంలో నుండి వెళ్లిపోతే,

"అన్నయ్యా అమ్మ గుండె మైదానాల్లో
నడిచిన నీ పసి పాదాల సవ్వడి విని
అర్ధరాత్రి ఉలిక్కిపడి లేచినపుడు
నిన్ను కంటి చేత్తో తడుముతుంటే
నేనేం చెప్పను
ఏ ఆచూకీ ఇవ్వకుండానే
నువ్వూ నాయనా చెట్టాపట్టాలేసుకొని
మీ ఆటలోంచి మమ్మల్ని వెలేసి
వెళ్ళిపోయారెందుకో
సూర్యుడు నుదిటిమీద నుంచి
జారిపోయాడు
మేమిప్పుడు ఒంటరులం"

ఈ కవిత నాస్టాల్జియాకు చెందినది. కొన్ని జ్ఞాపకాలు వెంటాడి, పదే పదే గాయం చేస్తాయి. కవి తన బాల్యం లోనే తండ్రిని, ఆ తరువాత సోదరున్ని కోల్పోవడం విషాదం. మనమైనా, మనం ప్రేమించినవారైనా, మన ఆత్మీయులైనా, ఎవరైనా సరే ఏదో ఒకనాడు మరణించ వలసిందే. అది ప్రకృతి ధర్మం. అయినప్పటికీ మనకు ప్రియాతిప్రియమైన వారు దూరమైనప్పుడు అంతా శూన్యంగా అనిపిస్తుంది. తండ్రి చనిపోతే తల్లి ఒంటరిదైన వైనాన్ని, కొడుకు మరణిస్తే అర్ధరాత్రి నిద్రలో కూడా అతని కోసం ఆ తల్లి వెతుకులాటను హృద్యంగా చిత్రించారు.

"పెదవి కదలిందో ఊపిరితాడును
ఎవడో లాగేస్తాడు అజ్ఞాతంగా" (రహస్య చిత్రం)

దిక్కులేక దీనంగా రోడ్డు శిలువకు / బిగించిన బాల క్రీస్తులు / చీకటి దుప్పటిని కప్పుకొని ఉన్నారు. (చీకటి ఒంటరివి కాదు)

"చితికిపోయిన కుటుంబ సమాధిలో
కరుణ చిగురు తొడగిన కొత్త మొక్కల్తో
కావాలని పిండుకొని విషాదం రాల్చుకున్న హృదయాలు

"ఆకాశమ్మీద
విత్తిన చుక్క చెట్లకు
విరగబూస్తున్న కాంతి పంట

"స్వర్గ నరకాల మధ్య
వైతరణీ కెరటాలమీద ఊయలూగే బల్ల చెక్క
ఈ సమాజం

"ఇక్కడ ఆత్మీయుల అనురాగం
బొడ్లో రహస్యంగా దోపిన మడతకత్తి"

"పేగులు ఆకలి కళ్ళు అతికించుకుంటే
ఆ కళ్ళలోకి ఇరానీ టీలు చిమ్మేవాడు"
(చీకటి నీడలు)

"గుండె నిప్పులకుండ
ఎక్కడో చిట్లి నిరంతరం

అశ్రుధారల్ని స్రవిస్తుంది'' (నెత్తుటి ధారలు)

"గుండెను దీపం చేసుకొని సాగిపోతానంటున్నావు"
(సాహసి)

బన్న అయిలయ్య గారి మస్తిష్క అంతర్మథన ఫలితమే "రహస్య చిత్రం" సమాజంలోని పలు కోణాలను అభివ్యక్తి నవ్యతతో, తాత్విక నేసథ్యంలో చిత్రించారు.

''మిత్రుడు శ్రీ బన్న అయిలయ్యలో సాహిత్య అధ్యయనం చేసే జిజ్ఞాస ఉన్నది. శ్రద్ధ ఉన్నది. వీటికి తోడుగా సృజనాత్మకశక్తి ఉన్నది. ఈ అన్నింటిని సమన్వ యించుకునే సమర్థత ఆయనలో పుష్కలంగా ఉన్నది. ''అని ముందుమాటలో ఆనాడే ఆచార్య పేర్వారం జగన్నాథం గారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు అని తెలియజేస్తున్నారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. రహస్య చిత్రం కవితా సంపుటి - డా॥. బన్న అయిలయ్య, 1980.
2. కాళోజీ ప్రస్థానం - సాహిత్య పరిమళం - డా॥. కరిమిడ్ల లావణ్య, 2019.
3. సన్నుతి (ఆచార్య కోవెల సుప్రసన్నచార్య అశీతి పూర్తి అభినందన సంచిక - ప్ర.స.డా. గుమ్మన గారి బాల శ్రీనివాసమూర్తి - 2016.
4. కాళోజీ కాహళి - బి. నరసింగరావు - 2014 (కాళోజీ శతజయంతి సంచిక)

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 04, April 2024



ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# ఎస్.ఎమ్. ప్రాణ్ రావు కవిత్వం - పరిశీలన

- **గడ్డల అనిల్,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**ప్రవేశిక :**

కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా
హీనంగా చూడకు దేన్నీ!
కవితామయమేనోయ్ అన్నీ!
రొట్టెముక్కా, అరటితొక్కా, బల్లచెక్కా -
నీవేపే చూస్తూ ఉంటాయ్!
తమలోతు కనుక్కోమంటాయ్
తలపుగొళ్ళెం, హారతిపళ్ళెం, గుర్రపుకళ్ళెరాకాదేదీ
కవిత కనర్హం!
ఔనౌను శిల్ప మనర్ఘం!”

(మహాప్రస్థానం. 2019:43)

మహాకవి శ్రీశ్రీ గారు ప్రపంచంలో ఉన్న ఏ చిన్న వస్తువునైనా (కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా) హీనంగా చూడకూడదని, అవన్నీ కవిత్వానికి వస్తువులు, శిల్పాలేనని ఘంటాపథంగా చెప్పారు. పై పంక్తులలో శ్రీశ్రీ చెప్పింది కవిత్వం గురించే అయినా, దానిని మనం ప్రపంచ సాహిత్యం, భారతదేశ సాహిత్యం, తెలుగు సాహిత్యం మొత్తానికి అన్వయింపజేయవచ్చు. సాహిత్యం ఒక పిపాస లాంటిది. రాసేవారికి గానీ, చదివేవారికి గానీ జిజ్ఞాస ఉంటే అది ఎప్పటికీ తీరని దాహం లాంటిది. ఎంత రాసినా ఇంకా రాయాలనే అనిపిస్తుంది. ఎంత చదివినా చదవాలనే కుతూహలం వేస్తుంది. సాహిత్యాన్ని అర్థం చేసుకొంటున్న కొద్దీ మనిషి ప్రయత్నం ఎప్పటికీ ఒక గమ్యం చేరదు.

ప్రాచీన సాహిత్యం మొదలుకొని ఆధునిక సాహిత్యం వరకూ తెలుగులో అనేక నూతన ప్రక్రియలు ఏర్పడ్డాయి. అందులో ప్రధానంగా ఆంగ్ల ప్రభావంతో నవల, కథానిక, నాటకం, నాటిక, కవిత, విమర్శ, వ్యాసం, సమీక్ష, పీఠిక, స్వీయచరిత్ర, జీవితచరిత్ర, పత్రికా రచన, అనువాదం మొదలయిన ప్రక్రియలు తెలుగులోకి ప్రవేశించాయి. అవన్నీ సాహిత్యానికి ఎనలేని సేవ చేస్తూనే ఉన్నాయి. ఎందరో కవులు, రచయితలు ఆయా ప్రక్రియలకు పర్యాయ పదాలుగా నిలిచారు. అలాంటి వారిలో కవి, నాటక, నవలారచయిత, సినిమా రచయిత ఎస్.ఎమ్. ప్రాణ్ రావు ఒకరు.1995లో మొట్టమొదటి నవల ‘నీలిపాప’తో ప్రారంభించి ఇప్పటివరకు మొత్తం 19 నవలలు, 2 నాటకాలు, 2 కవితాసంపుటాలు వెలువరించి, తెలుగు సాహిత్యానికి తన వంతు కృషి చేస్తున్నారు. అయితే, ఎస్.ఎమ్. ప్రాణ్ రావు గారు నవలా రచయితగానే సాహితీలోకానికి తెలుసు. కాని, ఆయన అలతి అలతి పదాలతో చక్కని రెండు కవితా సంపుటాలను కూడా వెలువరించారు. ఆ రెండు కవితాసంపుటాలను నిశితంగా పరిశీలించి, అందులోని విశేషాలను తెలియజేయడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**కవి పరిచయం :**

ఆధునిక తెలుగు సాహిత్య నవలా రచనల్లో ముందు వరుసలో చెప్పుకోదగిన రచయిత, కవి, నాటకకర్త ఎస్.ఎమ్. ప్రాణ్ రావు (పూర్తి పేరు సరబాద ముఖ్య ప్రాణ్ రావు). ఈయన తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో రమణారావు, పద్మావతి దంపతులకు 1943లో జన్మించారు. తల్లిదండ్రులిద్దరూ నల్లగొండలో ఒక వీధి పాఠశాలను(కాన్గిరిబడి)లో నడిపేవారు. పద్మావతిగారికి పుస్తకాలు చదివే అలవాటు బాగా ఉండేది. అదే ప్రాణ్‌రావు గారికి చిన్నతనంలోనే సాహిత్యంపై మక్కువ ఏర్పడేలా చేసింది. తల్లి ప్రోత్సాహంతో చిన్నతనంలోనే ఆయన సాహిత్య కథలు, వీరపూజ, వేయిపడగలు చదివారు.

**ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు - రచనలు :**

తన తల్లి పద్మావతి ప్రోత్సాహంతో చిన్నతంలోనే సాహిత్య సృజన వైపు అడుగులు వేసిన ప్రాణ్ రావు

వైవిధ్యమైన, విశేషమైన ఇతివృత్తాలను ఎన్నుకొని, 1. నీలిపాప 2.డ్రీంబాయ్ 3.వెన్నెలలో కోనేరు 4. కవిత 5.నీలాంబరి 6.సిరులయ్య 7.అందం 8.కొమరం భీం 9.నీటి నీడ 10.హంసగీతి 11.పురివిప్పిన నెమలి 12.మలగనిబత్తి 13.రాంగ్‌వే 14.రుద్రమ దేవి 15.నేలజారని ఊడలు 16.మహామంత్రి మాదన్న 17.ప్రజాజ్యోతి పాపన్న 18.ప్రతాపరుద్రుడు 19.మలగని బత్తి (నవలాత్రయం) మొదలయిన నవలలను వెలువరించారు. వీటితోపాటు రుద్రమదేవి, మాచలదేవి అనే రెండు నాటకాలు, తుఫానుకెదురు నడవరా, హంసగీతి అనే రెండు కవితా సంపుటాలను వెలువరించారు. ప్రాణ్‌రావు గారు సామాజికంగా, చారిత్రకంగా జరిగిన వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఎక్కువ రచనలు రాశారు.

## ఎస్.ఎమ్.ప్రాణ్ రావు అందుకున్న పురస్కారాలు:

సరబాద ముఖ్య ప్రాణ్ రావు గారు ఇప్పటివరకూ అనేక పురస్కారాలు పొందారు. అందులో ప్రధానంగా 'మాభూమి' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా 1979లో నంది అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత 1990లో 'కొమురం భీం' చిత్రానికి ఉత్తమ రచన - సంభాషణలు రాసి అనేక ప్రశంసలు పొందారు. తుఫానులకెదురు నడవరా రచనకు గాను సత్య ఛారిట బుల్ ట్రస్ట్ (విశాఖపట్నం) వారు 2010లో ఉత్తమ కవితా సంపుటిగా పురస్కారం అందించారు. ఆంధ్రప్రదేశ్ దళిత కళామండలి వారు 2011లో "ట్రూ ఇండియన్" అవార్డు ఇచ్చి సత్కరించారు. మలగని బత్తి నవలకి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, తొలి తరం తెలంగాణ రచయితలకు, కళాకారులకు ఇచ్చే 'తెలంగాణ స్వర్ణకమలం' మొదలయిన పురస్కారాలను 2012లో అందుకున్నారు.

## ఎస్.ఎమ్. ప్రాణ్ రావు - సినిమా రచనలు :

ఎస్.ఎమ్. ప్రాణ్ రావు గారు 1978లో 'మా భూమి' సినిమా కోసం తెలంగాణలో వివిధ ప్రాంతాలు తిరిగి పోరాటంలో పాల్గన్న యోధులను ఇంటర్వ్యూ చేశారు. వారు చెప్పిన వాస్తవ విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి, మా భూమి సినిమా స్క్రిప్టును రూపొందించారు. మా భూమి చిత్రానికి నిర్మాత అయిన బి. నరసింగరావుతో కలిసి సంభాషణలు రాశారు. ఆ సంభాషణల్లో ప్రధానంగా కొత్తగా పెళ్లై కాపురానికి వచ్చిన నూతన వధువును ఆ వూరి దొర ఆగం చేసిన సన్నివేశంలో భర్తను ఓదారుస్తూ 'ఇయన్ని మనం మనసుల పెట్టుకుంటే ఇగ సంసారం ఏం చేస్తం' అంటూ ఆడబిడ్డలు దొర కామదాహానికి ఎలా బలి అవుతున్నారో, వారి భర్తలు ఎలాంటి నిస్సహాయ స్థితిలో ఉన్నారో ఆ ఒక్క సంభాషణ పట్టి చూపిస్తుంది. అలాంటి గొప్ప గొప్ప సంభాషణలు ఎన్నో మా భూమి సినిమాలో పూర్తిగా తెలంగాణ మాండలికంలో రాసి, మంచిపేరు పొందారు.

'కొమురం భీం' అనే సినిమా తీయడానికి ముందు ఎస్.ఎమ్. ప్రాణ్ రావు గారు ఆదిలాబాద్ అడవులలో 1990లో విస్తృతంగా పర్యటించారు. ఆ క్రమంలో దట్టమైన అడవిలో ఇరవై మైళ్ళు కాలి నడకన వెళ్లి, కొమురం భీం భార్య సోంబాయిని, చోటె గ్రామంలో కనుగొన్నారు. ఆమెతో ముఖాముఖిగా మాట్లాడి కొమురం భీం గురించి అనేక విషయాలు చర్చించి, ఆయన చేసి పోరాటం గురించి తెలుసుకున్నారు. కొమురం భీం వాస్తవాలను సేకరించి, వాటి ఆధారంగా మొదటగా కొమరం భీం సినిమా స్క్రిప్టు రాసి, ఆ తర్వాత నవలగా రాశారు. వీరి పరిశోధన వల్లే కొమురం భీం భార్య సోంబాయి గురించి మొదటగా బయటి ప్రపంచానికి తెలిసింది.

'కొమురం భీం' చిత్రంలో నిజాం పోరాటం వద్దని చెబుతున్నా వినకుండా పోరాటం చేస్తున్న సందర్భంలో సోంబాయితో కొమురం భీం ఇలా అంటాడు. "పోరాటంలో గెలిస్తే మనం తల ఎత్తుకుని తిరుగొచ్చు, సచ్చినమనుకో మన పిల్లలు తల ఎత్తుకుని తిరుగుతారు" అంటాడు. తన భార్యతో కొమురం భీం చెప్పిన సంభాషణలు సినీ ప్రేక్షకులకు ఒక ఉద్యమ స్ఫూర్తిని రేకెత్తించాయి.

ఎస్.ఎమ్.ప్రాణ్ రావు గారు ఎంతో సాహసం చేసి ఆసియాలోనే అతి పెద్ద కాలుష్య పారిశ్రామికవాడగా పేరుగాంచిన పటాన్ చెరువులో చిక్కుకున్నా బాధితులను స్వయంగా కలిసి, వారితో ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారు. అక్కడి పరిస్థితులను, వారి జీవన విధానాలను, ప్రదేశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, పర్యావరణం మీద తొలి తెలుగు నవల నీలిపాప ను 1995లో రాసి, తెలుగు చిత్రపరిశ్రమలో ఎస్.ఎమ్.ప్రాణ్ రావు గారికి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

## ఎస్.ఎమ్.ప్రాణ్ రావు - కవిత్వం పరిశీలన :

ఆధునిక తెలుగు సాహిత్యంలో నవలా రచయితగా పేరు ప్రఖ్యాతులు గడించిన ఎస్.ఎమ్.ప్రాణ్ రావు కవిగా కూడా ప్రసిద్ధులు. నిజానికి 1964 నుండే వచన, గేయ కవితలు రాయడం ప్రారంభించినప్పటికీ నవలు రాసినంత ఉధృతంగా కవిత్వం రాయలేదు. ఇప్పటివరకు ఆయన రెండు కవితా సంపుటాలు వెలువరించారు.

### 1. తుఫానులకెదురు నడవరా...

ఈ కవితాసంపుటిని రచయిత ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు 2010లో ప్రచురించారు. ఇందులో గేయ కవితలు, వచన కవితలు, ఇంగ్లీషు కవితలు కలిపి మొత్తం 30 కవిత లున్నాయి. ఇవన్నీ 1964-2010 మధ్యకాలంలో రాయబడ్డ కవితలు. 46 సంవత్సరాలు పాటు సమజాన్ని నిశితంగా పరిశీలిస్తూ, అందులోని లోతుపాతులను గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఎస్.ఎమ్.ప్రాణ్ రావు తన కవిత్వం ద్వారా చెడును ఎత్తి చూపారు.

కొంతమంది జీవితం అనే ప్రయాణంలో ఎదురైయ్యే నష్టాలు, దు:ఖాలను అధికమించకుండా అంత నా తలరాత, విధిరాత, కర్మ అనుకంటూ స్తబ్దంగా ఉండే వారిని ఉద్దేశించి "లలాట లిఖితం" అనే కవిత ఖండికలో కవి చాలా చక్కగా వర్ణించారు.

'పై తిరిగే ఫోను
టపీమని తెగి తలపై పడితే,
నల్లాలు నాలుగు రోజులైనా
నీ నాలుక తడపకపోతే
మింటికెగరాల్సిన తారాజువ్వ
మట్టిలోనే కూరుకుపోతే, కన్నెపిల్ల పరువం
కట్నం లేక వాడిపోతే
కోడెవయసు కుర్రాడు కాలేకడుపుతో
కొండల్లో కనుమరుగయితే
అంతా లలాట లిఖితమని చేతులు దులుపేసుకో
జేబులో పైసలున్నాయో లేవో తడిమి చూసుకో' అని సూచించాడు.

స్వయంగా ప్రజా ఉద్యమాలలో పాల్గన్న ఎస్.ఎమ్.ప్రాణ్ రావు 'నా ముద్దుబిడ్డలారా' అనే కవిత ఖండికలో తెలంగాణ ఉద్యమం చేస్తున్న విద్యార్థులను ప్రోత్స హించారు. ఆశయసిద్ధి కోసం ఉద్యమాన్ని ఉధృతం చెయ్యమని ఆకాంక్షించారు. కానీ, ఉద్యమం కోసం ఉద్యమాన్ని ఉధృతం చెయ్యమని ఆకాంక్షించారు. కానీ, ఉద్యమం కోసం బలిదానం చేసుకున్న విద్యార్థుల పట్ల ఆయన ఎంతో దు:ఖించారు.

'ఉద్యమాలు భావికి
ఊపిరి పొయ్యాలి.
నూతన భావజాలానికి
పునాది వెయ్యాలి.
రేపటి ఆశల చిగురింపులకు
వసంతాన్ని ముంగిట్లో దింపాలి.
ప్రతి ఉద్యమం కోరుతుంది బలిదానం
ఎందరో ఉద్యమ వీరులు
అర్పించారు ప్రాణం.' అని గుర్తు చేశారు.

జడత్వ దశలో ఉన్న ఎంతో మంది మెదళ్ళకు ఉద్యమం పదును పెడుతుంది కవిత్వం. అంతో ఇంతో చదువుకున్న అక్షరాస్యులను, బుద్ధిజీవులను వాస్తవిక ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఉద్యమం నేపథ్యాన్ని, దాని ఆవశ్యకతను ఇతివృత్తంతో సహా వివరించేందుకు ప్రయత్నిస్తుంది కవిత్వం. అలాంటి కవితలు అనేకం రావుగారు రాశారు. అందులో 'తుఫాలనులకెదురు

నడవరా' అనే కవిత ఖండిక సాహితీలోకంలో బహుళ ఆదరణ పొందింది.

'తుఫానులకెదురు నడవరా
అన్నయ్యా పిడుగుపాటు కదిరిపడకురా
కార్మికునిదే రాజ్యమని
కర్షకునిదే రాజ్యమని
కర్షకునిదే భూమియని సత్తెమన్న వెలసిన
ఈ పుణ్యమని నీదేనని
బలిదానము చేయుటకె
బ్రతుకంతా అంకితమని...
దుక్కి దున్నె రామన్నకి
చెమట ఓడ్చె మల్లన్నకి
తిండి తిప్పల కరువు భాషగా
ఉండుటకిల్లు కలిగేదాకా.
బజ్జయ్య క్రూరంగా
బక్కన్నను నములుతువుంటె
బక్కన్నల కాపాడగ
తుఫాకీల కెదురు నడవరా
అన్నయ్యా తూటాల మాల తొడగరా' అంటూ
ఉద్యమ స్ఫూర్తికి నింపారు.

**2. హంసగీతి :**

హంసగీతి అనే రెండవ కవితా సంపుటిని రచయిత ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు 2011లో వెలువరించారు. ఈ సంపుటిలో ప్రధానంగా కాలుష్యంపై అవగాహన కల్పిస్తూ 'ఏదీ నా బాల్యం', 'ఎవడీ అర్భకుడు', అరణ్యరోదన'; 'అమ్మ ఆక్రోశన', 'మహానిర్వాణం' అనే 8 కవితలు రాశారు.

మానవాళి మనుగడనే ప్రమాదభరితం చేస్తూ, ప్రపంచాన్ని మృత్యు ముఖం వైపు నడిపిస్తున్న ప్రకృతి విధ్వసంపై ప్రాణ్‌రావు ఘాటుగా స్పందించారు. 'మహా నిర్వాణం' వంటి దీర్ఘ కవితలు మనిషి తాను కూచున్న కొమ్మనే నరుక్కుంటున్న మూర్ఖత్వాన్ని వెల్లుడిస్తుంది. ఇతివృత్తాలకు అనువైన కవితాశైలితో ప్రాణ్ రావు రచించిన తీరు పాఠకలోకంలో ఆదరణ పొందాయి.

"ఏదీ నా బాల్యం" అనే మొదట కవితలోనే కవి నేటి బాలబాలికల బాల్యాన్ని ఏ రకంగా కోల్పోతున్నారో చక్కగా వర్ణించారు. కవి కాలంలో బాల్యం ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో పోల్చుతూ చాలా స్పష్టంగా చెప్పారు.

"కొండ ఎక్కలేదు
బండ మీంచి జారలేదు
కొమ్మ పట్టుకుని
ఉయ్యాలలూగ లేదు
వాన నీళ్లు
అరచేతిలో పట్టి ఆడలేదు పడవలు చేసి
పారే నీటిలో వదలలేదు
ఎండకి కాగుతూ
చెట్టు నీడకై ఉరుకలేదు
కంచెలు దూకి
కాయలు తెంపలేదు.
కాపలా దారు కర్రకు
అందకుండా
నవ్వుతూ ఉరుకలేదు.
బోర్లాపడి, చిట్టినవేళ్లకు
ఉమ్మి మందు పెట్టలేదు" అని గుర్తు చేసుకున్నారు.

ప్రాణ్‌రావు హంసగీతిలోని 8 కవితలలో 'కాటు కలిశాయి', 'అరణ్య రోదన', 'అమ్మ ఆక్రోశన', 'మహా' నిర్వాణం' అనే నాలుగు కవితలు పర్యావరణంపై రాసిన కవితలే. పర్యావరణం పాడవడం వల్ల ఇతర జీవులకు కలిగే నష్టాలను, ప్రశ్నార్థకమైన వాటి ఉనికిని గురించి అద్భుతంగా వర్ణించారు.

"కళ్ల"ఉనికిని సార్థకం చేస్తూ
ఎటు చూసినా కనిపించే
పూల గాల చెట్లేవి
పూదోట జాడలేవి

ఆకాశ పందిరిలో
అరవిచ్చిన మొగ్గల్లా
ఇంద్రధనస్సు రంగుల్లా కదిలే
పక్షుల బారులు ఎటుపోయాయి
మళ్ళీ రావా పాటల పండుగ తేవా
కిచకిచలాడే
చిన్ని పిచ్చుకమ్మ నా బుర్రమీద
వాలడం మరిచిపోయింది.
ఎలా వాలుతుంది
బుర్రే తప్ప మనసులేని
నాయాంత్రిక ఎదుగుదల దాని రెక్కలు విరిచింది.
చూరులు లేని నా కాంక్రీటు సమాధి
దానికి ఉరికొయ్య అయి నిలిచింది' అని పేర్కొన్నారు.

దొంగ రాజకీయ నాయకులు ఎలా ఉంటారో హంసగీతిలోని 'ఎవడీ అర్భకుడు'' అనే కవితలో బట్టబయలు చేశారు కవి.

''ఓట్లు కొన్నడబ్బును
మూట కట్టుకోవడానికి
ఈ ఇన్‌ఫ్లేషన్లో రెక్కలు వచ్చే
ఓటు ధరను
పదవి వుండగానే
పదతరాలకి సరిపడా
మళ్ళీ మళ్ళీ అందుకోవడానికి
కూసుకోవడానికి
తమ పదవులను పరపతిని
తాకట్టుపెట్టి
రాజకీయాల్లోకి
రాకముందే
చంపుకున్న ఆత్మకి
దహన సంస్కారాలు చేసిన
రాజకీయ నాయకులు' అని చక్కగా వెల్లడించారు.

**ముగింపు :**

స్వయంగా ప్రజా ఉద్యమాలలో పాల్గన్న అనుభవంతో ఎన్నో ఉద్యమ చైతన్యం, ప్రభోదాత్మక కవితలు రాసిన రావు గారు. నిజానికి కవికి ఉండాల్సిన సున్నితమైన స్వభావం పుష్కలంగా ఉంది కనుకనే ఈ రెండు కవిత్వాలలో ప్రకృతి, పేదల బతుకులు, పర్యావరణ పరిరక్షణ, మానవాళి స్థితిగతులు, రాజకీయ నాయకులు పనితనాన్న చెబుతూ, నిత్యం ప్రజా సమస్యలే తన కలంకు ఒక వెన్నెముక. మనం ప్రతి కవితలో పాఠకుడికి ఆలోచనత్మకత కలిగిస్తాడు. ఇంత గొప్ప కవిత్వము రెండు సంపుటాలే కాకుండా, నీలిపాప నవల (తెలుగులో తొలి పర్యావరణం నవల) రాశాడు. ఇందులో కూడా పర్యావరణ కాల్యుష్యము వలన చుట్టూ ఉన్న జీవన విధానం, మొదలగు అంశాలు తెలియపరిచారు. ఈ రెండు కవిత్వ సంపుటాలు సమాజం పట్ల బాధ్యత, నిబద్ధత, ఆత్మ సంఘర్షణ, గుర్తు చేస్తుంటుంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - డాక్టర్. జి.నాగయ్య.
2. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్. ద్వానా. శాస్త్రి.
3. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి
4. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు ప్రయోగములు - సినారె

❖❖❖

# జానపద కళల పరిరక్షణలో ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారి కృషి

- పడకంటి మహేష్, పరిశోధక విద్యార్థి

## పరిచయం :

భాషలన్నింటికి లిఖిత సాహిత్యం ఉండకపోవచ్చు గానీ మౌఖిక సాహిత్యం తప్పక ఉంటుంది. ఎందుకంటే లిఖిత సాహిత్యం కంటే మౌఖిక సాహిత్యం మొదటిది కాబట్టి. ఫలానా భాషకు ఆదికవి ఫలానా కవి అనుకొంటారు తర్వాత జానపద సాహిత్యం ఒకింత నిరాదరణకు, న్యూనతకు గురైంది. పాశ్చాత్యుల రాక రాజకీయ, ఆర్థిక రంగాలకు ఎంతవరకు మేలు జరిగిందో కానీ విద్య, చరిత్ర, వార్తాపత్రికలు, సాహిత్య సేకరణ మొదలైన అంశాలలో వారి సేవ ఎప్పటికీ అభినందనీయమైనదే. అందులో భాగంగా తెలుగు సాహిత్యం ముఖ్యంగా జానపద సేకరణ, పరిరక్షణకి బాటలు వేసింది వారే. జానపదుల నాల్కలయందు కొడిగడుతున్న మౌఖిక సాహిత్యానికి మొదటిసారిగా అక్షరరూపం ఇచ్చారు. వారు చూపిన చొరవ తదనంతర తెలుగు పరిశోధకులు జానపద సాహిత్యంలో కీలకమైన కృషి చేశారు. ఆదిశేషగిరిరావు గారు, నంది చలపతిరావు గారు, నేదునూరి గంగాధరం గారు, బిరుదరాజు రామరాజు గారు, నాయని కృష్ణకుమారి గారు, తంగిరాల వెంకట సుబ్బారావు గారు మొదలైనవారు తెలుగు సాహిత్య సేకరణ, విశ్లేషణను తులనాత్మక కోణాల్లో బలమైన పరిశోధనలు చేశారు. ఆ క్రమం వారసత్వం అందుకొంటున్న వారిలో ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు ఒకరు.

## ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి - పరిచయం :

తెలుగు సాహిత్యంలో జానపద విజ్ఞాన ప్రపంచానికి ఎంతోమంది రచయితలు అమోఘమైన సేవలు అందించారు. అలాంటి ప్రతిభావంతుల్లో ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు పేర్కొనదగినవారు. ఈయన జానపద సేకర్తగా, గ్రంథరచయితగా, అధ్యాపకుడిగా, కళాకారునిగా, గాయకుడిగా, పరిశోధకుడిగా, ప్రదర్శన కళాకారుడిగా ప్రసిద్ధి చెందినవారు. ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు జానపద ప్రదర్శన కళలకు ఒరవడి దిద్దిన శిల్పి. వారు జానపదులతో మమేకమై ఆడి, పాడి, అందులో జీవించి రచనలు, పరిశోధన వ్యాసాలను రాశారు. జానపద విజ్ఞానానికి అద్వితీయమైన సేవ చేస్తున్న వీరి గురించి, జానపద కళల పరిరక్షణలో వీరి కృషి గురించి సంక్షిప్తంగా తెలుసుకోవడం అత్యవసరం.

వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపురం జిల్లా (ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా), ధర్మవరం మండలం, సుబ్బారావుపేటలో శ్రీ చిగిచర్ల పెద్దిరెడ్డి, శ్రీమతి ఓబుళమ్మ దంపతులకు 1954 జులై 25న జన్మించారు. సాహితీ సమరాంగన సార్వభౌములైన శ్రీకృష్ణదేవరాయలు ఏలిన రాయలసీమలో మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. వీరి జీవితాన్ని తెలుగు జానపద సాహితీ క్షేత్రానికి అంకితం చేసి, జానపద గ్రంథాలు ముద్రించి, జానపద పరిశోధకులకు, పాఠకులకు మార్గదర్శకులయ్యారు.

## పరిశోధన పత్ర రచన ఆవశ్యకత, ఉద్దేశ్యం :

జానపద సాహిత్యంలో ఆచార్య బిరుదరాజు రామరాజుతో పరిశోదన మొదలైంది. రామరాజు గారిని మొదలుకుని, ఈనాటి యువ పరిశోధకుల వరకు జానపద విజ్ఞానం మీద ఎన్నో రకాలైన పరిశోధనలు వచ్చాయి. జానపద కథలు, గేయాలు, కథా గేయాలు, పొడుపు కథలు మొదలైన వాటిపైన ఎన్నో పరిశోధనలు జరిగాయి.

వీరు మొట్టమొదటగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (అనంతపురం), తెలుగుశాఖలో ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానందం గారి పర్యవేక్షణలో "ధర్మవరం తాలూకా జానపద గేయాలు" (ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం, 1983) పై పరిశోధన చేశారు. తర్వాత రెండు తెలుగు

రాష్ట్రాలలో జానపద కళారూపాల మీద మొట్టమొదటగా "జానపద నృత్యకళ" (పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం) అనే అంశంపైన పరిశోధన చేయడం జరిగింది. వీరు సేకరించిన జానపద సంపదను పద్నాలుగు గ్రంథాలుగా, డెబ్బయి వ్యాసాలుగా మనకు అందించారు. అందువలన ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు ప్రచురించిన జానపద రచనలను గురించి, వారికి ప్రదర్శన కళల పట్ల గల అభిరుచిని గురించి పరిశోధన వ్యాస రచన చేయవలసిన ఆవశ్యకత ఉంది. ఈ నేపథ్యంలో భావి పరిశోధకులకు వారి గురించి, వారి మార్గదర్శనాన్ని తెలియజేయడమే ఈ పరిశోధన వ్యాస ముఖ్యోద్దేశ్యం.

**జానపద ప్రదర్శన కళాకారుడిగా ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు :**

జానపద కళాకారుడు అనే పదానికి అర్థం తిరగరాసిన ప్రదర్శన కళాకారుడు ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు. ఒక కళాకారుని ప్రదర్శనకు ప్రపంచం అంతా రంగస్థలమే అంటారు. గొప్ప కళాకారుడి అభినయం సామాన్యుడికి సైతం అర్థం అయ్యేలా ఉండాలి అంటారు. జానపదం అనేది కులానికో, కలానికో సొంతం కాదని నిరూపించిన తాత్వికుడు. జానపదుల వల్లనే జానపద సాహిత్యం, జానపద విజ్ఞానం ఇంకా సజీవంగా ఉంది అంటారు. వీరు రచించిన "వైయస్సార్ కడప జిల్లా - చిరుతల భజన"లో ఆచార్య పగడాల చంద్రశేఖర్ గారు ఇలా పేర్కొన్నారు.

"ఈ గ్రంథ రచనకు తోడ్పడిన చెక్కభజన బృంఆలకు నమస్సుమాంజలులు అని తెల్పడం వీరి కృతజ్ఞతా భావానికి, విద్యాత్మక నైతికతకు అద్దం పడుతుంది". కృష్ణారెడ్డి గారి వ్యక్తిత్వానికి ఈ మాట ఒక గొప్ప నిదర్శనం అని చెప్పవచ్చు. వీరు కళాత్మక సహృదయులు, ఎవరైనా జానపదం నేర్చుకోవడంలో ముందడుగు వేయవచ్చన్నారు.

ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు వివిధ కళారూపాలను ప్రదర్శించగల నేర్పరులు. డప్పులు, కోలాటం, చెక్కభజన, ఏకపాత్రాభినయం - బుర్రకథ (శ్రీకృష్ణరాయలు), జడకోలాటం, చెంచునాటకం (నర్సింహా పాత్రధారి), నామల సింగడు, యక్షగానం, కర్రసాము వంటి కళారూపాలు స్వయంగ ప్రదర్శిస్తారు.

ప్రదర్శన కళాకారుడిగా వీరు ప్రసిద్ధులు, జానపదులతో జీవించి వారితో ఆటా-పాటా నేర్చుకుని ప్రదర్శించేవారు. జానపద సాహిత్యంలోని అన్ని రకాల పాటలను పాడగలరు. అంతేకాకుండా వాటిని సేకరించి ఒక గ్రంథ రూపంగా "జానపద నృత్యకళ"ను అందించారు. అందులో సి. నారాయణరెడ్డి గారు ఇలా అంటారు. "జానపద వాఙ్మయ కళారంగం"లో విడదీయలేనంతగా ముడిపడ్డ వ్యక్తి డాక్టర్ చిగిచర్ల కృష్ణారెడ్డి. వీరు పరిశోధనం, అధ్యాపనం, ప్రయోగం - ఈ మూడు విభాగాలలో కృష్ణారెడ్డి జానపదుల జీవితాలనే ఎన్నుకున్నాడు. 'జానపద నృత్య కళ' కేవలం ఇంతవరకు ఉన్న సామగ్రి మీద ఆధారపడింది కాదు. అతడు స్వయంగా సేకరించిన ఎన్నెన్నో పల్లె పాటు" ఈ పుస్తకంలో పీట వేసుకున్నాయి.

**జానపద సేకరణలో - సవాళ్లు :**

ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు, జానపదుల జీవితాల నుండి సంపదను సేకరించి గ్రంథ రూపంగా ముద్రించారు. సేకరణ సందర్భాలలో వారు ఎన్నో సవాళ్ళను స్వీకరించి ఉండబట్టే, ఈ గ్రంథ ముద్రణ సాధ్యం అయ్యింది. ఈ కార్యసాధన సఫలీకృత ఫలితమే వారు మనకు అందించిన జానపద గ్రంథాలు.

ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారి గురించి "జానపద నృత్యకళ" గ్రంథంలో ఆచార్య జి.ఎన్. మోహన్ గారు ఇలా అంటారు.

"డాక్టర్ చిగిచర్ల కృష్ణారెడ్డి పరిశోధకుడే కాదు, స్వయంగా నృత్య కళాకారుడు కూడా. వృత్తి కళాకారులను ప్రోత్సహించి, వారి చేత ప్రదర్శనలు ఇప్పించడం, తాను కూడా ఆ ప్రదర్శనలో పాల్గొనడం అభినందించాల్సిన విషయం. జానపద నృత్యాలను సేకరించడం అంత సులభం కాదు. ఓపిక, పట్టుదల, ఆసక్తి కావాలి. ఈ మూడింటిని తనలో ఇముడ్చుకున్న పరిశోధకుడు డాక్టర్ కృష్ణారెడ్డి".

**ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారి జానపద నవ రత్నాలు - ప్రచురణ :**

ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు రచించిన జానపద గ్రంథాలు 'జానపద నవరత్నాలు' పేరిట ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించబడ్డాయి. ప్రతి గ్రంథం జానపదుల జీవితాలను, వారి కళారూపాలకు అద్దం పట్టేలా రూపొందించారు. ఈ రచనల ద్వారా వారి కళారూపాలు శాశ్వతంగా మరో తరానికి అందించడానికి ఇదొక గొప్ప ప్రయత్నమే.

**జానపద నవరత్నాలు - వివరాలు :**

1. ధర్మవరం తాలూకా జానపద గేయాలు (ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం) 1985/2022.
2. జానపదుల ప్రార్థనా గీతాలు (వినాయకుడు) 2009/2020/2022.
3. జానపద నృత్యకళ (పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం) 2014/2022.
4. గ్రామీణ సంస్కృతి (అనంతపురం జిల్లా జానపద గేయాలు) 2022.
5. వైయస్ఆర్ కడప జిల్లా జానపద కళారూపం - చిరతల భజన 2022.
6. ఆసాదుల పెద్దమ్మ కథ 2022.
7. ఉరుముల వారి కథా గేయాలు 2022.
8. కీ.శే. అమ్మళ్లదిన్నె గోపీనాథ్ జీవన రేఖలు 2022.
9. శ్రీకృష్ణదేవరాయలు (ఏకపాత్రాభినయం, బుర్రకథ) 2022.

**ముగింపు :**

బాల్యం నుంచే జానపద సాహిత్యంపై మక్కువ కలిగిన కృష్ణారెడ్డి గారు, తెలుగు సాహిత్యం చదువుకొని, పరిశోధనలు చేసి, జానపద అధ్యాపక వృత్తితోపాటు సహజంగా జానపద కళాకారుల నడుమ కళాకారుడిగా కొనసాగుతున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా జానపద పరిశోధకులుగా వారి పరిశోధన కొనసాగిస్తూనే ఉన్నారు. వారి పర్యవేక్షణలో యం.ఫిల్ (66), పిహెచ్.డి (36) పట్టాలు అందుకొన్నారు. ఇప్పటికీ జానపద కళా కారులకు ఉపాధి కల్పనకు వారధిగా నిలుస్తున్నారు. వీరి కఋషి ఎప్పటికి తెలుగు సాహిత్యం మరువనిది. ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు చేసిన కృషి వలన, వారు పరి శోధించి గ్రంథ రూపమిచ్చిన జానపద సంపదతో రాబోయే పరిశోధకులకు మార్గదర్శిగా నిలిచారు.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. కృష్ణారెడ్డి చిగిచర్ల, ధర్మవరం తాలూకా జానపద గేయాలు (ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం), జానపద యువ కళాకారుల సంఘం, ధర్మవరం, 1985/2022, పుటలు : 133.
2. కృష్ణారెడ్డి చిగిచర్ల, జానపదుల ప్రార్థనా గీతాలు (వినాయకుడు), లక్ష్మీప్రచురణలు, హైదరాబాదు, 2009/2020/2022, పుటలు : 55.
3. కృష్ణారెడ్డి చిగిచర్ల, జానపద నృత్యకళ (పిహెచ్‌డి. సిద్దాంత గ్రంథం), స్వీయ ప్రచురణ, హైదరాబాద్, 2014/2022, పుటలు : 272.
4. కృష్ణారెడ్డి చిగిచర్ల, గ్రామీణ సంసఋుతి (అనంతపురం జిల్లా జానపద గేయాలు), కృష్ణ సింధూరి సంకల్ప, హైదరాబాద్, 2022, పుటలు : 149.
5. కృష్ణారెడ్డి చిగిచర్ల, వైయస్ఆర్ కడప జిల్లా జానపద కళారూపం - చిరతల భజన, కృష్ణసింధూరి సంకల్ప, హైదరాబాద్, 2022, పుటలు : 156.

6. కృష్ణారెడ్డి చిగిచర్ల, ఆసాదుల పెద్దమ్మ కథ, జానపద యువ కళాకారుల సంఘం, ధర్మవరం, 2022, పుటలు : 123.
7. కృష్ణారెడ్డి చిగిచర్ల, ఉరుముల వారి కథా గేయాలు, జానపద యువ కళాకారుల సంఘం, ధర్మవరం, 2022, పుటలు : 199.
8. కృష్ణారెడ్డి చిగిచర్ల, కీ.శే. అమ్మళ్ళదిన్నె గోపీనాథ్ జీవనరేఖలు, కృష్ణ సింధణధూరి సంకల్ప, హైదరాబాద్, 2022, పుటలు : 94.
9. కృష్ణారెడ్డి చిగిచర్ల, శ్రీకృష్ణదేవరాయలు (ఏకపాత్రాభినయం, బుర్రకథ), జానపద యువ కళాకారుల సంఘం, ధర్మవరం, 2022, పుటలు : 26.
10. రాధాకృష్ణ మిక్కిలినేని, తెలుగువారి జానపద కళారూపాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1992/2011, పుటలు : 638.

❖❖❖

# భాస్కరభట్ల కృష్ణారావు వింతప్రణయం నవలలో సామాజిక జీవన చిత్రణ

- బిక్షు నాయక్ బుక్య, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

భాస్కరభట్ల కృష్ణారావు 1918 డిసెంబర్ 19వ తేదీన భాస్కర భట్ల అంబయ్య శాస్త్రి, లక్ష్మీబాయమ్మలకు జన్మించారు. ఇప్పటి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ విమానా శ్రయానికి దగ్గరలో గల బుద్వేల్ గ్రామంలో జన్మించాడు. వీళ్ళ పూర్వీకులు నల్లగొండ జిల్లా వాసులు. తాత ముత్తాతలు చాలా కాలం క్రితమే ఇక్కడున్న రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాంగణం సమీపాన ఉన్న శంషాబాద్‌కు వలస వచ్చి ఇక్కడే స్థిరపడి ఉన్నారు.

ఇతను 1943లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి లా డిగ్రీని పొందినాడు. ఇతనికి ఉర్దూ, పర్షియన్, హిందీ, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో పట్టు ఉన్నదని చెప్పవచ్చు. అలాగే బెంగాలీ భాషను కూడా నేర్చుకున్నాడు.

హైదరాబాదులోని దక్కన్ రేడియోలో ఉర్దూ భాషలో అనౌన్సర్‌గా ఉద్యోగం ప్రారంభించాడు. నైజాం భారత దేశంలో విలీనమైన తర్వాత దక్కన్ రేడియో ఆల్ ఇండియా రేడియోగా మారింది. ఆ రేడియోలోనే భాస్కరభట్ల సీనియర్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పని చేశారు. గోలకొండ పత్రిక సంపాదకవర్గంలో కొన్నాళ్లు పనిచేశారు.

**భాస్కరభట్ల కృష్ణారావు రచనలు :**

ఇతను నాలుగు నవలలు 1. వింత ప్రణయం, 2. భవిష్యద్దర్శనం, 3. వెల్లువలో పూచిన పుల్లలు, 4. యుగసంధి. పైన పేర్కొన్న నాలుగు నవలలే కాకుండా 'కృష్ణారావు కథలు''లో 10 కథలు, ''వెన్నెల రాత్రి'' కథల సంపుటిలో 19 కథలు, చంద్రలోకానికి ప్రయాణంలో 9 కథలు, ఒక నాటికల సంకలనం, మొత్తం 40 కథలను రాశాడు.

**వింతప్రణయం నవలలో కుటుంబ చిత్రణ - సాంఘికాచారాలు :**

సమాజంలో పుట్టినప్పటి నుంచి చచ్చేవరకు పాటించే ఆచారాలను సాంఘికాచారాలు అని పిలుస్తారు. మూఢనమ్మకాలు సాంఘికాచారాల కిందికి వస్తాయి. వింతప్రణయం నవలలో సాంఘికాచారాలను పరిశీలిద్దాం.

సంధ్యకు పెళ్ళి చేసే సమయంలో పందిరి అందంగా వేశారు. పెళ్ళిళ్ళ సమయంలో పందిర్లను వేసి అలంక రించడం గ్రామీణ వాతావరణంలో కనిపిస్తుంది. ఇదే ఆచారాన్ని పట్నంలో కూడ పాటిస్తున్నారు. మనము ఎక్కడికి వెళ్లిన మన జానపద ఆచారాలను మరిచిపోము. వింత ప్రణయం నవలలో కూడ ఈ ఆచారాన్ని రచయిత చిత్రీకరించాడు. దానితో పాటు ఆనాటి మూఢనమ్మకా లను ఈ నవలలో మనము చూడవచ్చు. ''షామియానా కింద పెళ్ళి పందిరి వేస్తుండగా, ఆదిలోనే హంస పాదమన్నట్లు పందిరి విరిగి కింద పడ్డది. శుభమా అంటూ, పెళ్ళిచేసుకుంటే, పెళ్ళిపందిరి కాస్తా విరిగింది''.

శుభకార్యాల్లో అశుభం జరిగితే కీడుగా భావిస్తారు. వీలైతే ఆ కార్యాన్ని వాయిదా వేస్తారు. ఇక్కడ సంధ్యకు తెలిస్తే చిరునవ్వు నవ్వి, ఈ విషయం తల్లిదండ్రులకు తెలియకుండా చూసుకుంటుంది.

''సాయంత్రం ఏడు గంటలకి పెళ్లి వాళ్ళు వచ్చి, సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో ఉంటారు. ఎదుర్కోళ్లకు గడప దాటి బయలు దేరుతుండగా ఎవరో తటుక్కున తుమ్మారు'' ఈ మాటలను గమనిస్తే ఆనాడు సమాజంలో అప శకునాలు, మూఢనమ్మకాలు ఎంతగ నమ్ముతున్నారో రచయిత ఈనవల ద్వార తెలియ జేశాడు. పెళ్లికూతుర్ని అత్త గారింటికి సాగనంపేటప్పుడు సాధారణంగా తల్లి దండ్రు లకు ఏడుపు వస్తుంది. సంధ్యను అత్తారింటికి పంపించే టప్పుడు ఇక్కడ అదే జరిగింది.

''ఎందుకో ఆ క్షణాన సంధ్య ఒక వంశంతో తెగతెంపు చేసుకుని, ఇంకొక వంశానికి వెళుతున్నట్లు తోచింది. ఒక నిమిషం వరకు రాని దుఃఖం చంద్రశేఖరరావు అమ్మ లెమ్మని అనే సరికల్లా ఎందుకు ముంచుకొచ్చిందో తెలియదు. ఎన్నడూ ఏడ్చిఎరగని సంధ్య ఆ క్షణాన తల్లిదండ్రుల్ని,నన్ను, సుధని కౌగిలించుకొని గొల్లున ఏడ్చింది''. మానవ సంబంధాలు సున్నిత భావాలతో

ముడిపడి ఉంటాయి. కూతురును కని పెద్ద చేసి, అత్తవారింటికి సాగనంపేటప్పుడు ఏ తల్లిదండ్రులకైనా సహజంగానే మనసుకు బాధేస్తుంది. నేడు దాదాపుగా అన్ని కుటుంబాల్లో తల్లిదండ్రులతో బిడ్డలకు విడదీయ రాని బంధం ఉంటుంది. రచయిత భాస్కర భట్ల కుటుంబ చిత్రణను చక్కగా హృద్యంగా వివరించారు.

"మధు వచ్చినప్పుడల్లా ఏదో అపశ్రుతి జరుగుతుంది. అలాగే కొత్త ఇల్లుకు మారినప్పుడల్లా అశుభం జరుగు తుంది. మొత్తంమీద కొత్తఇల్లు క్లిష్టసమస్యల్ని తెచ్చిపెడుతుందన్నసుధ మాటలను గమనిస్తే చిన్నచిన్న ఆశుభంవాటికి కీడుగా ఆనాడు సమాజంలో భావిస్తున్నా రని తెలుస్తుంది. మూఢనమ్మకాలపై నమ్మకము ఆ రోజుల్లో మరి ఎక్కువుందని చెప్పవచ్చు. దానికి కారణం నిరక్షరాస్యత ఒకటని చెప్పవచ్చు".

సంధ్య చనిపోయినప్పుడు, చివరికి అంతిమ సంస్కారాలు చేసేటప్పుడు, కొన్ని సాంఘిక ఆచారాలు పాటించారు. శవానికి తెల్లచీర కట్టారు. కుంకుమ పెట్టారు. మొహానికి పసుపు రాశారు. ఒడి బియ్యం పోశారు. చివరికి పాడేపై పడుకోబెట్టి తాళ్లతో బిగించారు. ఈ అంతిమ సంస్కారాలు అన్ని కుటుంబాల్లో చేస్తారు. గ్రామీణ ఆచారాలను సహజంగానే చిత్రీకరించారు.

కుటుంబ చిత్రణ: మానవ జీవనంలో కుటుంబమే ముఖ్యము. కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఉం టుంది. ఇంటి యజమాని తన ఇంటి కోసం ఇంట్లోని వారికోసం అహోరాత్రులు కష్టపడి ఇల్లు నడుపుతాడు. ఈ నవలలో చంద్రశేఖరరావు కూడా చిన్న లాయర్‌గా ఉండి కూతురు సంధ్య పుట్టిన తర్వాత అతనికి కలిసి వచ్చిందని చెబుతాడు. దినదినమానంగా బాగా సంపాదిం చాడు. భార్యను, పిల్లలను మంచిగా పోషించాడు. కూతుళ్లకు మంచి విద్యను అందించాడు.

ఏ తల్లిదండ్రుల కైనా కూతుర్లకు మంచి సంబంధం తేవాలని ఉంటుంది. కానీ కొన్ని సందర్భాల్లో పిల్లలకు ఇష్టమైన సంబంధమే ఒప్పుకోవలసి ఉంటుంది. ఆ తండ్రి బంధాలకు విలువ ఇస్తాడు. మంచి ఇల్లు కడతాడు. "హిమయత్ నగర్ ఆరు రూపాయలకు గజం చొప్పున రెండువేల గజాల ప్లాట్లనుకొని మంచి అందమైన ఇల్లు కడతాడు."

"అల్లుడు డబ్బులేకపోయినా అందమైన వాడు కావాలని జానకమ్మ కోరుకుంటుంది. తెలివిగలవాడు, గుణవంతుడు కావాలని చంద్రశేఖర రావు కోరుకుంటాడు. అందుకే సంధ్యకు వెంకట్రావుతో పెళ్లి వద్దు అంటారు." కానీ సంధ్య వినదు. తప్పని పరిస్థితుల్లో పెళ్లికి ఒప్పుకోక తప్పదు. ఈ విధంగా కుటుంబంలోని బంధాలను విడదీయలేని విధంగా రచయిత ఈ నవలలో చిత్రీకరిం చాడు.

## స్త్రీల అలంకారాలు :

స్త్రీలు అలంకార ప్రియులు. ఎక్కడికైనా పెళ్లిళ్లకు కానీ, పేరంటానికి కానీ, ఫంక్షన్లకు వెళ్లినప్పుడు ఆడవారు అలంకారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఇది సమాజంలో ఆడవారి సహజ స్వభావం. వింత ప్రణయం నవలలో కూడా ఉన్న స్త్రీ పాత్రలు అలంకరణకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో చూద్దాం.

"ఒకరోజు సంధ్య, జ్యోత్స్న, సుధ, మధును తమ ఇంటికి ఆహ్వానించారు. ఆ సమయంలో ఉదయమే ముగ్గురు తలంటునీరు పోసుకున్నారు. భోజనాలు చేసి, జడలు వేసుకొని, ముస్తాబులలో నిమగ్నమైనారు. సంధ్య లేత గులాబీరంగు చీరకట్టింది. మరీ లేతరంగు జాకెట్టు వేసుకుంది. చీర రెండింటిలో మ్యాచ్ అయ్యే, జరీ జాకెట్ తొడిగింది. ఆనాడు సుధ పితాంబర ధారినీ అయి, సమస్త లోకాల్ని మోహింప చేసేటట్లు కనబడింది".

పై విషయాలను గమనించినట్లయితే ఆడవారు ముస్తాబుకు ఎక్కువ సమయం కేటాయిస్తారని తెలుస్తుంది. అంతేకాక కట్టుకున్న చీర, రవికే, గాజులు మ్యాచింగ్ వేసుకుంటారు. సమాజంలో ఆకర్షణీయంగా, అందంగా ఉండాలని వారు కోరుకోవడం సహజంగా ఉండే పనే. వారికి అలంకరణే అందాన్నిస్తుంది. అది నాడు, నేడు సమాజంలో ఉంది. ఈ విధంగా వింత ప్రణయం నవలలో ఆనాటి సాంఘికాచారాలను, మూఢనమ్మకా ల0ను, కుటుంబ బంధాలను, జీవన విధానాన్ని చాల చక్కగా వివరించారు. ❖

# కథా సంకలనాల్లో రచయిత్రుల కథల్లో ప్రాంతీయ అస్తిత్వం

- పరుచూరి మౌనిక, పరిశోధక విద్యార్థి, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

## ప్రస్తావన :

ఆధునిక వచన రచన ప్రక్రియలో ప్రముఖమైన కథ, మానవుని ఊహ ఏనాడు రెక్క విప్పుకొన్నదో ఆనాడే పుట్టింది కథ అని పోరంకి దక్షిణామూర్తి 'కథానిక స్వరూప స్వభావాలు' అనే గ్రంథంలో పేర్కొన్నారు. కథ విస్తృత ప్రచారాన్ని, విశేష పాఠకుల ఆచరణను పొందింది. సంక్షిప్తత, సమగ్రత, పఠన సౌలభ్యం, తక్షణానుభూతి మొదలైనవి కథకు ఉన్నటువంటి అనుకూలాంశాలు.

ఒక రచయిత రాసిన కథలు ఒక పుస్తకంగా ముద్రిస్తే కథా సంపుటి అని, వివిధ రచయితలు రాసిన కథలు ఒకే పుస్తకంగా ముద్రిస్తే కథా సంకలనం అంటారు. ఇప్పటి వరకు చాలా రకాలు కథా సంకలనాలు వచ్చాయి. వాటిని కొన్ని విభాగాలుగా చూస్తే అభ్యుదయోద్యమ కథలు, దళిత కథలు, స్త్రీవాద కథలు, విప్లవోద్యమ కథలు, ప్రాంతీయ కథలు కనిపిస్తాయి. కేంద్ర సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, విశాలాంధ్ర వంటి ప్రచురణ సంస్థలు, వివిధ జిల్లాలోని రచయితలు కథా సంపుటాలు, కథా సంకలనాలు ఉపయోగపడుతున్నాయి.

## ప్రాంతీయ అస్తిత్వం - విషయ పరిచయం :

అస్తిత్వ ఉద్యమాలు తెలుగు సాహిత్యంలోకి 1980 తర్వాత ప్రవేశించాయి. వీటితో పాటే ప్రాంతీయ అస్తిత్వం వెనువెంటనే నడిచింది. భౌగోళికంగా తెలుగు ప్రాంతం నాలుగు భాగాలుగా చెప్పబడుతున్నప్పటికీ ఔతిరీత్యాం ఇవన్నీ ఒకే గొడుగు కింద పండడం గమనార్హం. 2014 తర్వాత రాష్ట్ర విభజన జరిగినప్పటికీ జాతిపరంగా రెండు రాష్ట్రాలు తెలుగుజాతిగానే పిలువబడుతున్నది. ఒక భౌగోళిక ప్రాంతం లేదా ఉపప్రాంతంలోని వివిద సముదాయాల సామాజిక వర్గాల ప్రత్యేక లక్షణాలను, భావాలను, విశ్వాసాలను ప్రతిఫలించే నిర్దిష్ట లక్షణాలను ప్రాంతీయ అస్తిత్వం అని మనం స్థూలంగా నిర్వచించుకోవచ్చు. అస్తిత్వం అనేది ఒక ప్రాంతానికి ఉన్న మౌనిక స్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది. "ఒక ప్రాంత ప్రజలు అస్తిత్వాన్ని ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, అక్కడి వ్యవస్థ - ప్రజల జీవన విధానం వంటివి నిర్ణయిస్తాయి. రాయల సీమ బతికి చెడిన గడ్డ. మూడు దశాబ్దాల క్రితం ఇతర ప్రాంతాల వాళ్ళకు నీడ నిచ్చిన ప్రాంతం ఇవాళ పక్షులెగిరి పోయిన చెట్టులాగే తయారైంది. వీటిని కేంద్రీకృతంగా చేసుకొని వచ్చిన సాహిత్యమంతా ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్యంగానే చెప్పబడుతుంది.

తెలంగాణ నుండి అల్లం రాజయ్య కొలమంటుకుంది నవల రాయడం, ఉత్తరాంధ్ర నుండి చాసో సంపాద కత్వంలో కళింగాంధ్ర కథలు రాయడం, నాగావళి కథలు, వంశధార కథలు, కథా పార్వతీపురం, రాయలసీమ నుండి సింగమనేని నారాయణ సంపాదకత్వాన సీమకథలు రావడం మొదలైనవన్నీ ప్రాంతీయ అస్తిత్వ తాత్త్విక భూమిక నేపథ్యంలో వచ్చినవే.

ప్రాంతీయ కథా సంకలనాల రచయిత్రుల కథల్లో ప్రాంతీయ అస్తిత్వాన్ని చిత్రించిన కథలు. అవి

1. చేదుమాత్ర
2. రెండు సందర్భాలు
3. గాయాలు
4. ధృతరాష్ట్రుని కౌగిలి

## చేదుమాత్ర :

చిలుకూరి దీవెన రాసిన 'చేదుమాత్ర' అనే కథలో పద్మావతి విశ్వవిద్యాలయంలో ధనలక్ష్మి ఎం.ఏ. చదువు తుంటుంది. కోస్తాంధ్ర విద్యార్థులు రాయలసీమ యాసను అవమానిస్తూ వెటకారంగా మాట్లాడుతున్న తీరును రాయలసీమ విద్యార్థులు ప్రతిఘటిస్తారు. ఈ ప్రపంచంలో మనుషులు మాట్లాడే ప్రతి భాష గొప్పదే! ప్రతి భాష ఒక అద్భుతమే! ఏ భాష తక్కువ కాదు. అలాగే భాషకు సంబంధించిన ఏ మాండలికం తక్కువ కాదు' అని ధనలక్ష్మీ రాయలసీమ భాషకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

## రెండు సందర్భాలు :

కె. సుభాషిణి రాసిన 'రెండు సందర్భాలు' అనే కథలో రాయలసీమ జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించడం కోసం రాయలసీమ ప్రాంతవాసులు అందరూ నీటి సమస్యలు పరిష్కరించడం కోసం సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని కోరుతూ ఉద్యమంగా వచ్చారు. వారందరికీ కళాశాల అధ్యాపకురాలు అయిన శ్రీలత తన మద్దతు పలుకు తుంది. వారిని ఉద్దేశించి మాట్లాడుతుంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి రాయలసీమ ప్రాంతానికి అన్యాయం జరిగిందని అందుకు ప్రధాన కారణం కోస్తాంధ్ర ప్రజలేనని నిలదీస్తుంది. ఆంధ్ర ఉద్యమంలో రాయలసీమ ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారని గుర్తు చేస్తుంది. రాయలసీమ నీటి ఎద్దడిని పరిష్కరించడానికి కృష్ణా - పెన్నా ప్రాజెక్టు మంజూరు అయినప్పటికీ దానిని ప్రజలకు దక్కకుండా దూరం చేశారంటుంది. ఆమెకు మద్దతుగా శీను కూడా మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టును భూములు ఇచ్చిన రాయలసీమ రైతులు నిరాశ్రయు లయ్యారని దాని లబ్ధిపొందేవి మాత్రం కోస్తాంధ్ర ప్రజలను వివరిస్తాడు. భవిష్యత్తులో రాయలసీమ విద్యార్థులకు, రాయలసీమకు జరిగిన అన్యాయాన్ని పాఠాలుగా చెప్పాలని భవిష్యత్తరాన్ని చైతన్యవంతం చేసేలా ప్రతి ఒక్కరు సంకల్పించుకోవాలంటుంది శ్రీలత.

## గాయాలు :

కె.సుభాషిణి రాసిన 'గాయాలు' అనే కథలో కథకు రాలి కూతురు. విజయవాడలో చదువుకుంటూ సెలవుల్లో ఇంటికి వస్తుంది. విజయవాడలో ఉన్న తన తోటి విద్యార్థులు రాయలసీమ ప్రాంతం గురించి ఇక్కడ తిండి గురించి అవహేళనగా మాట్లాడుతున్నారని తల్లికి చెప్తుంది. బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్న కథకురాలు తన కూతురు చెప్పిన మాటలు విని. తనకు ఎదురైన అనుభవం గుర్తు చేసుకుంటుంది తనతోపాటు పనిచేస్తున్న నరేష్ కోస్తాంధ్ర నుండి రాయలసీమకు ఉద్యోగ నిమిత్తం వస్తాడు. ఇక్కడ ఉన్న తిండి, ఇక్కడ ఉన్న భౌగోళిక పరిస్థితులను పూర్తిగా అసహ్యించుకుంటూ రాయలసీమ. ప్రాంతం కంటే కోస్తాంధ్ర ఎన్నో రెట్లు గొప్పది అంటుంటాడు. అందుకు కథకురాలు పూర్తిగా ఆక్షేపిస్తుంది. మా ఇండ్లను, ఊళ్ళను ముంచి మా నీళ్ళను మీరు తీసుకుపోయారు ఒకా నొకప్పుడు మీ ఊళ్ళ కూడా ఇలానే ఉండేవి అన్న విషయం మీరు మర్చిపోయినట్టున్నారు.

## ధృతరాష్ట్రుని కౌగిలి :

కె. సుభాషిణి రాసిన 'ధృతరాష్ట్రుని కౌగిలి' అనే కథలో రాయలసీమ 'మెరుసుసీమ' అని ఆంధ్రప్రదేశ్‌కు మొరుసు సీమ నుండి ముఖ్యమంత్రులు అయినా. ఈ ప్రాంతం మాత్రం అభివృద్ధికి నోచుకోని దుస్థితి ఈ కథ తెలియ జేసింది. సీమలోని పశువులు తిండిలేక బక్కచిక్కి ఉం డడం, కోస్తాంధ్ర పశువులు బాగా బలిసి ఉండడం, సీమలో నీళ్ళు లేక తాగునీటికి ఇబ్బంది పడుతుండడం, కోస్తాంధ్ర ప్రాంతంలో నీరు పుష్కలంగా ఉండడం వంటివి. ఈ ప్రాంతానికి ఆ ప్రాంతానికి మధ్య వ్యత్యాసం. స్పష్టంగా చూపిస్తోంది. ముఖ్యమంత్రి పదవి రాయలసీమ వెనుకబాటుకు నీరు, పారిశ్రామీకరణ లేకపోవడమేనని ఈ కథ స్పష్టం చేసింది.

## ముగింపు :

కథా సంకలనాలు, కథా సంపుటాలు కథకు శాశ్వతాన్ని కల్పించడానికి, వివిధ ప్రాంతాల రచయిత్రుల కథల ద్వారా మాండలిక భాష, యాసలు తెలుసుకోవడానికి, ఆయా కాలంలో వచ్చిన ఉద్యమాలు, సామాజిక వాస్తవా లను ప్రాంతీయ కథా సంకలనాల్లో రచయిత్రులు వివరించారు.

## ఉపయుక్త గ్రంథాలు :

1. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం - (2006) కథాంశం (తెలుగు కథానిక సాహిత్య విమర్శ), అనంతపురం.
2. నారాయన, సింగమేని (సం.) - తెలుగు కథకులు - కథన రీతులు, విశాలాంధ్ర పబ్లిషింగ్, హైదరాబాద్.
3. శ్రీధర్ వెల్దండి - తెలుగు కథ - ప్రాంతీయ అస్థిత్వం.
4. దీవెన చిలుకూరి - చిలుకూరి దీవెన కథలు.

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# బంజారాల గేయాలు - ప్రదర్శన కళలు

**– బానోతు కవిత,** పరిశోధక విద్యార్థి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్.

సృష్టిలో చిన్న పెద్ద తేడాలు లేకుండా మరియు కుల, మత భేదాలు లెక్కించకుండా అందరి మనస్సులను రంజింపచేసేది కళ అనబడుతుంది. జానపద విజ్ఞానంలో జానపద ప్రదర్శన కళల మీద గత 50 సంవత్సరాల నుండి పరిశోధనలు జరుగుతున్నవి. జానపద ప్రదర్శన కళల పైన విస్తృతమైన అధ్యయనం నాటి నుండి నేటికి జరుగుతున్నప్పటికీ అనేక ప్రదర్శన కళలు ఇంకా మరుగున పడి ఉన్నాయి. గిరిజన విజ్ఞానం మీద చెప్పుకో దగ్గ పరిశోధనలు ఇంకా వెలువడవలసి ఉంది. అలాగే ముఖ్యంగా బంజారా సాహిత్యంపై ఇప్పుడిప్పుడే మంచి పరిశోధనలు జరుగుతున్నాయని పెద్దన అభిప్రాయం. ఆటపాటలు తెలియని బంజారాలెవరూ ఉండవు. కాని అక్షరజ్ఞానం తెలియనివారు ఉన్నారంటే నమ్మవచ్చు. భారతదేశం అనేక కళా సంస్కృతులకు నిలయమైంది. అందులో లంబాడీల సంస్కృతి సాంప్రదాయాలు చాలా ఉన్నతమైనవి. లంబాడీ సాంప్రదాయక ఆభరణాలు, వస్త్రాలు ఆకర్షణీయమైనవే కాక ప్రపంచంలో ప్రసిద్ధి కెక్కినవి. అట్టి బంజారా సంసృతి సాంప్రదాయ ప్రదర్శన కళల కార్యక్రమాలను భారతదేశంలో అతి ముఖ్యమైన అతిరథ మహారథులైన రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి వంటి మహానుభావుల సమక్షంలో ప్రదర్శించి, మహనీయుల ప్రశంసలు పొంది భారత దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చిన సంస్కృతి బంజారాలదని చెప్పవచ్చును. ‘‘నింగిలోని చుక్కల్లో చందమామ వెలుగు ఎలాంటిదో అనేక సంస్కృతులు, కళలలో బంజారా తెగ సంస్కృతి, కళలు అలాంటివి. అలాంటి గొప్ప కళా సంస్కృతి నేడు ప్రపంచీకరణలో భాగంగా సామ్రాజ్యవాద, విష సంస్కృతి దాడికి కను మరుగైపోతున్నది. కావున గిరిజన ప్రదర్శన కళలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గిరిజనుల జీవనం ప్రకృతికి దగ్గరగా ఉంటుంది. ప్రకృతితో ముడిపడి ఉన్నందున వీరిలోని సాహిత్యం కూడా ప్రకృతిని, ప్రకృతి దేవతలను ఆరాధించేవిగా ఉంటాయి. బంజారాలకి తమ కళలను ఒక వేదికపై ప్రదర్శించే అవకాశం తక్కువ. గేయం గురించి తెలుగు కాని శాస్త్రీయ సంగీతం తెలియదు. బంజారాల సహజ ఆలాపనే వారి సంగీతం, శాస్త్రీయ నాట్యం. నృత్యం వారికి తెలియదు. కాని పాటకు, డప్పుదరువుకు లయబద్ధంగా ఆడడం మాత్రం వారిలో ఎక్కువ కనిపిస్తుంది. నాటకం గురించి తెలియదు కాని నాటకాలను తిలకించి ఆనందపడతారు.

గోత్రానికి ఒక కళాకారుల బృందం ఉండేదట. వీరు బంజారాలకు సేవకులు కూడాను. పెళ్ళిళ్లలో పండుగల్లో వంశ చరిత్రను లయబద్ధంగా గానం చేసి వారిచ్చే కానుకల రూపంలో పెయ్యదూడను తీసుకుంటారు. బుర్రకథలోని ప్రధాన కథకుడు ఉపయోగించే ‘రబాబ్’ (తబూర) వంటి పరికరాన్ని ‘తాళం’ అనే వంత వాద్యాన్ని వాయిస్తూ పాటలకి లయబద్ధంగా ఆలపిస్తారు. వీరి సంగీతం రాజస్థానీ జానపద సాహిత్యానికి దగ్గర సంబంధం కలిగి ఉంటుంది.

పృథ్వీరాజ్ చౌహాన్ ఆస్థాన కవి భాట్ బంజారాయేనని చరిత్రకారుల అభిప్రాయం. దీనికి సంబంధించిన ఒక కథ కూడా ప్రచారంలో ఉంది. మూడో అధ్యాయంలో బంజారా జాతి ఆవిర్భావం అంశంలోని పృథ్వీరాజ్ చౌహాన్ కథకు వివరణ వ్రాయడం జరిగింది. ఈ విధంగా చరిత్రలో నిలిచిన చాంద్ బర్ధాత్ కూడా భాట్ బంజారాయే బాట్ ‘పృథ్వీరాజ్ రాసో’ అనే గ్రంథాన్ని కూడా రాశాడని చరిత్రకారులు చెపుతున్నారు.

బంజారాలపై బంజారా కళల ప్రదర్శనపై పరిశోదన చేయడానికి బంజారాలకు సంబంధించిన అనేక

విశేషాలను చరిత్ర విషయాలను దాడి బంజారాలు, భాట్ బంజారాలు అందించారు.

## బంజరాల నృత్యం :

బంజారాల సంస్కృతి జీవన విధానానికి సంబంధించిన ప్రస్తావనలను పరిశీలిస్తే వినోద విలాసాలు, కళారూపాలు, ఆచార వ్యవహారాలు, నృత్యం ప్రధానంగా కనిపిస్తాయి. అదేవిధంగా జానపద నృత్యాలు జనజీవనంలో ఒక భాగంగా విరాజిల్లుతున్నాయి. బంజారా స్త్రీలు అద్దాలతో కట్టిన రంగురంగుల రవికె, పైట, చీర, చేతుల నిండా గాజులు, కాళ్ళకు గజ్జెలు, జుట్టునిండా వివిధ రంగుల పూసలు ధరిస్తారు. చక్కటి వేషధారణతో నృత్యాన్ని చేస్తారు. బంజారాలు చేసే నృత్యాలను వివిధ పేర్లతో పిలుస్తారు. ఇలా ఆదిమజాతుల నృత్యాలు జానపద నృత్యాలకు ఆధారాలనీ జానపద నృత్యాలు శాస్త్రీయ నృత్యాలకు పునాదులనీ ప్రొజెష్ బెనర్జీ అభిప్రాయం.

## నృత్యం నిర్వచనం :

నాట్యశాస్త్రంలో నృత్త పదం లేదనీ, తాండవ నాట్య పదాలే కలవని చెప్పటం వల్ల నృత్తం నుంచే నృత్యం పుట్టి నృత్యకళగా రూపొందిందని కొందరి పరిశోధకుల అభిప్రాయం. జానపద నృత్యం అనేది నృత్తం నుంచి నృత్యం వరకు వ్యాపించి ఉండే వైవిధ్యమైన ఆంగిక చలనం అని ఆర్వీయస్ సుందరం నిర్వచించారు. జానపద నృత్యం ఒక సంఘానికి చెందిన విశిష్ట సాంప్ర దాయాన్ని కాని అందులో భాగమైన విలక్షణమైన సంప్రదాయాన్ని కానీ జీర్ణించుకున్న ప్రాంతీయ నృత్యం అని ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి అన్నారు.

## నృత్యం పుట్టుక :

జానపద నృత్యం మానవుని జీవితానుభవం నుంచి పుట్టింది. వనిపాటల సమయంలో పరిసరాల ప్రభావాన్ననుసరించి మానవుని శరీరంలో కలిగిన అవయవ చలనమే జానపద నృత్యం పుట్టడానికి కారణమై ఉంటుందని కొందరి పరిశోధకుల అభిప్రాయం. మనిషి బతుకులో అనుభవించే సంతోషం, దుఃఖం, వేదన, ఆప్యాయత, పుట్టుక, చావు మొదలైనవి లయాత్మకమైన కదలికగా మారి నృత్యమనిపించుకున్నాయి అని ఆర్వీయస్ సుందరం గారి అభిప్రాయం.

## తండాల నృత్యం :

లంబాడీలు, సుగాలీలు, బంజారాలు అని వివిధ నామాలతో పిలువబడే ఆదిమ జాతివారు నాగరిక సమాజానికి దగ్గరగా పల్లెల్లో, పట్టణాలలో నివసిస్తున్నా తమ కట్టుబాటు, మాట, పాట, ఆట, ఆచార వ్యవహారాలను సంస్కృతిని వందలాది ఏళ్లుగా నిలుపు కుంటూ వస్తున్నారు. ముఖ్యంగా బంజారా మహిళ రంగురంగుల దుస్తులు, రకరకాల ఆభరణాలు చూడ ముచ్చటగా ఉంటాయి. వీరు తండాలుగా జీవిస్తారు పెళ్ళిళ్ళలో, హోలి పండుగలు, తీజ్ పండుగలు, సీత్లా పండుగలు, జాతరలలో వీరి సాంప్రదాయక సామూహిక నృత్యం నేత్రపర్వంగా ఉంటుంది. ఇలా బంజారాల స్త్రీల వలయాకారంగా తిరుగుతూ చేతులను లయానుగుణంగా పైకి ఎత్తుతూ కిందికి దించుతూ డప్పుకు అనుగుణంగా నృత్యం చేస్తారు. వీరి నృత్యం ప్రదర్శన గేయాలాపన ఎక్కువగా సామూహికంగానే ఉంటుంది. హోలి పండుగలో ముఖ్యంగా పురుషులే పాల్గొంటారు. బంజారాలు హోలి పండుగ సందర్భంగా చేసే నృత్యం కన్నుల పండుగగా ఉండి చూసేవారి మనస్సుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపుతుంది.

## డప్పు నృత్యం :

ఈ విధంగా బంజారాల్లో ఏ ఉత్సవానికైనా తండాల్లో విశేషంగా ఉపయోగపడే ఉద్రేకాన్ని, ఉత్తేజాన్ని కలిగించే డప్పు వాద్యానికి అనుగుణంగా అడుగులు వేస్తూ చేసే నృత్యం డప్పు నృత్యం. ఈ నృత్యం ముందు మెల్లగా ప్రారంభమై రానురాను వాయిద్యంతో పాటు పద విన్యాసాలు ఉధృతమై, ఉత్తేజం కలిగిస్తుంది. లంబాడీ తండాలలోని అన్ని పల్లె ప్రాంతాలలోను డప్పు ఉనికి మనకు కనిపిస్తుంది.

**బంజారా వృత్తి కళాకారులు :**

లంబాడీ గోత్రనామాలను చెబుతూ వారి వంశంలోని గొప్పతనాన్ని పొగుడుతూ ఇచ్చింది పుచ్చుకొని జీవనం గడిపేవారు. పూర్వకాలంలో ఢాడీలు. ఢాడి బంజారాలే కాకుండా, భాట్ బంజారాలది కూడా ఇదే వృత్తి. వారు నిమిషాల్లో కథలు, కవిత్వం అల్లేస్తారు. ఈ భాట్, ఢాడి బంజారాలను వృత్తి కళాకారులుగా పేర్కొనవచ్చు. వీరు బంజారాల్లో ఒక ఉపతెగగా గుర్తించ బడుతున్నారు. బంజారాల 'లదణి' (వలస)లో వారి వెంట ఈ కళాకారులు కూడా వచ్చినారని బంజారా వయో వృద్ధులు చెపుతారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. బంజారా సంస్కృతి, ప్రదర్శన కళలు : జి. శంకర్‌నాయక్.
2. బంజారాల సాహిత్యం - జీవన చిత్రణ : డా॥. సూర్యాధనుంజయ్.
3. ప్రపంచ తెలుగు మహాసభలు, 15-9-2017.
4. బంజారాల తీజ్ పండుగ - ఆచార్య భట్టు రమేష్.
5. తాంగ్డి (బంజారా సాహిత్య సమాలోచన) - డా॥. సూర్యాధనుంజయ్.

❖❖❖

భావవీణ

# BHAVA VEENA

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253

Journal of Arts, Literary, Culture & Language Study

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

April 2024

































































Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.

E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494 660 509.